ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
1-10-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 241 పేజీలు: 8+16 వెల: 6.50

పదవీ విరమణ చేసిన డిజిపి జితేందర్‌కు ఘనంగా వీడ్కోలు 3
ఫిబ్రవరికి ముందే హెచ్-1బి వీసాల్లో మార్పులు 5


మంగళవారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ వేడుకల దృశ్యం

# బతుకమ్మల 'బండ్'!

### ఘనంగా సాగిన వేడుకల ముగింపు

### హాజరైన మంత్రులు జూపల్లి, కొండా సురేఖ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు30:** బతుకమ్మ వేడుకల ముగింపు కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా జరిగింది. బతుకమ్మ పండుగ చివరి రోజు కావడంతో.. భాగ్యనగరం అంగరంగ వైభవంగా ముస్తాబైంది. ఈ నేపథ్యంలో ట్యాంక్‌బండ్‌పై రాత్రి పొద్దుపోయాక నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. మహిళలు రంగురంగుల పువ్వులతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. బతుకమ్మ చుట్టూ.. చప్పట్లు కొడుతూ, పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. తొమ్మిది రోజులు జరిగే... బతుకమ్మ పండుగలో రోజుకో ప్రత్యేకత ఉంటుంది. సంస్కృతి సాంప్రదాయాలకు పట్టుకొమ్మగా నిలిచే బతకమ్మ పండుగలో మంగళవారం చివరి ఘట్టమైన సద్దుల బతుకమ్మ. ఈ బతుకమ్మ పండుగ స్త్రీ అస్తిత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. బతుకమ్మ ముగింపు వేడుకల >>2

# నిలిచేదెవరు! గెలిచేదెవరు?




## పంచాయతి ఎన్నికల్లో రిజర్వేషన్లపై గందరగోళం

### పండుగవేళ ఓటర్లకోసం ఖర్చుపెట్టాలా, వద్దా?

### బిసిలే లేనప్పుడు రిజర్వేషన్లెందుకు?

### మార్చాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన గ్రామస్థులు

### మంత్రులతో సిఎం రేవంత్‌రెడ్డి విడియోకాన్ఫరెన్స్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు30:** పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల గందరగోళం నెల కొంది. కొన్ని చోట్ల పోటీకి అభ్యర్థుల లేరు. నిర్మల్: హన్మాన్ తండా, ఆదిలాబాద్: సావర్గాం,పిచర,అరెపల్లి, నల్లగొండ: తూర్పు తండా, జైత్రాంతండా, నూనావత్ తండా, బాండావత్ తండా, గోన్య తండా, మాన్ తండా, బాలజీనగర్ పంచాయతీల్లో ఒక బీసీ లేకున్నా సర్పంచ్ పోస్టు బీసీలకు రిజర్వయ్యాయి. ఖమ్మం: మంగళితం డాలో ఓ మహిళ,ధర్మతండాలో ఓ దంపతులు బీసీలు కావడంతో వారిఎన్నిక లాంఛనంగా మారనుంది. కామారెడ్డి జిల్లాలోని గ్రామపంచాయతీల సర్పంచి, వార్డు సభ్యుల రిజర్వేషన్ల కేటాయింపుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేటాయింపు విధానంపై జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సామాజిక వర్గాలకు చెందిన ఓటర్లు గ్రామాల్లో లేనప్పటికీ అదే సామాజిక వర్గానికే సర్పంచి, వార్డు స్థానాలను రిజర్వు చేశారని పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో తమ గ్రామంలో ఎవరు ఎన్నికల బరిలో నిలుస్తారు? ఎవరు గెలుస్తారు? అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా అయితే పాలకవర్గం లేక తమ గ్రామ అభివృద్ధి అధోగతి పాలవుతుందని వాపోతున్నారు. జిల్లా అధికారులు ఇటీవల గ్రామాల్లోని సర్పంచి, వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఖరారు చేసిన విషయం తెలిసిందే. కొన్ని సామాజిక వర్గాల వారు గ్రామంలో లేనప్పటికీ ఆ వర్గానికి సీటు రిజర్వు చేశారని, దీంతో పాలకవర్గ సభ్యులు కరవై నిధులు రాక అభివృద్ధి మందగిస్తుందని ఆగ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామంలో తక్కువ ఓటర్లు ఉన్న సామాజిక వర్గం వారికి రిజర్వేషన్ కేటాయించారని కొన్నిగ్రామాల ప్రజలు వాపోతున్నారు. గతంలో కేటాయించిన సామాజిక వర్గానికే మళ్లీ ఈ సారి కేటాయించారని మరికొన్ని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కామారెడ్డి జిల్లా పల్వంచ మండలంలోని ఓ గ్రామ సర్పంచి, ఎంపీటీసీ స్థానం రిజర్వేషన్లను వరుసగా గత 3 ఎన్నికల్లో ఒకే సామాజిక వర్గానికి కేటాయించారు. ఈ >>2



## థర్మల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం

### 9 మంది కార్మికులు మృతి

### 15 మందికి గాయాలు

**ఎన్నూర్, సెప్టెంబరు 30:** చెన్నైలోని ఎన్నూర్‌లో థర్మల్ పవర్ ప్లాంట్ విస్తరణ పనుల్లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఆర్చ్‌కూలి తొమ్మిది మంది కార్మికులు మృతి చెందారు. 15 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఈఫ్యాక్టరీ నిర్మాణ పనులు కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్నాయి. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వందలాది మంది కార్మికులు ఎన్నూర్‌లో పనులు చేస్తున్నారు. మంగళవారం చేపట్టిన పనుల్లో ప్రమాదం చోటు చేసుకున్నది. ప్లాంట్ ముఖభాగంపై ఏర్పాటు చేసిన స్కాఫోల్డింగ్ అకస్మాత్తుగా కూలిపోయింది. దీంతో తొమ్మిది >>2

# టార్గెట్ @ 763 టిఎంసీలు

## నీటి వాటా పట్టాలి.. కొత్త ప్రాజెక్టులు కట్టాలి!

### కృష్ణాజలాల్లో నీటిని ఎలాగైనా ఒడిసిపట్టాలంటున్న సర్కార్

### జూరాల వరద కాలువతో 100 టిఎంసిల వినియోగానికి కసరత్తు

### కృష్ణా బేసిన్‌లో జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దే దిశలో ప్రభుత్వం

**హైదరాబాద్,సెప్టెంబరు 30,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా నదిలో 763 టిఎంసిల నీటివాటాను ఎలాగైనా ఒడిసిపట్టాలని అదే విధంగా ఆ నీటిని కొత్త రిజర్వాయర్లు నిర్మించి, ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టుల సామర్థ్యంపెంచి కృష్ణాబెసిన్‌ను పచ్చలహారంగా తయారించాలనే ఉక్కు సంకల్పంతోఉంది. జూరాల వరద కాలువతో 100 టిఎంసిలు బీడుభూములకు తరలించి ఉమ్మడి నల్లగొండ,మహబూబ్‌నగర్,వరంగల్ ఖమ్మం జిల్లాలలో పదకొండులక్షలకు పైగా ఆయకట్టు స్థిరీకరణ చేయాలనే సమాచాలోచనలు జరుగుతున్నాయి. కృష్ణజల వివాదాల ట్రిబ్యునల్ బ్రిజేష్‌కుమార్ విచారణకు రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి హాజరుకావడం


కృష్ణా బేసిన్‌లో నూతన ప్రాజెక్టులు, నీటి వినియోగంలో తమ అత్యంత ప్రాధన్యత అని వ్యక్తికరిస్తున్నది. అంతే కాదు అదనపు నీటి వినియోగానికి, కొత్త రిజర్వాయర్ల నిర్మాణానికి సమగ్ర ప్రాజెక్టు నివేదికలు తయారు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఇప్పటికే ప్రభుత్వం ఆదేశించింది. వినియోగంలో ఉన్న ప్రాజెక్టుల సామర్థ్యం పెంపు, గతంలో సర్వేల కోసం ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత ముందుకు పడని పలు ప్రాజెక్టులను తెరపైకి తీసుకువస్తున్నది. కృష్ణాబేసిన్‌లో 16 పథకాలకు సర్వే, ఇన్వెస్టిగేషన్, సమగ్ర ప్రాజెక్టు నివేదికల తయారీకి నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పలు దఫాలుగా నీటిపారుదలశాఖ అధికారులు, సలహాదారులు, సీనియర్ న్యాయవాదులు, అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం ఇంజినీర్లతో ఇటీవల అనేక పర్యాయాలు చర్చించారు. మంగళవారం నుంచి మూడురోజులు ఢిల్లీలో కొనసాగిన కెడబ్ల్యుడిటి -2 విచారణ సందర్భంగా నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమక్షంలోనే కృష్ణానదిలో 1050టిఎంసిల నీటిలో 763 టిఎంసి నీటి వాటా కేటాయించాలని బలంగా వాదనలు వినిపించారు. >>2



## 'రేషన్' సమ్మె వాయిదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు30:** రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఇచ్చిన స్పష్టమైన హామీతో బుధవారం నుంచి తలపెట్టిన సమ్మెను తాత్కాలికంగా విరమించుకున్నట్లు రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు తెలిపారు. తమ సమస్యలపై కమిషనర్‌ను కలిసి చర్చించినట్లు తెలిపారు. తానిప్పుడే కొత్తగా వచ్చానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అయితే కొంత సమయం కావాలని కమిషపర్ చెప్పారని వెల్లడించారు. అంతకు ముందు కమీషన్ బకాయిలు చెల్లించకపోవడంతో బుధవారం రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాలు మూసివేసి నిరసన తెలపాలని రేషన్ డీలర్లు నిర్ణయిచుకున్నారు. తమకు ప్రభుత్వం నుంచి ఆరు నెలల కమీషన్ బకాయిలు రూ.120 కోట్లు, గన్నీ సంచుల డబ్బులు రూ.6 కోట్లు, కెవైసికి సంబంధించిన రూ.15 కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని డీలర్లు చెబుతున్నారు. బకాయిలు విడుదల చేయడంతో పాటు తక్షణమే హామీలు >>2




# 54 వర్సిటీలకు యుజిసి నోటీసులు

### నిబంధనలకు నీళ్లు వదలడమే కారణం

### వెబ్‌సైట్లలో విద్యార్థులకు అవసరమైన సమాచారం విస్మరించిన వైనం

### జాబితాలో గుజరాత్, హర్యానా, రాజస్థాన్, కర్ణాటక, మహారాష్ట్ర విశ్వవిద్యాలయాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** దేశవ్యాప్తంగా నిబంధనలు పాటించని ప్రైవేట్ యూనివర్సిటీలపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కఠిన చర్యలకు ఉపక్రమించింది. విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవసరమైన కీలక సమాచారాన్ని తమ వెబ్‌సైట్లలో పొందుపరచడంలో విఫలమైన 54 ప్రైవేట్ యూనివర్సిటీలకు తాజాగా నోటీసులు జారీ చేసింది. ఈ చర్య ఉన్నత విద్యారంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచే దిశగా యూజీసీ తీసుకున్న కీలక నిర్ణయంగా వినిపిస్తోంది. యూజీసీ నిబంధనల ప్రకారం, ప్రతి యూనివర్సిటీ తమ వద్ద అందుబాటులో ఉన్న కోర్సులు, ఫ్యాకల్టీ వివరాలు, విద్యార్థుల సంఖ్య, మౌలిక వసతులు, ఆర్థిక వ్యవహారాల వంటి పూర్తి సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ఎటువంటి లాగిన్ లేదా రిజిస్ట్రేషన్ అవసరం లేకుండా ఈవివరాలను ఎవరైనా సులభంగాచూసే వీలు కల్పించాలి. అయితే, ఈ నిబంధనలను 54 వర్సిటీలు ఏమాత్రం >>2

# హై కోర్టు తీర్పు మేరకే ఆదిత్యా కేడియాకు అనుమతి



### ఎలాంటి నిబంధనోల్లంఘన జరగలేదు: హెచ్ఎండిఎ

**హైదరాబాద్,సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** హైకోర్టు తీర్పును అనుసరించి రంగారెడ్డి జిల్లా మంచిరేవుల గ్రామంలో ఆదిత్య కంపెనీ నిర్మాణ సంస్థకు హెచ్ఎండిఏ అనుమతు లను పునరుద్ధరించిందని,ఇందులో ఎలాంటి నిబంధనల ఉల్లంఘన జరగలేదని హెచ్ఎండిఏ అధికారులు తెలిపారు. 2022 లోనే ఆదిత్య కేడియా రియాల్టర్స్ కంపెనీకి రంగారెడ్డి జిల్లా గండిపేట మండలంలోని మంచిరేవుల గ్రామంలో 9.19 ఎకరాల విస్తీర్ణంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణానికి హెచ్ఎండిఏ అనుమతులు ఇచ్చిందని,అయితే, మూసీ నది బఫర్ జోన్ ను ఆక్రమించి అక్కడ రిటైనింగ్ వాల్‌ను నిర్మించినట్లు 2023 జూలై 3న హెచ్ఎండిఏ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చేపట్టిన సంయుక్త తనిఖీల్లో తేలిందన్నారు.2 ఆగస్టు 2023 నాడు ఆ సంస్థకు హెచ్ఎండిఏ షోకాజ్ నోటీసులు జారీ చేసిందని, ఆ సంస్థ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేనందున 18 ఆగస్టు 2023న భవన నిర్మాణ అనుమతులను రద్దు చేసిందన్నారు. రిటైనింగ్ వాల్ ను తొలగించాలని ఆ సంస్థకు హెచ్ఎండిఏ ఆదేశాలు జారీ చేసిందని,అనుమతులను రద్దు చేయడానికి సవాలు చేస్తూ ఆదిత్య సంస్థ హైకోర్టుకు వెళ్లిందన్నారు. మరోసారి జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి నివేదిక ఇవ్వాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. కోర్టు ఉత్తర్వులను అనుసరించి 26 ఫిబ్రవరి 2024న అధికారులు చేపట్టిన జాయింట్ ఇన్స్పెక్షన్‌లో ఆసంస్థ రిటైనింగ్ వాల్ ను >>2




## ఫర్నీచర్, కలపపైనా సుంకాలు

### ట్రంప్ పేల్చిన మరో బాంబు

**వాషింగ్టన్, సెప్టెంబరు 30:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి టారిఫ్‌ల బాంబు పేల్చారు. ముందుగా చెప్పినట్టుగానే ఫర్నిచర్, కలపపై సుంకాల మోత మోగించారు. కిచెన్ క్యాబినెట్, బాత్‌రూమ్ పరికరాలతో పాటు అప్‌హోల్‌స్టర్డ్ ఫర్నిచర్, భారీ ట్రక్కులపై భారీ సుంకాలు విధిస్తానంటూ ఇటీవల ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే ఆ మేరకు తాజాగా కలపపై 10 శాతం, కిచెన్ క్యాబినెట్‌లు, అప్‌హోల్‌స్టర్డ్ ఫర్నిచర్‌పై 25 శాతం సుంకాలను తాజాగా విధించారు. ఇవి అక్టోబరు 14వ తేదీ నుంచి అమల్లోకి రానున్నట్లు తెలిపారు. చైనా సహా ఇతర దేశాల దిగుమతుల కారణంగా ఫర్నిచర్ వ్యాపారానికి కేంద్రస్థానంగా ఉండే అమెరికాలోని నార్త్ కరోలినా రాష్ట్రం దాని ప్రాభవాన్ని కోల్పోయిందని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాలో ఫర్నిచర్ తయారు చేయకపోతే భారీ స్థాయిలో టారిఫ్‌లను వేస్తామని తనసొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో హెచ్చరించారు. ఇక ఇప్పటికే.. సినిమాలపై కూడా ట్రంప్ భారీగా సుంకాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. అమెరికా బయట నిర్మించే సినిమాలపై 100 శాతం అదనపు టారిఫ్‌లు విధిస్తానని ట్రంప్ ప్రకటించారు. ఈ నిర్ణయం వల్ల భారతీయ చిత్రపరిశ్రమపై తీవ్రప్రభావం పడనున్నట్లు సంబంధిత విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో సోమవారం మరోసారి సుంకాల రూపంలో >>2

## కాళేశ్వరం విచారణకు ఎసిబి రెడీ

మరిన్ని ఆర్థిక అక్రమాలు వెలుగులోకి! 2





# మహోగ్ర గోదావరి

### భద్రాచలం వద్ద 50 అడుగులు దాటిన నీటిమట్టం

### ప్రమాదపుటంచుల్లో శబరి పరీవాహక ప్రాంతాలు

### నీటమునిగిన ఎన్‌హెచ్ 326.. ఎపి-ఒడిశా మధ్య స్తంభించిన రవాణా

**చింతూరు సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** గోదావరి ఎగువ ప్రాంతాల్లో తుఫాను ప్రభావంతో కుంభవృష్టి కురుస్తుంది. తెలంగాణ, మహారాష్ట్రతో పాటు అనేక రాష్ట్రాల్లో వర్షాలు దంచికొడుతున్నాయి.దాంతో భద్రాచలం వద్ద గోదావరి నది నీటి మట్టం మంగళవారం రాత్రి ఏడుగంటల ప్రాంతంలో 50 అడుగులు దాటింది.చింతూరు వద్ద శబరి నది నీటి మట్టం 35 అడుగులు దాటింది.గోదావరి ఎగపోటుతో శబరి నదిలో వరదనీరు వచ్చి చేరుతుంది.వాగుల్లో వరద నీరు ఎగబోకటంతో ఎపిలోని ముంపు మండలాలు జలదిగ్బందంలో చిక్కుకున్నాయి. శబరి,గోదావరి నదుల్లో వరద స్దాయి పెరగటంతో రెవెన్యూతో పాటు వివిధ శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు.రోజువారి కార్యకలాపాలను ప్రక్కనబెట్టి వరద పరిస్దితిని సమీక్షించి అలసిపోవటం వారి వంతు అయ్యింది.ఈ విభాగంతలో రెవెన్యూ అధికారులు నలిగిపోతున్నారు.ఎపి-ఒరిస్సాలను కలిపే జాతీయ రహదారి యన్.హెచ్.326 వరద నీటిలో మునిగిపోయింది.రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు పూర్తిస్దాయిలో నిలిచిపోయాయి.శబరి ఎగువ ప్రాంతాల్లో గత వారం రోజలుగా ఎడతెరిపి లేకుండా కుంభ వృష్టి కురిస్తుంది.ఇప్పటికే శబరి నది ఎగువ ప్రాంతాల్లో ఉన్న ఒరిస్సా తీరానికి ఆనుకోని వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఎర్పడింది.దాంతో ఒరిస్సా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి.తెలంగాణాలోని దాదాపు అన్ని జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీచేసింది.భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం 50అడుగులు దాటింది.ఇప్పటికే రెండవ ప్రమాద హెచ్చరిక >>2

# బతుకమ్మల 'బండ్'!

>> కోసం ట్యాంక్ బండ్ ముస్తాబైంది. బతుకమ్మ సంబరాల కోసం అధికారులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. వేలాది మహిళలు అక్కడకు చేరుకుని బతుకమ్మ సంబరాల్లో పాలుపంచుకున్నారు. న్నారు. ఈ వేడుకలకు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రజా ప్రతినిధులు, కార్పోరేషన్ చైర్మన్లు హాజరుకానున్నారు. సాయంత్రం ట్యాంక్ బండ్‌పై గ్రాండ్ ఫ్లోరల్ పరేడ్, హుస్సేన్ సాగర్ లో తేలియాడే బతుకమ్మలు, సెక్రటేరియట్ పై 3డీ మ్యాప్ లేజర్ షో ను నిర్వహించారు. అమర జ్యోతి స్థూపం నుంచి ట్యాంక్ బండ్ బతుకమ్మ ఘాట్ వరకు 700 బతుకమ్మలతో ర్యాలీ చేశారు. బతుకమ్మ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ, టూరిజం కార్పొరేషన్ ఎండీ క్రాంతి, సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల, మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల, డిప్యూటీ మేయర్ శ్రీలత తదితరులు బతుకమ్మ పాటలకు మహిళలతో కలిసి నృత్యం చేశారు. వేడుకల్లో భాగంగా సచివాలయంపై 3డీ మ్యాప్ లేజర్ షో అకట్టుకుంది. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ బతుకమ్మ వేడుకలకు గిన్నీస్ రికార్డులు వచ్చేలా ప్రభుత్వం కృషి చేసిందన్నారు. కొంత మంది గతంలో బతుకమ్మ వేడుకల్లో డిస్కో డాన్సులు ఆడేవాళ్లు, డిస్కో డాన్సుల సాంప్రదాయం ఇప్పుడు లేదు. పూర్వీకులు అందించిన సంప్రదాయాలను కొనసాగిద్దాం అని పేర్కొన్నారు. వరంగల్‌తో సహా రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలు ఘనంగా ముగిశాయి.

# నిలిచేదెవరు! గెలిచేదెవరు?

>> ఏడాదీ అదే వర్గానికి రిజర్వు అయ్యాయి. దీంతో రిజర్వేషన్లను మార్చాలని ఆ గ్రామస్థులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. జిల్లాలోని మరికొన్ని గ్రామాల్లోనూ ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. పెద్దకొడప్‌గల్ మండలం చావనితండా సర్పంచి స్థానాన్ని ఎస్సీ మహిళకు రిజర్వు చేశారు. అక్కడ 8 వార్డులు ఉండగా 4 వార్డులను బీసీలకు, మరో 4 వార్డులను ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించారు. ఇక్కడ అసలు ఎస్సీ ఓటర్లే లేరు. దీంతో చావనితండాలో ఎస్సీలు ఎవరు పోటీచేస్తారు? ఎవరు గెలుస్తారు? అనే ప్రశ్నలు వస్తున్నాయి. నస్రుల్లాబాద్ మండలంలోనూ ఇదే పరిస్థితి. ఈ మండలంలోని అంకోలు గ్రామ సర్పంచి స్థానాన్ని ఎస్టీలకు కేటాయించారు. అక్కడ కూడా ఒక్క ఎస్టీ ఓటరూ లేరు. ఇలాంటి స్థానాల్లో వేరే సామాజిక వర్గానికి కేటాయించడం ఉత్తమమని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. స్థానిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైనప్పటికీ పలు చోట్ల ఆశావాహులకు నిరాశే ఎదురైంది. ఈసారి ఎన్నికల బరిలో నిలవాలని ఆశించినా రిజర్వేషన్ల కేటాయింపులో వారికి అనుకూలంగా రాకపోవడమే దీనికి కారణం, దీంతో వారంతా మరో ఐదేళ్లు ఎదురుచూసే పరిస్థితిఏర్పడింది. పలు చోట్ల సర్పంచ్‌గా నిలుద్దామనుకున్నా వారికి రిజర్వేషన్లు వేరుగా రావడంతో ఎంపీటీసీలుగా పోటీ చేసేందుకు ప్రణాళికలు సిద్దం చేస్తున్నారు. స్థానిక ఎన్నికల షెడ్యూల్‌తో రిజర్వేషన్లపై అశావాహుల్లో అయోమయం నెలకొంది. ఓవైపు కేసు కోర్టులోఉండగానే షెడ్యూల్ రావడమే దీనికికారణం. దీంతో పండుగ పూట ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ఖర్చు పెట్టాలా వద్దా? అనే విషయమై వారు గందరగోళానికి గురువుతున్నారు, ఒకవేళ తీరా ఖర్చు చేశాక రిజర్వేషన్లు రద్దు చేస్తూ తీర్పు వస్తే పరిస్థితి ఏంటని కొందరు ఆలోచిస్తున్నారు. కోర్టు తీర్పు వస్తేనే వీరి ఆందోళనక తెరపడనుంది. సిఎం రేవంత్‌రెడ్డి మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక సంస్థల నేపథ్యంలో పోటీ చేసేందుకు ప్రతి జెడ్పీటీసీ స్థానం నుంచి ముగ్గరి పేర్లను ప్రతిపాదించాలని ఆదేశించారు. అక్టోబర్ 5 నాటికి ఈ ప్రతిపాదనలు సిద్దం చేయాలన్నారు. ఆ జాబితాను టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు అందజేయాలని సూచించారు.

# మహోగ్ర గోదావరి

>> కొనసాగుతుంది. శబరి నది ఉగ్రరూపంతో చింతూరు నుంచి వి.ఆర్.పురం మండలాన్ని కలిపే రహదారి మొత్తం నీటమునిగిపోయింది. దాదాపు వంద గ్రామాలకు రహదారి సౌకర్యం లేకుండా పోయింది. శబరి నదికి ఉపనది అయిన సీలేరు నదిపై ఉన్న దాదాపు ఆరు భారీ ప్రాజెక్టులో నీరు నిండుకుండలా ఉంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతె సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్ళలని అధికారులు సూచనలు చేస్తున్నారు. కూనవరం మండల కేంద్రంలోని అనేక కాలనీలు జలమయం కావటంతో వారిని అధికారులు ఫ్లడ్ షెల్టర్‌లకు తరలించారు. 2006లో కూడా ఇదే స్ధాయిలో శబరి నదికి వరదపోటు రావటంతో ప్రజలు సామాన్లు తరలించే అవకాశం లేకుండా పోవటంతో అప్పట్లో ప్రజలు తీవ్ర నష్టాన్ని చవిచూశారు. అలాంటి పరిస్దితి పునఃరావృతం అవుతుందేమో అనే భయం ఈ ప్రాంత ప్రజలను భయపెడుతుంది. సెప్టెంబర్ చివరిలో కూడా తుఫానుల ప్రభావంతో భారీ వర్షాలు రావటంతో వేలాది ఎకరాల్లో వేసిన వరి పంటలు నీటమునిగి కుళ్ళిపోతున్నారు. ఒకవైపు బ్యాక్ వాటర్ మరో వైపు భారీ వర్షాలతో శబరి, గోదావరి దిగువ ప్రాంతాల్లో ఉన్న ప్రజల గత నాలుగు నెలలుగా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాలకు కనీస రహదారి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

గోదావరి, శబరి నదుల్లో వరద పెరగటం రోడ్లు వంతెనలు మునగటం ప్రజలు అవస్దలు పడటం పరిపాటిగా మారింది. పోలవరం పరిహారం పేరుతో దశాబ్దాలు గడుస్తున్నాయి, సర్వేల పేరుతో కాలకం కరిగిపోతుంది, ముంపు మండలాల్లోని పోలవరం ముంపు గ్రామాల జాబితాలో ఉన్న ప్రజలు నిత్యం వరదలతో నలిగిపోతూ ఎదుగు బోదుగు లేని జీవితంగా మారింది వారి పరిస్దితి. ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన ప్రజల కన్నీటి తుడవటంతో ప్రభుత్వాలు ముందడుగు వేయలేక కాలయాపన చేస్తున్నాయి. పోలవరం పరిహారం ఇస్తె ముంపులేని ప్రాంతాలకు వెళ్ళితమ బ్రతుకేదో తాముబ్రతకాలి అను కుంటున్న భాధితులకల మాత్రం నెరవేరటం లేదు. వర్షాకాలం వచ్చింది అంటె చాలు ప్రతిఒక్కరికి వెన్నులోవణుకు పడుతుంది. గోదావరి-శబరి నదులు వరద నీటితో ఉప్పొంగి దోబూచులాడుతూ ఇక్కడి ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఈ పరిస్దితి నాలుగు నెలలుగా కొనసాగుతుంది. ఇది తాజా పరిస్దితి.

# థర్మల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం

>> మంది కార్మికులు సంఘటనా స్థలంలోనే చనిపోయారు. మృతులంతా ఉత్తరాదికి చెందిన కార్మికులే. భారీ ఆర్చ్ నిర్మాణ పనుల్లో పాల్గొన్న కార్మికులు చనిపోయగా స్కాఫోల్డింగ్ పైన పడడంతో మృతదేహాలన్నీ నుజ్జునుజ్జు అయ్యాయి. 15 మంది కార్మికులకు తీవ్రగాయాలుకాగా వారందరినీ గాయాలతో చెన్నైలోని రాయపురంలోని స్టాన్లీ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఇందులో మరికొందరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన పరిధిలోని అవదీ పోలీస్ కమిషనరేట్ స్పందించింది. ఆర్చి ఎందుకు కూలిందో సరైన కారణాలు తెలియరాలేదని సంఘటనపై కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ప్రకటించింది.

# 'రేషన్' సమ్మె వాయిదా

>> అమలు చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు పేరుకుపోవడంతో దుకాణల అద్దె, హమాలీ కూలి కోసం సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా తమకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం చెల్లించాలని, కమీషన్ పెంచాలని కోరిన సంగతి తెలిసిందే.



మంగళవారం హైదరాబాద్‌లో క్రికెటర్ తిలక్‌వర్మ అందజేసిన బ్యాట్‌తో రేవంత్

## సిఎంను కలిసిన తిలక్‌వర్మ

### రేవంత్‌రెడ్డికి క్రికెట్ బ్యాట్ బహూకరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 30:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా యువ క్రికెటర్ తిలక్ వర్మ కలిశారు. ఆసియా కప్2025 ఫైనల్ మ్యాచ్ లో పాక్‌పై భారత్ విజయంలో తిలక్‌వర్మ కీలకపాత్ర పోషించారు. ఈ సందర్భంగా తిలక్ వర్మను సత్కరించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. సీఎం రేవంత్ రెడ్డికి క్రికెట్ బ్యాట్‌ను తిలక్‌వర్మ బహూకరించారు. ఈ కార్యక్రమంలో వాకిటి శ్రీహరి, శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, శాట్స్ ఎండీ సోనిబాల దేవి, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఆసియా కప్ 2025 ఫైనల్ మ్యాచ్ పాకిస్తాన్‌పై భారత్ విజయంలో తిలక్‌వర్మ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే.

## వారం - వర్జ్యం

01-10-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, శుక్లపక్షం
నవమి సా.6.56
పూర్వాషాఢ ఉ.8.04
వర్జ్యం : సా.4.26-సా.6.07
దు.ఉ.11.34-మ.12.22
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** దూర ప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది.

**వృషభం:** గృహం, స్థలాల కొనుగోలు యత్నాలు ముమ్మరం చేస్తారు.

**మిథునం:** కోర్టుకేసుల నుండి బయట పడతారు. శుభకార్యాలలో పాల్గొంటారు.

**కర్కాటకం :** ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అవకాశాలు లాభిస్తాయి.

**సింహం:** ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు పొందుతారు. మానసిక ప్రశాంత పొందుతారు.

**కన్య :** రాజకీయ, కళా రంగాల వారికి విదేశీ పర్యటనల సూచన.

**తుల :** చేపట్టిన పనులలో అనేకమైనవాటిని విజయవంతంగా పూర్తి చేస్తారు.

**వృశ్చికం:** ఋణాలు తీరి ఊపిరి పీల్చుకుంటారు. నూతన వ్యక్తులు పరిచయాలు.

**ధనుస్సు:** సన్నిహితుల నుండి అతి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు.

**మకరం:** ఒత్తిడుల నుండి బయట పడతారు. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి.

**కుంభం:** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

**మీనం :** గృహనిర్మాణ ఆలోచనలు సాగిస్తారు. కాంట్రాక్టులు లాభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 51,51,151 కరెన్సీ నోట్లతో దుర్గామాతకు అలంకరణ

**ఉదయ్‌పూర్ (రాజస్థాన్), సెప్టెంబర్ 30:** దసరా నవరాత్రుల సందర్భంగా రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్‌పూర్‌లో బాలేశ్వరి మాతను మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా రూ.51,51,151 కరెన్సీ నోట్లతో అలంకరించి పూజలు నిర్వహించారు. బాలేశ్వర్ యువ మండల్ నేతృత్వంలో రూ.50, రూ.100, రూ.200, రూ.500 నోట్లతో దుర్గామాతను అలంకరించారు. గత మూడేళ్లుగా కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకరణ చేస్తున్నామని, తొలి ఏడాది రూ.11,11,111లతో, రెండో ఏడాది రూ.21,21,121, మూడో రూ.31,31,131, నాల్గో ఏడాది అంటే ఈ సంవత్సరం రూ.51,51,151ల విలువైన కరెన్సీ నోట్లతో బాలేశ్వరి మాతను అలంకరించినట్లు బాలేశ్వర్ యువ మండల్ నిర్వాహకులు తెలిపారు. దుర్గాదేవి విగ్రహం చుట్టూ అన్ని వైపులా కరెన్సీ నోట్లను వేలాడదీసి ఉంటాయి. అమ్మవారి కిరీటం కూడా పూర్తిగా నోట్ల పొరలతో అలంకరించారు. ఇక ఉదయ్‌పూర్ ప్యాలెస్‌లో దుర్గామాత మండపాన్ని 400ఏళ్లనాటి రాజా రతన్ సింగ్



రాయల్ మాన్షియన్‌ను పోలి ఉండేలా రూపొందించారు. రూ.1.51 కోట్ల విలువైన కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. ఈ కరెన్సీ నోట్లతో అలంకరించిన దుర్గామాతను దర్శించుకోవడానికి భక్తులు తండోపతండాలు తరలివస్తున్నారు.

# టార్గెట్ @ 763 టిఎంసీలు

>> తెలంగాణకు చారిత్రక అన్యాయం ఇక కొనసాగనీయకుండా సరిదిద్దే క్రమంలో రేలంపాడు బ్యాలన్సింగ్ రిజర్వాయర్‌ను నాలుగు నుంచి పది టిఎంసిలకు పెంచాలనీ, గట్టు బ్యాలన్సింగ్ రిజర్వాయర్ సామర్థం 1.32 నుంచి 5 లేదా 10 టిఎంసిల సామర్థ్యానికి పెంచడం వంటి నిర్ణయాలు తీసుకొంటున్నది. జూరాల నుంచి నాలుగు టిఎంసిలు తీసుకొని నెట్టెంపాడు రెండోదశ పనులు చేపట్టి అదనంగా 25 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు కార్యాచరణ రూపొందించారు. పులిచింతల వెనకభాగం నుంచి బొజ్జతాండా, భీమతాండా ఎత్తిపోతలు పథకం. 0.5 టిఎంసి వినియోగంతో మట్టంపల్లి మండలంలోని మూడు గ్రామాల్లో 1,380 ఎకరాల ఆయకట్టుకు నీరందించడం జరుగుతుంది. జూరాల నుంచి రోజుకు రెండు టిఎంసి ల చొప్పున 100 టీఎంసీలు మళ్లించేలా వరద కాలువ పథకం ఉంది. జూరాల వరద కాలువతో నల్గొండ, మహబూబ్‌నగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో 11.3 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందిచడంతోపాటు ఆ దారిలో ఉన్న చెరువులకు జలవసతి కల్పించి తాగునీరు, మత్స్యసంపద పెంచాలనే ఆలోచన చేస్తున్నారు. జూరాల వెనక భాగం నుంచి వరద సమయంలో 123 టిఎంసిలను మహబూబ్‌నగర్ జిల్లాలోని దుర్భిక్ష ప్రాంతాలకు సరఫరా చేయడం వంటివి ఆలోచనలు ఆచరణలో పెట్టాలని పాలకులు కృతనిశ్చయంతో ఉన్నారు. కోయిల్‌సాగర్ కింద 3.3 టిఎంసిలతో అదనంగా 13,500 ఎకరాలకు సాగు నీరు అందించడం, శ్రీశైలం ప్రాజెక్టు నీటి ఆధారంగా కల్వకుర్తి ఎత్తిపోతల రెండో దశ తో 13 టిఎంసిలను మళ్లించి 93,531 ఎకరాల అదనపు ఆయకట్టు సాగులోకి తీసుకొనిరావాలని యోచిస్తున్నారు. ఇందుకోసం కాలువలు, హెడ్‌వర్క్స్ సామర్థ్యం పెంచడంతో పాటు తాగునీటికి 7.12 టిఎంసిలు వినియోగించుకొనేలా మౌలిక సదుపాయాల కల్పనకు నివేదికను తయారు చేశారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ముల్కపల్లి వద్ద 25 నుంచి 35 టిఎంసిల నిల్వ సామర్థంతో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టనున్నారు. మహబూబాబాద్ జిల్లాలో 1.3 టిఎంసిలతో 13,201 ఎకరాలకు సాగు నీరిచ్చేందుకు మహబూబాబాద్ మండలం ఏదులపూసపల్లి వద్ద మున్నేరు నదిపై బ్యారేజీ నిర్మాణం చేయనున్నారు. ఇదే జిల్లాలోని మరిపెడ మండలం విసంపల్లి గ్రామం వద్ద ఆకేరు నదిపై 1.2 టిఎంసిల సామర్థ్యంతో బ్యారేజీ నిర్మాణం చేయనున్నారు. గార్ల మండలం ముల్కనూరు గ్రామం వద్ద 11,871 ఎకరాలకు నీరిచ్చేందుకు మున్నేరుపై 1.2 టిఎంసిల సామర్థ్యంతో బ్యారేజీ నిర్మాణం. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల తాగునీటి అవసరాలకు పది టిఎంసిల నీటి సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టనున్నారు. దేవులమ్మనగరం, దుండుమల్లారం వద్ద రిజర్వాయర్ల ప్రతిపాదించారు. ఆరుట్ల వద్ద నిర్మించబోయే రిజర్వాయర్ నీటి సామర్థ్యం 5టిఎంసిలా 10 టిఎంసిలు ఉండాలా అనే విషయంలో ఇంకా ఒక స్పష్టత రాలేదని అధికారులు అంటున్నారు. రిజర్వాయర్లకు డిపిఆర్‌లు తయారించే క్రమంలో నీటినిపుణులు ఉన్నారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువకు కొనసాగింపుగా నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామం వద్ద నుంచి శ్రీశైలం బ్యాక్‌వాటర్ రోజుకు ఒక టిఎంసిల చొప్పున మళ్లించి 35 టిఎంసిల వినియోగంతో 3.99 లక్షల ఎకరాల అదనపు ఆయకట్టుకు నీటి సరఫరా చేయనున్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం ఏదులచెరువు గ్రామం వద్ద ఆకేరు నదిపై బ్యారేజీ నిర్మించి 1.3 టిఎంసిల వినియోగంతో 13,129 ఎకరాలకు నీటిసరఫరా చేయాలని నిర్ణయించుకున్నారు. కృష్ణా బేసిన్‌లో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు 799.22 టిఎంసిలు అవసరమని సాంకేతిక నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం గతంలో బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌కు సమర్పించడ మే కాకుండా మంగళవారం నుంచి గురువారం వరకు కొనసాగిన విచారణలో ట్రిబ్యునల్ ముందు తెలంగాణ వాదనను బలంగా వినిపించింది. బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఏపీకి కేటాయించిన 811 టిఎంసిలలో తెలంగాణ 299 ఆంధ్రప్రదేవ్ 512 టిఎంసిలు వాడుకొనేలా 2015లో జరిగిన తాత్కాలిక ఏర్పాటే కొనసాగుతోంది. ఇంతకుమించి నీటి అవసరాలను ట్రిబ్యునల్ దృష్టికి తీసుకొని వెళ్ళి చారిత్రక అన్యాయం ఇక ముందు జరగకుండా దిద్దుబాటు చర్యలు తీసుకొంటున్నారు. అందులోభాగంగా కృష్ణాబెసిన్‌లో ప్రాజెక్టులు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు అవసరమైన చోట నిర్మించాలని ప్రతిపాదనలు ముందుకు వస్తున్నాయి. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ 2013లో ఇచ్చిన తీర్పులో 2,578 టిఎంసిల వరకు కేటాయింపులు చేసింది. ఈ తీర్పు ఇంకా నోటిఫై కాలేదు. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులకు అదనంగా 448 టిఎంసిలను 3 రాష్ట్రాలకు 2013లో బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ కేటాయించగా ఇందులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 194 టిఎంసిలు ఉన్నాయి. బచావత్ ట్రిబ్యునల్ క్యారీ ఓవర్ స్టోరేజి కింద కేటాయించిన 150 టిఎంసి లూ ఇందులోనే ఉన్నాయి. బచావత్, బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునళ్లు కలిపి ఉమ్మడి ఏపీకి 1005 టిఎంసిలు కేటాయించగా, ఇందులోనే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వాటా ఎంతన్నది తేలాలి. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపు 811 టిఎంసిల వాటాలపై ఆంధ్రప్రదేశ్ వాదనలు అక్టోబర్29 నుంచి 31వరకు జరుగబోతున్న విచారణలో వినిపించనున్నది.



న్యూఢిల్లీలో మంగళవారం వికె మల్హోత్రా భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ప్రధాని మోడీ

# 54 వర్సిటీలకు యుజిసి నోటీసులు

>> పట్టించుకోలేదని యూజీసీ తన నోటీసులో స్పష్టం చేసింది. ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు లేఖలు, ఈ మెయిల్ల ద్వారా హెచ్చరించడమే కాకుండా, ఆన్‌లైన్ సమావేశాల్లోనూ చర్చించినప్పటికీ ఆయా యూనివర్సిటీల నుంచి సరైన స్పందన రాలేదని యూజీసీ చెపుతోంది. ఈ నేపథ్యంలో, యూజీసీ కార్యదర్శి ప్రొఫెసర్ మనీశ్ జోషి ఈ 54 వర్సిటీలకు లేఖలు రాశారు. "విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కీలక నిర్ణయాలు తీసుకునే ముందు ఉన్నత విద్యా సంస్థల గురించి పూర్తి, ప్రామాణిక సమాచారాన్ని పొందే వీలుండాలి" అని ఆయన తన లేఖలో నొక్కిచెప్పారు. ఈ జాబితాలో గుజరాత్, హరియాణా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల్లోని ప్రైవేట్ యూనివర్సిటీలు ఉన్నాయి. కేవలం వెబ్‌సైట్‌లో వివరాలు అప్‌లోడ్ చేస్తే సరిపోదని, అదే సమాచారాన్ని పర్యవేక్షణ కోసం తమ కమిషన్‌కు కూడా సమర్పించాలని యూజీసీ తేల్చిచెప్పింది. ఈ చర్యల ద్వారా ఉన్నత విద్యాసంస్థల్లో జవాబుదారీతనం పెంచడంతో పాటు, ప్రజల్లో నమ్మకాన్ని బలోపేతం చేయడమే తమ లక్ష్యమని యూజీసీ స్పష్టంచేసింది.

# హై కోర్టు తీర్పు మేరకే ఆదిత్యా కేడియాకు అనుమతి

>> తొలగించినట్లు తేలిందని, అనుమతులను పునరుద్ధరించాలని 1 మార్చి 2024న హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో భవన నిర్మాణ అనుమతులను పునరుద్దరించాల్సిన అనివార్యత ఏర్పడిందని, 20 జూన్ 2024న అనుమతులను పునరుద్ధరిస్తూ హెచ్ఎండిఏ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.. కాగా, మంచిరేవుల గ్రామంలోని సర్వే నెంబరు 476/ ఏఏ1, 476/ ఏఏ22 లోని 9.19 ఎకరాల విస్తీర్ణంలో 38 అంతస్తుల బహుళ అంతస్తుల భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరుతూ 12 మే 2022న హెచ్ఎండిఏ కార్యాలయానికి ఆదిత్య సంస్థ దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ప్రతిపాదిత భూమికి సమీపంలో మూసీ నది ఉన్నట్లు గుర్తించి ఆ సంస్థను స్పష్టత అడగడం జరిగిందని, 8 అక్టోబరు 2021న ఇరిగేషన్ శాఖ , రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఎన్వోసీలను హెచ్ఎండిఏ కు సమర్పించిందన్నారు. ఆదిత్య కంపెనీ ప్రతిపాదనలను మల్టీ స్టోర్డ్ బిల్డింగ్ (ఎంఎస్‌బి) కమిటీ సమావేశంలో చర్చించిన తర్వాత భవన నిర్మాణ అనుమతులను ఇవ్వడానికి నిర్దేశిత ఫీజు చెల్లించాలని ఆ సంస్థకు సూచించినట్లు తెలిపారు. నిర్ణీత ఫీజు చెల్లించిన తర్వాతే హెచ్ఎండిఏ 19 ఆగస్టు 2022న భవన నిర్మాణ అనుమతులను జారీ చేసిందని హెచ్ఎండిఏ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

## విత్తన రంగం అభివృద్ధి, ఎగుమతులపై..

# జపాన్, తెలంగాణ మధ్య ఒప్పందం

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** తెలంగాణలో విత్తన రంగ అభివృద్ధి, ఎగుమతులు, దిగుమతులపై జపాన్, తెలంగాణ మధ్య పరస్పర సహకార ఒప్పందం కుదిరింది. విత్తన అభివృద్ధికి ఉన్న అవకాశాలు అధ్యయనం చేయడానికి జపాన్-ఇండియా సహకార ఆర్గనైజేషన్, చైర్మన్, కెంజీ ఒకుమూర, వైస్ చైర్మన్, జూన్ ఓయబు ప్రతినిధుల బృందం రాష్ట్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన చర్చల అనంతరం జపాన్ బృందంతో తెలంగాణ విత్తన ధృవీకరణ సంస్థ డైరక్టర్ డాక్టర్ కేశవులు ఒప్పందంపై సంతకాలు చేశారు. దీన్ని పురష్కరించుకుని తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ తెలంగాణను అంతర్జాతీయ విత్తన హబ్ తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. తెలంగాణ విత్తన రంగాన్ని మరింత అభివృద్ధి పరచడంలో భాగంగా భవిష్యత్తులో తెలంగాణ-జపాన్ మధ్య పరస్పర సహకారం ఉండేలా అంగీకారం జరిగిందని చెప్పారు. జపాన్ నుంచి అధిక దిగుబడిని ఇచ్చే కూరగాయలు, పూల విత్తనాలను దిగుమతి చేసుకొని, పైలెట్ ప్రాజెక్టు క్రింద తెలంగాణలో విత్తనోత్పత్తి చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. విత్తనోత్పత్తిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇమేజింగ్ టెక్నాలజీ లాంటి అధునాతన సాంకేతికతతో వినియోగం చేస్తామని వెల్లడించారు. విత్తన ఆరోగ్యం, విత్తనం మొలకెత్తు శక్తి, విత్తన దీర్ఘాయువు తదితర అంశాలలో సాంకేతికతను పొంది తెలంగాణ నుంచి మరిన్ని విత్తన ఎగుమతులను ప్రోత్సహిస్తామన్నారు. తెలంగాణలో నాణ్యమైన విత్తనోత్పత్తికి ఉన్న అవకాశాలు, మెరుగైన మౌలిక వసతులు, తెలంగాణ విత్తన పరిశ్రమ సామర్థం, పరస్పర సహకారానికి ఉన్న అవకాశాల గురించి తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ డా. కేశవులు వివరించారు.

# ఫర్నీచర్, కలపపైనా సుంకాలు

>> అంతర్జాతీయ వాణిజ్య భాగస్వాములపై డొనాల్డ్ ట్రంప్ దాడి చేశారు. ట్రంప్ తన నిర్ణయాన్ని సమర్థించుకుంటూ.. దిగుమతి చేసుకుంటున్న కలప, ఫర్నిచర్ ఉత్పత్తులు అమెరికా జాతీయ భద్రతకు విఘాతం కలిగిస్తున్నాయని వాదించారు. ట్రేడ్ యాక్ట్ 1974లోని సెక్షన్ 232 కింద ఈ సుంకాలను విధిస్తున్నట్లు పేర్కొన్నారు. అమెరికా కలప పరిశ్రమ బలహీనపడటం వల్ల కలప మిల్లులు మూతపడే ప్రమాదం ఉందని జాతీయ భద్రత, క్లిష్టమైన మౌలిక సదుపాయాలకు అవసరమైన కలప ఉత్పత్తుల డిమాండ్‌ను తీర్చలేమని ఆ ప్రకటనలో తెలిపారు. ఈ టారిఫ్‌ల పెంపుతో అప్‌హోల్‌స్టర్డ్ కలప ఉత్పత్తులపై సుంకాలు 30 శాతానికి కిచెన్ క్యాబినెట్‌లపై 50 శాతానికి పెరుగుతాయి. అయితే ఇది అమెరికాతో ఒప్పందం కుదుర్చుకోని దేశాలకు మాత్రమే వర్తిస్తుందని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. కలప ఉత్పత్తులతో పాటు, పేటెంట్ పొందిన ఫార్మాస్యూటికల్స్, భారీ ట్రక్కుల దిగుమతులపైనా సుంకాలు విధిస్తామని గత వారమే ట్రంప్ ప్రకటించారు. తాజాగా తీసుకున్న ఈ చర్యలు అమెరికాకు కలపను సరఫరా చేసే అతిపెద్ద దేశమైన కెనడాపై అదనపు భారం పడనుంది. ఇప్పటికే ఆ దేశం 35 శాతం యాంటీ డంపింగ్ టారిఫ్‌లను ఎదుర్కొంటున్నారు. మరోవైపు ట్రంప్ మొదటిసారి అధికారంలో ఉన్నప్పుడు చైనా ఫర్నిచర్‌పై సుంకాలు విధించడంతో ఆ ఉత్పత్తులను ఇప్పుడు మెక్సికో, వియత్నాం నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఇప్పుడు ఆ దేశాల ఫర్నిచర్‌పైనా సుంకాలు విధించడంతో వాణిజ్య మార్పులకు తీవ్ర అడ్డంకిగా మారనుందనే వాదనలు వినిపిస్తున్నాయి. చైనా ఫర్నిచర్‌పై గతంలో 25 శాతం ఉన్న సుంకం ఇప్పుడు దాదాపు 55 శాతానికి పెరిగింది. ట్రంప్ చేసిన ప్రకటనతో బ్రిటన్ నుంచి వచ్చే కలప ఉత్పత్తులపై సుంకాలు 10 శాతానికి.. యూరోపియన్ యూనియన్, జపాన్ ఉత్పత్తులపై 15 శాతానికి పరిమితం కానున్నాయి. అయితే వియత్నాంతో కుదుర్చుకున్న 20 శాతం సుంకం ఒప్పందం గురించి ప్రకటనలో ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ఇక ఈ సుంకాలను యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇవి అమెరికన్ వ్యాపారాలు, ఇంటి నిర్మాణ ఖర్చులను పెంచుతాయని.. ఉద్యోగాల కోతకు దారితీస్తాయని హెచ్చరించింది.

# కాళేశ్వరం విచారణకు ఏసిబి రెడీ

## మరిన్ని ఆర్థిక అక్రమాలు వెలుగులోకి!

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు30:** కాళేశ్వరం ప్రాజెక్టు విచారణలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై ఏసీబి అధికారులు విచారణ చేయనున్నారు. ఈ ప్రాజెక్టు అక్రమాలపై దర్యాప్తు కోరుతూ తెలంగాణ రాష్ట్ర విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ ఏసీబికి లేఖ రాసింది. విజిలెన్స్ డిపార్లమెంట్ పంపిన లేఖను తెలంగాణ సీఎస్‌కు ఏసీబీ డిజి పంపించారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఏసీబీ విచారణ ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకంగా వ్యవహరించిన ఈఎన్సీ, ఈఈ అధికారుల వద్ద భారీగా అక్రమ డబ్బును ఏసీబీ అధికారులు గుర్తించారు. ఏసీబీ విచారణ చేపడితే మరిన్ని ఆర్థిక అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు విజెన్స్ అధికారులు భావిస్తున్నారు.

## హోంశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శిగా బాధ్యతలు చేబట్టిన ఆనంద్



**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సివి ఆనంద్ మంగళవారం సచివాలయంలో బాధ్యతలు చేబట్టారు. ఇంతకు ముందు ఇక్కడ వున్న రవిగుప్తా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డిజిగా నియమితులు వడం తెలిసిందే. ఆయన స్థానంలో సిటీ కమిషనర్‌గా ఉన్న ఆనంద్‌కు హోంశాఖకు సర్కారు బదలీచేయడం విదితమే. సచివాలయంలోని హోం శాఖ ఛాంబర్‌లో ఆనంద్ బాధ్యతలు చేబట్టగా చీఫ్ సెక్రటరీ రామ కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గా బాధ్యతలు చేబట్టిన ఆనంద్‌ను ఆ విభాగం అధికారులు అభినందించారు.

### సిటీ కొత్వాల్‌గా సజ్జనార్ బాధ్యతల స్వీకరణ



కాగా సిటీ కొత్వాల్‌గా వీసి సజ్జనార్ మంగళ వారం ఉదయం బాధ్యతలు చేబట్టారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో గల కమిషనర్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేబట్టారు.

## సినీ కార్మికుల పరిష్కారానికి కమిటీ

### చైర్మన్‌గా లేబర్ కమిషనర్

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం తెలుగు సినీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి కార్మిక శాఖ కమిషనర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఉద్యోగుల సమాఖ్య, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, నిర్మాత మండలి ప్రతినిధులు, అలాగే ఇతర ప్రభుత్వ అధికారులను ఈ కమిటీలో స్థానం కల్పించింది. ఈ కమిటీ సినీ కార్మికుల సమస్యలపై చర్చించి, రెండు నెలల్లోగా ప్రభుత్వానికి నివేదిక, సిఫార్సులను అందజేయనుంది. కమిటీలో తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వి. వెంకటరమణ రెడ్డి, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి కె.ఎల్.దామోదర్ ప్రసాద్, నిర్మాత యార్లగడ్డ సుప్రియ సభ్యులుగా ఉన్నారు. అలాగే తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్, కార్యదర్శి అమ్మిరాజు కనుమిల్లి కూడా కమిటీలో సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. ఈ కమిటీ దసరా పండుగ తర్వాత తమ మొదటి సమావేశాన్ని నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. కాగా ఈ ఏడాది ఆగస్టులో సినీ కార్మికులు వేతనాల పెంపు, ఇతర పని పరిస్థితులకు సంబంధించిన సమ్మె చేశారు. సీఎం జోక్యం చేసుకోవడంతో ఈ వివాదంపై చర్చలు జరిగాయి. అదనపు కార్మిక కమిషనర్ ఆధ్వర్యంలో కార్మికులు, నిర్మాతల మధ్య చర్చలు జరిగాయి. దీని ఫలితంగా 22.5 శాతం వేతనాలు పెంచడానికి అంగీకారం కుదిరింది.

## టెట్ కేసుపై సుప్రీంలో ఎస్‌టిఎఫ్‌ఐ రివ్యూ పిటిషన్

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** ఐదేళ్ల తర్వాత ఉద్యోగవిరమణ పొందే ఉపా ధ్యాయులందరూ సర్వీసులో కొనసాగాలంటే తప్పనిసరిగా రెండేళ్లలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఉత్తీర్ణులు కావాలని లేదా ఉద్యోగం నుండి రిటైర్ కావాలని, ఐదేళ్లలోపు సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు కూడా ప్రమోషన్ కావాలంటే టెట్ పాస్ కావాల్సిందేనంటూ సెప్టెంబర్ 1వ తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరుతూ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) పక్షాన ప్రధాన కార్యదర్శి చావ రవి పేరిట న్యాయవాది సుభాష్ చంద్రన్ మంగళవారం రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నెల 17 న ఎస్టీఎఫ్ఐ నాయకత్వం సుప్రీం కోర్టుకు వెళ్లి న్యాయవాదులతో సంప్రదింపులు జరిపి రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే.ఆ మేరకు దేశవ్యాప్తంగా 25 లక్షల మంది ఉపాధ్యాయులపైన ప్రభావం చూపనున్న తీర్పును సమీక్షించి సవరించాలని కోరుతూ ఎస్‌టిఎఫ్‌ఐ పిటిషన్ వేసింది. కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా వీలైనంత త్వరగా రివ్యూ పిటిషన్లు వేయా లని టిఎస్ యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఎ వెంకట్ ఒక ప్రకటనలో కోరారు.

# డిజిపి జితేందర్‌కు ఘనంగా సాయుధ వీడ్కోలు

### ఆయన మాకు మార్గదర్శకుడు..: కొత్త డిజిపి శివధర్‌రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్ర డిజిపి జితేందర్‌కు మంగళవారం నాడు పోలీసు అకాడమిలో ఘనంగా సాయుధ వీడ్కోలు లభించింది. పోలీసు అకాడమిలోని క్యాడెట్లు ఈ సందర్భంగా ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జితేం దర్ మాట్లాడుతూ తెలంగాణ పోలీసు విభాగం దేశంలోనే ఉత్తమమైనదిగా తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీసు శాఖకు లభించిన అవార్డులు, రివార్డులు ఉదాహరణలని ఆయన వెల్లడించారు. ఉమ్మడి ఎపి పోలీసు శాఖలో చేరిన తాను తన 33 ఏళ్ల సుధీర్ఘ సర్వీసులో అనేక చోట్ల పనిచేశా నని, ఎపితో పాటు తెలంగాణకు చెందిన అన్ని ప్రాంతాలకు తనకు పరిచయమని, రెండు ప్రాంతాల ప్రజలు ఎంతో మంచివారని ఆయన తెలిపా రు. తెలంగాణ ఏర్పాటయ్యాక తాను తెలంగాణకు కేటాయించబడి ఇక్కడే విధులు నిర్వహించి కీలక విభాగాలను పర్యవేక్షించానని ఆయన తెలిపా రు. తెలంగాణలో గడచిన కొన్నేళ్లుగా నేరాలు చాలా వరకు తగ్గాయని, ఇందుకు ఇక్కడి పోలీసుల సమిష్టి కృషి కారణమని ఆయన తెలిపారు. పోలీసులు సమష్టిగా పనిచేస్తే ఫలితాలు మెరుగ్గా వుంటాయని ఆయన అన్నారు. ఇందుకు తెలంగాణ పోలీసులు నిదర్శనమని ఆయన తెలిపారు. తన తల్లిదండ్రులు వ్యవసాయ కుటుంబానికి చెందిన వారని, ఇప్పుడు వారిద్దరు లేరని ఆయన అన్నారు.



డిజిపి జితేందర్ పదవీవిరమణ వేళ ఆయన అధిరోహించిన వాహనాన్ని గౌరవసూచకంగా తాళ్లతో లాగిన సీనియర్ అధికారులు

తన తల్లిని తలచుకుని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. తెలంగాణ పోలీసు శాఖలో తాను పనిచేసినందుకు ఎంతగానో గర్వపడుతున్నానని ఆయన తెలిపారు. నూతన డిజిపిగా నియమితులైన శివధర్ రెడ్డి మాట్లాడుతూ డిజిపిగా 14 నెలల పాటు సేవలందించిన జితేందర్ తనతో పాటు అనేక మందికి మార్గదర్శకంగా వున్నారని కొనియాడారు. ఆయన దగ్గర తాము ఎన్నో విషయాలను నేర్చుకున్నామని శివధర్ రెడ్డి అన్నారు. జితేందర్‌కు అనేక అంశాలపై గొప్ప పరిజ్ఞానం వుందని, ఎ ంతో అనుభవం వుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమి డైరక్టర్ అభిలాష్ బిస్త్‌తో పాటు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరక్టర్ శిఖా గోయల్, శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, టిఎస్ఎస్‌పి అదనపు డిజి సంజయ్ కుమార్ జైన్ మాజీ డిజిపి అంజనీ కుమార్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ఇన్‌ఛార్జి డిజిపిగా మహేష్ భగవత్**

ఇదిలా ఉండగా పదవీ విరమణచేసిన జితేందర్ స్థానంలో ఇన్‌ఛార్జి డిజిపి గా శాంతిభద్రతల అదనపుడిజిగా ఉన్న మహేష్ భగవత్ బాధ్యతలు చేబట్టారు. బుధవారం ఉద యం వరకు ఆయన ఆ బాధ్యతల్లో ఉంటారు.

## నేడు కొత్త డిజిపి శివధర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్ర ఆరవ డిజిపిగా బత్తుల శివధర్‌రెడ్డి బుధవారం ఉదయం 9.44 గంటలకు బాధ్యతలు చేబట్టనున్నారు. డిజిపి కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదట సాయుధ పోలీసు గౌరవ వందనాన్ని ఆయన స్వీకరిస్తారు. అనంతరం డిజిపి ఛాంబర్‌లో బాధ్యతలు చేబడతారు. దీని తరువాత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సిఎం రేవంత్ రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలుస్తారు. కాగా నూతన డిజిపి శివధర్ రెడ్డిని బుధవారం ఉదయం పలువురు పోలీసు ఉన్నతాధికారులు మర్యాద పూర్వకంగా కలువనున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక మొదటి డిజిపిగా అనురాగ్ శర్మ, రెండో డిజిపిగా మహేందర్‌రెడ్డి, మూడవ డిజిపిగా అంజనీ కుమార్, నాలుగో డిజిపిగా రవిగుప్తా, ఐదో డిజిపిగా జితేందర్ బాధ్యతలు చేబట్టడం తెలిసిందే.

## సినీనటి డింపుల్ హాయతిపై కేసు నమోదు

**హైదరాబాద్ (ఫిల్మ్‌నగర్), సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** సినీనటి డింపుల్‌హాయతి మరోసారి వివాదస్పదమయ్యారు. ఇంట్లో పనిచేసే పని మనిషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు డింపుల్ హాయతితోపాటు ఆమె భర్త డేవిడ్‌పై ఫిల్మ్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిల్మ్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లాకు చెందిన ప్రియాంక బిబర్(22) శ్రీసాయి గుడ్‌విల్ సర్వీస్ ద్వారా షేక్‌పేట వెస్ట్‌వుడ్ అపార్ట్ మెంట్‌లో నివసించే డింపుల్‌హాయతి ఇంట్లో పనిమనిషిగా చేరింది. పనిలో చేరిననాటి నుంచి డింపుల్ హాయతితోపాటు ఆమె భర్త డేవిడ్ ఆమెను దూషిస్తూ, ఆమెకు సరైన ఆహారం ఇవ్వకుండా చిత్రహింసలకు గురిచేశారు. సోమవారం ఇంట్లో ఉన్న కుక్క అరవడంతో వారిద్దరు అశ్లీల పదజాలంతో పనిమనిషిని దూషించారు. ఈ వ్యవహారాన్ని ఆమె తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరిం చేందుకు ప్రయత్నించగా డేవిడ్ ఆమె చేతిలోని సెల్‌ఫోన్‌ను లాక్కొని నేలకేసి కొట్టడం తో రెండు ముక్కలయ్యింది. ఎంత ధైర్యం ఉంటే విడియో తీస్తావంటూ కొట్టేందుకు ప్రయత్నించగా ఆమె పారి పోయేందుకు క్రమంలో ఆమె దుస్తులు చిరిగిపోయాయి. ఆమె తల్లిదండ్రులను చంపేస్తామంటూ బెదరించారు. దీంతో అక్కడి నుంచి పారి పోయిన ఆమె తనను పనిలో కుదిర్చిన సంస్థకు తెలియజేసి వారి ద్వారా ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు డింపుల్ హాయతి, డేవిడ్‌లపై సెక్షన్ 74, 79, 351(2), 324(2)ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గతంలో జూబ్లీ హిల్స్‌లో నివసించే సమయంలో కారు పార్కింగ్ వ్యవహారంలో డింపుల్ హాయతి డిసిపి రాహుల్ హెగ్డేపై ఆరోపణలు చేయడంతో వార్తల్లోకి ఎక్కారు.

# కోటి విలువైన గంజాయి పట్టివేత

### ఒకరు అరెస్టు, పరారీ మరో ముగ్గురు

### వివరాలు వెల్లడించిన సిఐ సతీష్



**బూర్గంపహాడ్, సెప్టెంబరు, ప్రభాతవార్త:** బూర్గంపహాడ్ మండల పరి పరిధిలోని మొరంపల్లి బంజర గ్రామ శివారు నందు సోమవారం బూర్గంపహాడ్ ఎస్సై మేడ ప్రసాద్ తన సిబ్బంది తో కలిసి సుమారు కోటి 246,500 విలువగల 24 కేజీల గంజాయిని కారు లు తరలిస్తుండగా పట్టుకొని ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

ఈ ఘటనకు సంబంధించి పాల్వంచ సిఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం చింతూరు నుండి హర్యానాకు హెచ్‌ఆర్ 33బి 6330 కారులో అక్రమంగా గంజాయి తరలిస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు ఎస్సై ప్రసాద్ తన సిబ్బందితో కలిసి మొరంపల్లి బంజర గ్రామం వద్ద పట్టుకున్నారు కారును స్వాధీనం చేసుకుని నిందితుని వద్ద నుండి సుమారు 204.930 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు హర్యానా రాష్ట్రానికి చెందిన సంజీవ్ కుమార్ తన కారు యజమాని అయిన ప్రిన్స్ కుమార్ ఆదేశాల ప్రకారం ఆంధ్ర రాష్ట్రం చింతూరు వైపు వెళ్లి అక్కడ ప్రధానకార లఖన్ అంతాల్ అనే ఇద్దరు వ్యక్తుల వద్ద గంజాయి కార్లు లోడ్ చేసుకొని తిరిగి హర్యానా వెళుతుండగా పట్టుకున్నామని తెలియ జేశారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించామని అన్నారు మిగిలిన ముగ్గురు మెంతులు పరారీలో ఉన్నారని తెలిపారు. సుమారు పోటీలు రూపాయలు విలువగల గంజాయిని పట్టుకున్న ఎస్సై మేడా ప్రసాద్ ను సిబ్బందిని అభినందించారు.ఈ సమావేశంలో ఎస్సై మేడాప్రసాద్ అదనపు ఎస్ఐ నాగబిక్షం, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీదుర్గమ్మ భక్తులకు అలుపెరగని సేవలు

**విజయవాడ, సెప్టెంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** బెజవాడ ఇంద్రకీలాద్రి దసరా నవరాత్రులలో అమ్మవారి దర్శనానికి మన రాష్ట్రం నుంచే కాక దేశంలోని సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులకు అవసరమైన సేవలందించడానికి దేవస్థానం, జిల్లా యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పలు ఏర్పాట్లు చేశాయి. చిన్నారులకు వేడి పాలు, బిస్కెట్లు అందిస్తున్నారు. రద్దీగా ఉండే క్యూలైన్లలో ప్రతి ఒక్కరికి అందేలా విశేష కృషి చేస్తున్నారు. మొదటి ఎనిమిది రోజులలో 1,75,000 బిస్కెట్ ప్యాకెట్లను, మూడు లక్షల అరవై వేల మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. 6,600 లీటర్ల పాలను 70 వేల కప్పుల ద్వారా భక్తులకు అందించారు. భక్తులకు 8 రోజులలో 35 లక్షల మంచినీటి సీసాలు పంపిణీ చేశారు. వృద్ధులు, దివ్యాంగులకు దర్శనంలో ఇబ్బందులు కలగకుండా బ్యాటరీ కార్లు, చక్రాల కుర్చీలు ఏర్పాటు చేశారు. అధికార యంత్రాంగంతో పాటు వందలాది మంది సేవకులు స్వచ్ఛందంగా రేయింబవళ్లు భక్తులకు సేవలందిస్తున్నారు. జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చైర్మన్‌గా ఉండే రెడ్ క్రాస్ సంస్థ రోజుకు మూడు షిఫ్టుల్లో వృద్ధులకు, దివ్యాంగులకు సేవలందిస్తోంది. అటు పోలీసు యంత్రాంగం "సేవాదళ్" పేరిట ఒక బృందాన్ని ఏర్పాటు చేసి భక్తులకు సాయపడుతోంది. హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ భక్తులకు పాలు అందించడంలో చురుకైన పాత్ర పోషిస్తోంది. లిటిల్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థకు చెందిన 'శక్తి సేవ' వాలంటీర్లు దేవాలయంలోని వివిధ విభాగాలలో సేవలం దిస్తున్నారు. నగరపాలక సంస్థ కు చెందిన 1490 మంది పారిశుద్ధ్య కార్మికులు వివిధ ప్రాంతాలలో సేవలందిస్తున్నారు. దేవాలయ ప్రాంగణంలోని మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుతూ భక్తుల మన్ననలు పొందుతున్నారు. రేయింబవళ్లు అలుపెరగకుండా అందిస్తున్న సేవలపై భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో శివయ్య ఆయుధ పూజ



**శ్రీకాళహస్తి, సెప్టెంబరు 30 ప్రభాత వార్త:** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వ రాలయంలో మంగళవారం శాస్త్రోక్తంగా భక్తి శ్రద్ధలతో ఆయుధ పూజల్ని నిర్వహించారు. ఆలయ ఇఒ డి.బాపి రెడ్డి దంపతులు హాజరుకాగా ఆలయ పారోహి తులు అర్ధగిరి పర్య వేక్షణలో కార్యక్రమాల్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానార్చకులు సంబంధం, కరుణాకర్ గురుకుల్, పారోహితులు అర్ధగిరి స్వామి వేదపండితులు విశ్వనాథ్ శర్మ, అవినాష్ శర్మ, శ్రీనివాస్‌శర్మ, శివప్రసాద్ అర్ధగిరి, డిప్యూటీ ఇఒ ఎన్‌ఆర్ కృష్ణారెడ్డి, ఎఇఒలు విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

BAJAJ FINSERV

**బంగారు ఆభరణాల వేలం కోసం దిన పత్రిక ప్రకటన**

**బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్**

**రిజిస్టర్డ్ కార్యాలయం: ముంబయి-పూణె రోడ్డు, అకుర్డి, పూణె - 411035**

గోల్డ్ లోన్ పొందే సమయంలో, అయా రుణ ఖాతాలలో మరియు రుణ మొత్తాన్ని చెల్లించలేకపోయిన డీఫాల్టర్స్ లేదా కావలసిన లాభాన్ని కేటాయించడంలో విఫలమైనవారు, నోటీసులను పునరావృతంచేసినా కూడా రుణగ్రహీతలుచే సెక్యూరిటీగా ఉంచబడిన గోల్డ్ జ్యూవెలరీ "యథాతథంగా" మరియు "ఎక్కడైతే మరియు ఎలా ఉందో దాని ఆధారంగా" వేలం వేయబడుతుందని ఇందుమూలముగా బీఎఫ్ఎల్ సంబంధిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియచేస్తోంది. బిడ్డర్స్ ఈ క్రింది నియమాలను అనుసరించాలని అభ్యర్థిస్తున్నాము:

(a) ప్రకటన గురించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి (లోన్, జ్యూవెలరీ, స్థూల బరువు, ప్రదేశం మరియు వేలం వేసే తేదీ) ప్రక్కన ఉన్న QR కోడ్ స్కాన్ చేయాలి;

(b) ఈ ప్రకటనకు సంబంధించిన బిడ్డర్ నియమాలు, షరతులు గురించి పూర్తిగా చదవడానికి ("నియమవాలు & షరతులు") వెబ్‌లింక్ http://172.30.1.235:3000/?WOUB2QG9WU పై క్లిక్ చేయాలి;

(c) నియమాలు & షరతులు అర్థం చేసుకోవడానికి, తదుపరి ధరావతు సొమ్ము రూ.25,000/- ను వేలం వేసే తేదీ నాడు లేదా అంతకు ముందు ఫండ్ ట్రాన్స్‌ఫర్ (ఎన్ఈఎఫ్‌టీ/ఆర్‌టీజీఎస్/బజాజ్ గోల్డ్ ఆక్షన్ యాప్) ద్వారా డిపాజిట్ చేయడానికి;

(d) ఉదయం 10 గంటలకు వేలం వేసే వేదిక వద్దకు వ్యక్తిగతంగా హాజరవ్వాలి; మరియు

(e) వేలం వేసే వేదిక వద్దకు తమ చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామాను తీసుకురావాలి.

(f) వేలం వేసే వేదిక వద్ద తమ చెల్లుబాటయ్యే గుర్తింపు మరియు చిరునామా ప్రూఫ్ తీసుకువెళ్లాలి వేలం వేసే తేదీ నాడు మధ్యాహ్నం 12 గంటలు తరువాత వేలం వేసే ప్రక్రియలో పాల్గొనడానికి బిడ్డర్స్ అనుమతించబడరు.

(g) ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) చెల్లింపు తరువాత కూడా నిర్దేశించబడిన టైమ్ పరిమితి లోగా పాల్గొనని బిడ్డర్స్ ను తిరస్కరించడానికి లేదా అనుమతించడానికి బ్రాంచ్ మేనేజర్/వేలందారుకు హక్కు గలదు.

నన్ను స్కాన్ చేయండి

వేదికలో మరియు వేలం వేసే తేదీలో ఏవైనా మార్పులు ఉంటే, వేలం వేసే వేదిక వద్ద ప్రదర్శించబడతాయి. మీరు బిడ్ సమర్పించడం పైన చెప్పిన నియమాలను మీరు ఆమోదించినట్లుగా భావించబడుతుంది. ప్రజా వేలం సేల్‌ను రద్దు చేయడం/ఆపు చేయడం చేసినట్లయితే బీఎఫ్ఎల్ రుణగ్రహీత (లు) యొక్క విషయంలో కూడా ప్రైవేట్ సేల్ ద్వారా జ్యూవెలరీని విక్రయించే హక్కు బీఎఫ్ఎల్ కు ఉంది. మీకు ఏవైనా సందేహాలు ఉంటే మీరు మమ్మల్ని ఈ మెయిల్ ఐడీ పై సంప్రదించవచ్చు - gold.auction@bajajfinserv.in

(10-11-25) ఆర్మూర్ - అంబేడ్కర్ చౌరాస్తా; PB56SGL13495826, 13529286, 13759174, 13822828. బాన్సువాడ-బస్ స్టాండ్; PCV9SGL13544852, 13637798. భద్రాచలం-ఆర్‌టిసి బస్ స్టాండ్; PEK5SGL13512603, 13590531, 13674007, 13695465, 13714695. భోధన్-నాందేడ్ మెయిన్ రోడ్; PEJ7SGL13780154, 13780471. శంశాబాద్ - బీజెఎల్; PY30SGL13461114. జహీరాబాద్ - ఆర్‌టిసి బస్ డిపో; PER4SGL13458267, 13543849, 13642452. (11-11-25): అదిలాబాద్ ద్వారకా నగర్; PEK4SGL13474299. భోంగిర్-హైదరాబాద్ రోడ్; PCW1SGL13736612. భూపాల్‌పల్లి-మెన్ రోడ్; PCW2SGL13531384, 13637431, 13685003, 13758915. గద్వాల్ - రాజీవ్ మార్గ్; PCW4SGL13441173, 13627006. గజ్వేల్ - సిద్దిపేట్; PEJ6SGL13408410, 13407012, 13460473, 13473241, 13565230, 13601859, 13714489, 13801990, 13816920, 13826093. గోదావరిఖని-కల్యాణ్ నగర్; PEK6SGL13765607. హాలియా - దేవరకొండ మెయిన్ రోడ్; PGC7SGL13462970, 13527526, 13562011, 13566100, 13581684, 13606676, 13644689, 13684450, 13718443, 13735665, 13775427. హుస్నాబాద్-అక్కన్నపేట్ చౌరస్తా; PCW5SGL13802836. (12-11-25) హుజూరాబాద్-వరంగల్ రోడ్; PJH1SGL13591120, 13657197, 13714118. ఖమ్మం - జమ్మిబండ రోడ్; PGG1SGL13464985, 13565210, 13581802, 13597129, 13674546, 13719784, 13754896, 13758876, 13804477. మిర్యాలగూడ - బీజెఎల్; P7B7SGL13427120, 13447224, 13497014, 13531443, 13609351, 13700965, 13712975, 13802255. నిర్మల్-గంగా కాంప్లెక్స్; PCX4SGL13483336, 13548893, 13560817, 13578738, 13642660, 13646915, 13695312, 13718866, 13744289, 13735971, 13824337. సంగారెడ్డి - బీజెఎల్; P4D3SGL13407467, 13461547, 13621129, 13740053, 13775322, 13775528, 13827354, 13827129. వరంగల్-కెయు క్రాస్ రోడ్; PGP7SGL13641294. (13-11-25): ఇబ్రాహింపట్నం-బీజెఎల్; P19WSGL13527572. కాగజ్‌నగర్ - పటేల్ రోడ్; PGM7SGL13427247, 13431178, 13512320, 13577339, 13738939. కామారెడ్డి - నిజామ్‌సాగర్ రోడ్; P86QSGL13488895, 13510037, 13549196, 13659890, 13658638, 13661380, 13659566, 13677193, 13758206, 13802658, 13810787. కరీంనగర్ - సివిఆర్ఎన్ రోడ్; PCW8SGL13700806, 13703203, 13695657, 13716954, 13822318. ఖమ్మం - గాంధీ చౌక్; PB54SGL13405796, 13474118, 13476649, 13528486, 13548909, 13548879, 13745855. యెల్లందు-బుగ్గవాగు; PGC4SGL13482478, 13477798, 13534863, 13776926. (14-11-25) కొండ - మల్లెపల్లి సాగర్ రోడ్; PJV4SGL13698444, 13745759. కోరుట్ల - బీజెఎల్; PV44SGL13639444. కొత్తగూడెమ్-మధుర బస్తి; PEJ5SGL13442473, 13529961, 13582262, 13744534, 13810782. మంచెరియాల్-హైదరాబాద్ రోడ్; PCW9SGL13443107, 13449258. మెదక్-టిఎల్ బ్రాంహ్మణ్ స్ట్రీట్; PCX2SGL13511429, 13713038, 13773253. మెట్‌పల్లి - మైన్ రోడ్; PEF7SGL13610459. (17-11-25) ములుగు - గాంధీ చౌక్; PJV5SGL13639441, 13718713, 13714043, 13760825, 13757432, 13761942, 13756540, 13776581, 13778904. నాగర్‌కర్నూల్ - బీజెఎల్; P21DSGL13464276, 13641808, 13656752, 13674754, 13736047. నల్గొండ-ఆర్‌పి రోడ్; P558SGL13736209. నారాయణ్‌పేట్-నర్సిరెడ్డి చౌరాస్తా; PJH5SGL13404336, 13495182, 13589658, 13587262, 13590622, 13702041. నర్సంపేట్ - జయ్ శ్రీ థియేటర్; PCX3SGL13441459, 13648449, 13742368, 13755009. వరంగల్-సూబేదారీ; PB55SGL13442275, 13444111, 13442617, 13443654, 13443022, 13443494, 13441755, 13648402. (18-11-25) నిజామాబాద్ - కపిలా హోటల్ రోడ్; PB94SGL13649482, 13665115. నిజామాబాద్ - వినాయక నగర్; PCX5SGL13511660, 13511088, 13575599, 13758202, 13820948. పర్కల్ - బస్ స్టాండ్; PJG8SGL13410316, 13403541, 13466221, 13463052, 13476347, 13494924, 13561514, 13563855, 13561026, 13574745, 13596399, 13659381, 13760156, 13819372. పటాన్‌చెరు - బీజెఎల్; PY29SGL13783508. పెద్దపల్లె - సుభాష్ నగర్; PEO3SGL13427755, 13496101, 13525877, 13560883, 13577003, 13576659, 13577350, 13604840, 13641455, 13683170, 13775885. సహదేనగర్ వెంకటేశ్వర కాలోని; PCX7SGL13542502, 13592560, 13619920, 13661524, 13744954. (19-11-25) సత్తుపల్లి సూపర్ మార్కెట్; PCX8SGL13532363, 13525760, 13526885, 13601873, 13620203, 13629585, 13667709, 13693477, 13745370, 13759374, 13773668, 13824256, 13825189. సిరిసిల్లా - మెయిన్ రోడ్; PB66SGL13744207, 13824053. సూర్యపేట్ - గాంధీ విగ్రహం; PJG4SGL13403987, 13481839, 13525059, 13606889, 13682953, 13713308, 13718430, 13765810, 13828367, 13823809. తొర్రూర్-వరంగల్ రోడ్; PJH3SGL13700536, 13747085. వనపర్తి-రాజీవ్ చౌక్; PCX9SGL13406348, 13425959, 13445940, 13587945, 13699324.

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్




## పండుగ బట్టలు కొని తిరిగివెళ్తూ...

### ఆటోను ఢీకొన్న బియ్యం లారీ ముగ్గురు దుర్మరణం

**పత్తికొండ, సెప్టెంబరు 30 ప్రభాత వార్త:** కర్నూలు జిల్లా పత్తికొండలో ఆగి ఉన్న ఆటోను వెనుక నుండి బియ్యం లారీ ఢీ కొంది. దీంతో ముక్కెళ్ళ గ్రామానికి చెందిన భూమిక (36), శిరీష(65), నిఖిత(3) మృతి చెందారు. మంగళవారం పత్తికొండలో పండుగ బట్టలు, సరుకులు తీసుకొని స్వగ్రామం ముక్కెళ్ళకు వెళ్ళడానికి ఆటోలో కూర్చున్నారు. ఇంతలో ఆ ఆటోని లారీ రూపంలో మృత్యువు కబళించింది. కళ్ళ ముందరే ఘటన చోటుచేసుకోవడం, ముగ్గురు మృతి చెందిన వార్త దావానంలా గ్రామానికి చేరడంతో విషాదఛాయలు అలుము కున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సిఎం రేవంత్‌కు బతుకమ్మ వరల్డ్ గిన్నెస్ రికార్డులు

### చూపించిన మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 30:** ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన అతి పెద్ద బతుకమ్మ గిన్నీస్ వరల్ రికార్డు సాధించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యాటక శాఖమంత్రి జూపల్లిని అధికారులను అభినం దించారు. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా మంగళవారం టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కలిశారు.ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, టూరిజం డిపార్ట్మెంట్ ఎండీ వల్లూరు క్రాంతి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభు త్వం ఆధ్వర్యంలో సరూర్‌నగర్ మైదానంలో నిర్వ హించిన బతుకమ్మ కార్యక్రమం గిన్నెస్ వరల్డ్ రికార్డులు సాధించిన నేప థ్యంలో సిఎంను కలిసి మంత్రి, ఉన్న తాధికారులు ధన్యవాదాలు తెలిపారు. అతిపెద్ద బతుకమ్మగా, అతి పెద్దజానపద నృత్యంగా గిన్నెస్ రికార్డు మన తెలంగాణ బతుకమ్మ సృష్టించింది.

## ముస్లిం మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ప్రభుత్వ కృషి

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** ముస్లిం మహిళల ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటుందని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. పేద ముస్లిం మహిళల ఆర్థిక స్థితి బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహ్మత్‌నగర్‌లో ముస్లిం మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని రవాణ, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్‌లతో కలిసి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 42,230 కుట్టు మిషన్ల పంపిణీ లక్ష్యంగా నిర్ణయించుకోగా, ఇప్పటివరకు 10,490 మహిళలకు మిషన్లు అందజేసినట్లు తెలిపారు. మిగతా మిషన్లు త్వరితగతిన పంపిణీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కుట్టు మిషన్ పథకం మహిళల ఆర్థిక స్వావలంబనతో పాటు కుటుంబ భద్రతకు దోహదం చేస్తుంది అని మంత్రి పేర్కొన్నారు. ఇటీవలే ప్రారంభించిన ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన కింద వితంతువులు, విడాకులు పొందినవారు, అనాథలు, ఒంటరి మహిళలకు ఒక్కసారి 50,000 ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు గుర్తు చేశారు. రేవంతన్నాకా సహారా - మిస్కీను కోలియే పథకం కింద ముస్లిం ఫకీర్, దూదేకుల వర్గాలకు ఒక్కొక్కరికి 1.00 లక్ష గ్రాంటుతో మోపెడ్ వాహనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. త్వరలో ప్రారంభమయ్యే పథకాలు గూర్చి వెల్లడించారు. తుర్కా కాషా ముస్లింలకు టూల్‌కిట్లు (1,500 మందికి - 15 కోట్లు), అనాథ/సెమి ఆర్ఫన్ మైనారిటీ ప్రొఫెషనల్ గ్రాడ్యుయేట్లకు ఉచిత ల్యాప్‌టాప్‌లు (2,000 మందికి - రూ10 కోట్లు). పేద మైనారిటీ బాలికలకు ఉచిత స్కూటర్లు (1,250 మందికి - 12.50 కోట్లు).దివ్యాంగ మైనారిటీలకు రిమోట్ ఆపరేటెడ్ ట్రైసైకిళ్లు (1,000 మందికి - 5 కోట్లు). ఎంబి బిఎస్, బిడిఎస్‌లా పట్టభద్రులకు ఒక్కొక్కరికి 2.00 లక్షల ఆర్థిక సాయం (1,000 మందికి - 20 కోట్లు), మైనారిటీ డ్రైవర్లకు గూడ్స్ క్యారియర్ వాహనాలు (530 మందికి - 26.50 కోట్లు) ఖర్చు చేస్తున్నామన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మెద్చల్ జిల్లాల్లోని 139 మైనారిటీ కుటుంబాలకు 2.00 లక్షల రుణం (70శాతం సబ్సిడీ + 30శాతం స్త్రీనిధి రుణం). ఇప్పటివరకు 1.94 కోట్లు సబ్సిడీ విడుదల చేసినట్లు తెలిపారు.

వార్త


మనుషులందరూ వృద్ధులుగా మారతారు. కానీ మంచివారుగా మారటం అరుదు.

-స్వీడెన్ బర్గ్

## ఇక 'పైరసీ' ఆటకట్టేనా!

పైరసీ అనగానే చలనచిత్ర ప్రపంచాన్ని ఊపేస్తున్న రక్కసి. దీని బారినపడి తెలుగు చిత్రసీమలో డబ్బు పోసి చిత్రనిర్మాణం సాగిస్తున్న నిర్మాతలకు దాదాపు రూ.3700కోట్ల నష్టం వాటిల్లిందని తేల్చారు. ఇది ఏమంత చిన్న మొత్తం కాదు. సినిమాల మీద ఆధారపడి ఎన్నో కుటుంబాలు ఉన్నాయి. చిన్నా చితక ఎవరైతేనేం సినీ కార్మికుల ఎంతో మందికి కూడు పెట్టే ఈ రంగం మూలబడితే వారి జీవన విధానానికే గొడ్డలిపెట్టు అవుతుంది. ఏదో సినిమా తీసాక పైరసీ జరిగితే నష్టం కేవలం నిర్మాతకేననుకుంటే పొరపాటు. నష్టాలొస్తే మరో సినిమా తీయడం కష్టం. ఈ నేపథ్యంలో సినీ రంగం కుంటుపడుతుంది. ఎన్నాళ్లుగానో చిత్ర రంగానికి పెను సవాల్‌గా మారిన పైరసీముఠాను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు చాకచక్యంగా పట్టుకోగలగడం అభినందించదగిన విషయం. చాలా సంవత్సరాలుగా అగ్ర కథానాయకుల చిత్రాలు పైరసీకి గురికాగా సినీ హీరోలు మహేష్‌బాబు, చిరంజీవి వంటి వారు 'పైరసీ' మంచి పద్ధతి కాదని సందేశాలు ఇస్తూనే ఉన్నారు. మన భాషా చిత్రాలకే పైరసీ పరిమితంకాలేదు. పరభాషా చిత్రాలను పైరసీకారులు వదలి పెట్టలేదు. దేశంలోనే అతిపెద్ద పైరసీ ముఠాను పట్టుకున్న ఖ్యాతి నగర పోలీసులకు దక్కింది. చెట్టు చాటునో, పుట్ట చాటునో దాగినేరానికి పాల్పడిన వారు దొరకడం సులభమేమో కానీ సినీ థియేటర్లలోఅత్యంత రహస్యంగా కెమెరాలతో పకడ్బందీ ప్లాన్‌తో సినిమాలను కాపీ చేసేవారిని పట్టుకోవడానికే చాలా రోజులు పట్టింది. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన దేశంలో మాయచేయడం కష్టమైన పనేం కాదు. మంచికి ఉపయోగపడే పరికరాలే చెడుకు, అక్రమ సంపాదనకు మార్గాలుగా అక్కరకొస్తున్నాయి. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన యాంటీ వీడియో పైరసీ సెల్ ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. సర్వర్ హ్యాకింగ్‌తోపాటు క్యామ్ కార్డర్ ద్వారా నిందితులు సినిమాలను పైరసీ చేస్తున్నారు. తమిళనాడులోని ఓ ప్రధాన పట్టణం కరూర్‌కు చెందిన ప్రధాన నేరస్తుడు సిరిల్ ఇన్‌ఫంట్ రాజ్, సుధాకరన్‌లు, అశ్వీన్‌కుమార్ (బీహార్) జానా కిరణ్ కుమార్ (హైదరాబాద్) అర్సలన్ అహ్మద్( నార్త్‌గోవా)లతో ఒక ముఠాగా ఏర్పడి పైరసీ కార్యకలాపాలను విజయవంతంగా చేయగలుగుతారని పోలీసుల దర్యాప్తులో తేలింది. వారు పైరసీ చేసిన చిత్రాల సంఖ్య తక్కువేమీ కాదు. వారుగా ఒక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుని పైరసీ వీడియోలను రహస్యంగా విక్రయిస్తున్నారు. పైరసీ వద్దంటూ ఎవరెన్ని విజ్ఞాపనలు చేసినా ఎక్కడా ఆగలేదు. కోట్లాది రూపాయల నష్టంతో నిర్మాతలు దిగాలు పడిపోయిన సందర్భాలే ఎక్కువ. కొంతమంది పైరసీ ముఠా నెట్‌వర్క్ సభ్యులు దుబాయ్, నెదర్లాండ్స్, మయన్మార్‌లోఉన్నారని తెలిసి అక్కడి వారి వ్యవహారాలను కూడా ఛేదించారు.

తాజాగా కుబేర, హరిహర వీరమల్లు, సింగిల్, హిట్ వంటి చిత్రాలను కూడా పైరసీచేశారు. వీరు పైరసీ చేసిన వెంటనే వాటిని తమిళ్ బ్లాస్టర్స్, మూవీ రూల్స్, తమిళ్ ఎంవీసైట్లలో ఉంచుతారు. ఈముఠా నాయకుడు కంప్యూటర్‌సైన్స్ ఇంజినీరింగ్ చేసిన కరూరు నివాసి, 2020 నుంచి నాలుగు వెబ్‌సైట్లు నడుపుతున్నాడు. ఎంతో పకడ్బందీగా ఎవరికీ తెలియకుండా పైరసీ వ్యాప్తి తద్వారా ఈజీమనీ సంపాదించడమే అతని ప్రధాన వ్యాపకం. గత యేడాది ఈపైరసీ అధికస్థాయిలో జరిగినటు నగరపోలీసు కమిషనర్ సి.వి ఆనంద్ మీడియాకు ఈ ముఠా పాల్పడిన చిత్ర విచిత్ర విశేషాలను అందించారు. ఈ ముఠా సభ్యులు రహస్యంగా పైరసీ చేయడం వాటిని విస్తృత పరిచే విషయంలో తీసుకునే జాగ్రత్తలు తదితర పాటించే మెళకువలనన్నిటినీ కూలంకషంగా వెల్లడించారు. థియేటర్లలో ప్లే అయ్యే శాటిలైట్ కంటెంట్ ఐడిని, ప్యాస్‌వర్డ్‌లను హ్యాక్ చేస్తున్నారని, ఒకవేళ హ్యాక్ అవకపోతే ఏజెంట్లకు కెమెరాలిచ్చి వాటిని రహస్యంగా రికార్డు చేయిస్తుంటారని లోగుట్టును పోలీసులు గుర్తించారు. పాప్‌కారన్ డబ్బా, కోకో టిన్, షర్ట్ జేబులో కెమెరాలు, సెల్‌ఫోన్‌లతో కెమెరాలు పెట్టి ఆయా సినిమాలు చిత్రీకరిస్తున్నారు. గత ఏడాదిన్నరలో నిందితుడు జానా కిరణ్ 40 సినిమాలను రహస్యంగా చిత్రీకరించాడు. సినిమా విడుదలైన తొలి రోజునే వాటిని చిత్రీకరించేవాడు. ప్రతి సినిమాకు 300నుంచి 400డాలర్లు బిట్‌కాయిన్స్ రూపంలో తీసుకునేవాడు. ఈటివి విన్ కంటెంట్‌ను కూడా వదిలిపెట్టలేదు. ఇదిలా ఉండగా గత యేడాది మొత్తం సినిమా ఇండస్ట్రీకి సుమారు రూ.22,400 కోట్ల నష్టం రాగా తెలుగు ఇండస్ట్రీకి సుమారు రూ.3,700 కోట్లు నష్టం వాటిల్లింది. గత ఐదేళ్లలో 500చిత్రాల పైరసీకి పాల్పడిన అంతర్ రాష్ట్రముఠా ఆటకట్టించడం ఇప్పటికైనా నెరవేరడం చాలా మంచిదయ్యింది. డిజిటల్ మీడియాను హ్యాక్ చేయడం, థియేటర్లలో రికార్డు చేసి పైరేటెడ్ సినిమాలను వెబ్‌సైట్‌ల ద్వారా ఇంత విస్తృతంగా పంపిణీ చేయడంలో ఈ ముఠా ఆరితేరింది. ఇలాంటి వారిపై చట్టరీత్యాచర్యలు తీసుకోగలిగితేనే మరికొందరు మంచి మంచి సినిమాలను నిర్మించగలుగుతారు.. వీరిని అరెస్టు చేసిన సందర్భంలో వెబ్‌కామ్, స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్స్,హార్డ్‌డిస్క్‌లు, ల్యాప్‌టాప్‌లు డాంగెల్స్, పెన్‌డ్రైవ్‌లు వంటి అత్యాధునిక ఎలక్ట్రానిక్ వస్తువులనూ పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. ఐదేళ్లుగా ఈముఠా పోలీసుల కన్నుకప్పి తిరుగుతోందంటేవారు ఏ మేరకు సాంకేతిక నిపుణులో అర్థమవుతోంది. కంటెంట్, రొబస్ట్, ఫోరెన్సిక్స్, వాటర్ మార్కింగ్‌లనే చైన్ కస్టడీని వినియోగిస్తున్నా ఫలితాలు కనపడలేదు. తాజాగా పైరసీ రాకెట్ ముఠాను పట్టివేత సినీ నిర్మాతలను ఆనందంలో ముంచెత్తింది. సినీ రంగం మూడుపువ్వులు ఆరుకాయల చందాన విలసిల్లగల తరుణం ఆసన్నమైంది.



అన్ని స్వర్గాలకంటే కూడా భూమి చాలా ఉన్నతమయినది. విశ్వంలోనే ఇది ఒక గొప్ప పాఠశాల.

స్వామి వివేకానంద



జీవితంలో సంతృప్తిపడడం నేర్చుకున్న వ్యక్తి ఎప్పుడూ ఆనందంగానే ఉంటాడు. అది చేతకాని వ్యక్తి ఎప్పుడూ దుఃఖానికి గురవుతూనే ఉంటాడు.

జార్జ్ ఇలియట్

## ప్రజావాక్కు



### ఆధారపడటం భవిష్యత్తుకు ప్రమాదం

భారత ఐటీ రంగంఎంతో వేగంగా అభివృద్ధి చెందుతున్నా, హెచ్1బివీసాలపై అధిక ఆధారపడటం భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతోంది. ప్రపంచ వలస విధానాలు క్రమంగా కఠినతరమవుతున్న ఈ పరిస్థితుల్లో, స్థిరమైన వ్యూహాలను అవలంబించడం అనివార్యం. స్థానిక నియామకాలనుపెంచడం,రిమోట్‌డెలివరీ విధానాలను అభివృద్ధి చేయడం, అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేయడంద్వారా సంస్థలు తమ స్వావలంబనను నిర్ధారించుకోవాలి. అదేసమయంలో స్వదేశీ ప్రతిభను పెంపొందించడం అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశం. భారతీయ యువత, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల విద్యార్థులు, తమ ప్రతిభనుప్రదర్శించిస్థానికస్థాయిలో స్టార్టప్స్‌ను స్థాపిస్తే, దేశీయఉపాధి అవకాశాలు విస్తరించడంతో పాటు, గ్లోబల్ టెక్ రంగంలో మన స్థానం మరింత బలపడుతుంది.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### ఆధిపత్య ధోరణి

సోనమ్ చేసిన తప్పేమిటి తమ ప్రాంతం పైన ఉన్న ప్రేమను తెలియజేయడమే కదూలేదా తనప్రాంతం, అస్తిత్వం నిలుపుకోవడానికి ప్రయత్నించడమేకదా తమ ప్రాంత వనరులపైన తమ అధికారమేఉండాలి అని కోరుకోవడమే కదా, ప్రభుత్వంతో ఇదేతంటా పోరులు చేస్తున్న ఉద్యమానికి సాంఘిక సామాజిక ఆర్థిక కారణాలు ఉంటాయి అయితే ప్రభుత్వం దానిని దేశ రక్షణకు భంగం అంటుంది. శాంతి భద్రతల సమస్యగా చూపడం సామాజిక ఉద్యమ కారులు అయితే వాళ్ళు నడిపే సంస్థలకీ నిధులు వేరే దేశాల నుండి వస్తున్నాయి. ప్రచారంలోకి తేవడం ఆధిపత్య ధోరణి ప్రదర్శించడం పరిపాటిగా మారింది.

- భారత అవినాష్, జనగామ

### నూతన చైర్మన్ ఎంపికలో జాప్యంవద్దు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్‌కమిషన్ ప్రస్తుత చైర్మన్ పదవీ కాలం అక్టోబర్9తో ముగుస్తుంది. పదులసంఖ్యలో నియామకాలు చివరిదశలో ఉన్నాయి. తదుపరి చైర్మన్ ఎంపిక ఆలస్యం అయితే ఇంకొన్ని నెలలు నిరుద్యోగులు తమ ఫలితాల కోసం,నూతన నోటిఫికేషన్ల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితివస్తుంది. ప్రభుత్వం త్వరితగతిన నూతన చైర్మన్ ఎంపిక ప్రక్రియ చేపట్టాలి.

- జి.వి.సాయికుమార్ గుంత, పెనుగొలను

### స్థానిక సంస్థల ఎన్నికలు

అక్టోబర్9న విడుదలకానున్న స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రాజకీయ వాతావరణాన్ని ఉత్కంఠభరితంగా మార్చబోతోంది. అయితే ఈ ఎన్నికలలో అత్యంత చర్చనీయాంశం బీసీలకు 42శాతం రిజర్వేషన్. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వెనుక ఉన్న ఉద్దేశ్యం సమాజంలోని వెనుకబడిన వర్గాలకు అధిక ప్రాతినిధ్యం ఇవ్వడం. కానీ ఈ నిర్ణయం చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొంటూ ప్రస్తుతం హైకోర్టులో నిలిచిపోయింది. సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టంచేసింది స్థానిక సంస్థల రిజర్వేషన్ల మొత్తం శాతం 50మించకూడదని. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు అయితే, ఆపరిమితి దాటుతుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజకీయ పరంగా బీసీవర్గాల మన్నన పొందేలా కనిపిస్తోంది. కానీ అది న్యాయస్థానాల పరిశీలనలో ఎంతవరకు నిలబడుతుందన్నది ప్రశ్నార్థకమే.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### భవిష్యత్తు అగమ్యగోచరం

అమెరికా దన్నుతో పాలస్తీనాలోని గాజా సిటీపై పూర్తి పెత్తనం సాధించడానికి ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దారుణ మారణ హోమాన్ని చాలాదేశాలు వ్యతిరేకిస్తున్నాయి. ఇందుకు సాక్షిగా మొన్న జరిగిన ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో ఇజ్రాయిల్ అధ్యక్షుడు నెతన్యాహు ప్రసంగం ప్రారంభిస్తుండగా అక్కడ హాజరయిన చాలా దేశాల నాయకులు తమ సీట్లలో నుండి నిరసనను తెలియజేస్తూ బయటకు వెళ్ళిపోయారు. వీరినందరిని ప్రజా వ్యతిరేకులుగా, ఉగ్రవాద సమర్థకులుగా చిత్రీకరించి తన ఉపన్యాసాన్ని కొనసాగించడం జరిగింది. ఉక్రెయిన్ రష్యాల అధినేతలు సంవత్సరం పైగా తమ ఆస్తిపాస్తులను, అమాయక ప్రజలప్రాణాలను పణంగా పెట్టి మారణా యుధాలతో ఆడుకుంటున్నారు. భవిష్యత్తుఅగమ్య గోచరంగా కనుపిస్తున్నది.

- ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

### రైతు సమస్యలను పట్టించుకోండి

వ్యవసాయరంగం భారత ఆర్థికవ్యవస్థకు ఆధారస్తంభంగా నిలుస్తోంది. ప్రధానంగా, 2013 భూసేకరణ చట్టంప్రకారం, భూమిని కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం ఇప్పటికీ పూర్తిస్థాయిలోఅందడం లేదు. అలాగే, నూతన జాతీయ మార్కెటింగ్ విధానాన్ని పునఃసమీక్షించి, రైతుఉత్పత్తులకు అనుకూలమైనవిధంగామార్చాలి. రైతుకువాస్తవలాభంచేకూరేలా చేయాలి.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

**మనవి** **ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# మాబ్ సైకాలజీకి మందులేదా?

*ఎన్నో దుర్ఘటనలు, ఊరేగింపులలో దేవాలయాలల్లో, పుష్కరాలలో బహిరంగ సభలలో, జనసమూహాలు ఎక్కడున్నా, తొక్కిస లాటలూ జరగటం సర్వసాధారణమయింది. ఇలాంటివాటిని అరికట్టి ప్రజల ప్రాణాలూ, గౌరవ జీవితాలనూ కాపాడటా నికి మార్గాలు లేవా? ఎందుకు లేవు? క్రమశిక్షణ, స్వీయ నియంత్రణ, మొదట పాలకులు నేర్చుకోవాలి. అలనాడు జరిగిన రైల్వే ప్రమాదానికి కేంద్ర మంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి తప్పుకున్నారు. అటు తర్వాత ఎందరో నాయకులు ప్రత్యక్ష బాధ్యత లేకపోయినా బాధ్యత నెత్తిమీద వేసుకొని మార్గదర్శకులుగా ఉన్నారు. ఇప్పుడు అలాంటి దార్శనికత దుర్లభం అయింది. ప్రజల్లోంచి ప్రజాప్రతినిధులోంచి పాలకుల్లోంచి అలాంటి మార్గదర్శకులు వచ్చినప్పుడే మానవ తప్పిదాలను అరికట్టడానికి ఈ ప్రజాస్వామ్యంలో రహదారి ఏర్పడుతుంది. అది సాధ్యమా? సాంకేతిక పరిజ్ఞానాన్నిఅంది పుచ్చుకున్న ఈ కాలంలో ఆన్‌లైన్‌లో ఇలాంటి సమావేశాలు జరుపుకొని తమ సందేశాలను అదించి స్వీయ నియంత్రణతో సక్రమంగా బాధ్యత నిర్వహించుకోవచ్చు కదా! ప్రజలు అప్పుడు క్రమశిక్షణకు కట్టుబడే అవకాశం ఉంటుంది కదా!*



రావులపాటి సీతారాం రావు

నాగరిక సమాజ నిర్మాణంలో అసంకల్పితంగా అనాగరికంగా తయారవుతున్నామా అనే సందేహం ఈ మధ్య జరుగుతున్న దుర్ఘటనలు తెలియపరుస్తున్నాయి. కరూర్ దుర్ఘటన (తమిళనాడులో జరిగింది) ఒక్కటి చాలు! ఇలాంటి వాటికి అడ్డం పట్టటానికి. అట్టహాసంగా ప్రతిక్రియా ఉండాలనే తాపత్రయం మన దేశంలో ముఖ్యంగా దక్షిణాదిన రోజురోజుకూ పెచ్చుమీరిపోతున్నది. రాజకీయాల్లోకి సినిమా నటులు వస్తే రాజకీయ ఉన్నత పదవులు వాటంతట అవే వస్తాయనే ఆలోచనలు కాస్త పేరు తెచ్చుకున్న, తెచ్చుకుంటున్న ఏ నటుడికైనా, నటులకైనా ఈ మధ్య ఎక్కువవుతున్నాయి. రాజకీయాల్లోకి ఎవరైనా రావచ్చు. ముఖ్యంగా జన బాహుళ్యంలో పేరున్న జనం మధ్య పెరిగిన ఎవరైనా రాజకీయ రంగంలోకి ప్రవేశిస్తే, వారికున్న విషయ పరిజ్ఞానంతోటి, అపారమైన అనుభవంతోటి సమాజానికి తమవంతుగా, ఇతోధికంగా సేవతోపాటు సహాయ సహకారాలు అందించే అవకాశాన్ని అందిపుచ్చుకోవచ్చు. అంత మాత్రాన వారి రాకతో ప్రతిపక్షాలూ, తమను కాదనుకొనేవారు ఉలిక్కిపడేలా భారీ సభలూ, సమావేశాలు పెట్టి అదుపు చేయలేని సంఖ్యలో జనసమూహాలను రప్పించి అక్కడ ఏదైనా జరుగుతే తమకేమీ సంబంధంలేదని, అది పోలీసుల,ప్రభుత్వాల బాధ్యత అని సుతారంగాచెప్పి తప్పుకోవటం సరికాదేమో! బాధ్యత అనేది కేవలం పోలీసులకూ, ప్రభుత్వాలకే సంబంధించిన సమస్య అనుకుంటే, ప్రజాస్వామ్య పరధులను అవగాహన చేసుకోలేదని భావించక తప్పదు. సినిమా నటులను ప్రేమించనివారు చాలా తక్కువ మంది! నిత్య జీవితంలో వారు భాగమయ్యారు. ఈ మధ్య టివిలూ, మరికొన్ని సౌకర్యాలు వినోదాన్ని, విజ్ఞానాన్ని అందించడానికి దృశ్య మాధ్యమాలు విరివిగా అందుబాటులో ఉండటంతో సినిమాలు చూడటం తక్కువయింది. కానీ పేరుగాంచిన నటుల ఫాన్స్ మాత్రం హెచ్చుసంఖ్యలో జన జీవనంలో భాగం కావటమే కాకుండా, వారు అభిమానించే నటుల మీద యిషణ్మాత్రం కూడా విమర్శలు కానీ, విరుపులు కానీ రానీయకుండా వారి చుట్టూ రక్షణ నిలయాలుగా అభిమాన ఈ సంఘాలు పనిచేయడం ముదావహం. కానీ తప్పొప్పుల విచక్షణ లేకుండా ప్రతిదీ తాము భావించిందే కరెక్టు అని అనుకోవటంలో సమాజంలోని హెచ్చుమందికి ఇబ్బందులు కలుగుతున్నాయి. తమ పేరుతో ఫాన్స్‌సంఘాలు శృతిమించుతున్న సమయాలలో ఈ సంఘాలలో ఉన్న చాలా మంది ప్రసిద్ధులైన నటులు వీరివల్ల ఏ ఇబ్బందులు కలిగినా ఆ సంఘాలను తప్పుపట్టడానికి వెనుకాడటంలేదు. అయినా సరే కొన్నిసార్లు రాజకీయ కార్యకర్తల మాదిరే వెనుకడుగు వేయకుండా తమ మాటే నెగ్గించుకొనే ప్రయత్నం ఈ సంఘాలు చేస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అదృష్టవశాత్తు ఇంతవరకూ ఏ ప్రాముఖ్యత కలిగిన విషయంలోనూ వారు నిర్ణయాత్మకంగా ఉండకపోవడంతో టీ కప్పులో తుపాను మాదిరి ఆ సంఘటనలు చల్లారిపోతున్నాయి. సాధ్యమైనంతవరకూ అభిమాన సంఘాలు ఒక సమస్యను హైటైల్ చేయడం వరకే చేస్తున్నారు. అంతకు మించి ఇబ్బందికరంగా వ్యవహరించకపోవటం గమనార్హం. సమస్యల్లా ఆకతాయిలు విచ్చలవిడిగా తిరిగేవారు, గుంపులు గుంపులుగా నిర్వాహకుల సహకారంతో సభలకు పెద్ద ఎత్తున రావటం మాబ్‌గా రూపాంతరం చెంది ఈ పోలీసుల



మాటకానీ, నిర్వాహకుల మాటకానీ లెక్క చేయకుండా ప్రాణాంతకమైన పరిస్థితులు కల్పించడం ఈ మధ్య ఎక్కువయింది. పైగా కార్యనిర్వాహకులకు పూర్తిగా వారెవరో తెలియదు. పోలీసులు కండిషన్లను లెక్కచేయటం లేదని నిర్వాహకులకు చెబుతున్నప్పుడు వారిని కూడా లెక్కచేయకుండా మాబ్ మెంటాలిటీతో తొక్కిసలాట లాంటి సంఘటనలకు కారణమవుతున్నారు. గుంపులో గోవిందలా వారి పనిఉంది. ఎంత మంది పోలీసులున్నా, బలప్రయోగం చేసినా, పరిస్థితులు అదుపు తప్పటం ఇలాంటి అన్ని సంఘటనల్లోనూ సంభవిస్తున్నాయి. కరూర్ సంఘటన సందర్భంగా నమోదు చేసిన ఎఫ్.ఐ.ఆర్‌లోని విషయాలు ఎంతవరకూ వాస్తవాలను ప్రతిబింబిస్తున్నాయో తెలియదు కానీ, ప్రాథమికంగా అనే సాక్షాలుగా కోర్టులలో నిలబడితే, ఇలాంటి ఘటనల్లో అనవసరంగా కోల్పోయిన నిండు ప్రాణాలను,పసి ప్రాణాలను, తల్లుల, తండ్రుల గుండె కోతలను కళ్లముందుంచుతాయి. పోలీసులు ఎలాంటి నిబంధనలు పెట్టి ఈ బహిరంగ సభకు అనుమతి ఇచ్చారో అప్రమత్తం! ఎందుకంటే అలాంటి నిబంధనలు కేవలం కాగితాలకే పరిమిమవుతున్నాయి. శాంతి భద్రతల సమస్యలు ఏర్పడినప్పుడు నిర్వాహకులు, నాయకులూ తమవంతు పాత్రను పోషించకుండా, సమూహాలను నియంత్రించకుండా భారమంతా దేవుడికి వదిలేసి పలాయనం చిత్తగిస్తున్నారు. భారతదేశంలో స్వతంత్ర్యం రాక మునుపు, పరాయి పాలనలో మ్రగ్గుతున్నప్పుడు జాతిపిత గాంధీ మహాత్ముడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరాకరణోద్యమంలోనైనా, సత్యాగ్రహంలోనైనా సభలూ, సమావేశాలు చేసినప్పుడు ప్రజలు అదుపు తప్పితే ఆ సభలనూ, సమావేశాలనూ ఊరేగింపులనూ వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించి మధ్యలోనే నియంత్రించడానికి, ఆపు చేయడానికి వెనుకాడకపోయేవారు. నిజానికి పరాయి పాలనలో అధికారాలను ధిక్కరించడానికి సహాయ నిరాకరణోద్యమానికి నడుం కట్టినప్పుడు అంతగా నైతిక విలువలను పాటించాల్సిన అవసరం లేదని ఒక్క క్షణమైన ఆలోచించకపోయే నాయకుడు అవటంచేతనే గాంధీ మహాత్మాగా, జాతిపితగా చరిత్రలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. నాయకుడు ముందుండి నడిపించినప్పుడే నాయకులు అని పిలిపించుకోటానికి అర్హత లభిస్తుంది. అప్పుడే సార్థకత నాయకత్వానికి సమకూరుతుంది. స్వతంత్ర భారతదేశంలో మన ప్రజలను మనం పాలించుకుంటున్న రోజుల్లో గతకాలంలోని నాయకులు పాటించిన విలువలను ఇప్పుడు జ్ఞాపకం చేయాలనిపిస్తున్నది. కానీ ఇప్పుడు అవి ఎంతవరకు ఈ కాలపు రాజకీయ ప్రతినిధులూ, నాయకులూ ప్రజలూ పరిగణనలోకి తీసుకోగలరు అని ఆలోచించటానికి కూడా మనస్కరించటం లేదు. కాలం మారిపోయింది. విలువలు అడుగంటాయి. లక్ష్యం సాధించడానికి మార్గం మహత్తరంగా నిర్ణయించుకోవాలన్న నిబంధనలు అటకెక్కాయి. నేనూ,నా అధికారం,నా స్వార్థం నిలువెల్లా ఆక్రమించుకున్నప్పుడు అహం ఏ చిన్న మంచి ఆలోచననైనా మధ్యలోనే త్రుంచేస్తుంది. నా బాధ్యతఅంటూ ఏదీ లేదు. పక్కవాడిదే బాధ్యత, తప్పు నాది కాదు. ఈ సమాజానిదే అన్న ధోరణిలో తప్పించుకొని పోవటానికి అలవాటుపడ్డ వారికి ఎవరేమి చెప్పగలరు. చట్టాలు నిబంధనలూ పరిస్థితులకు అనుగుణంగా మార్చినా ఎవరు పట్టించుకొనే స్థితిలోఉన్నారు?పాతకాలపు సెక్షన్లు 30,144 సి.ఆర్.పి.సి కాగితాలలో, ప్రాథమిక రిపోర్టులలో, దర్యాప్తులలో వినవచ్చేవే. అంతకంటే వాటికి విలువనివ్వటం అనవసరం. ఎప్పుడో నిజానికి అవి అటకెక్కాయి. ఇలాంటి ఎన్నో దుర్ఘటనలు, ఊరేగింపులలో దేవాలయాలల్లో, పుష్కరాలలో బహిరంగ సభలలో, జనసమూహాలు ఎక్కడున్నా, తొక్కిసలాటలూ జరగటం సర్వసాధారణమయింది. ఇలాంటివాటిని అరికట్టి ప్రజల ప్రాణాలూ, గౌరవ జీవితాలనూ కాపాడటానికి మార్గాలు లేవా? ఎందుకు లేవు? క్రమశిక్షణ, స్వీయ నియంత్రణ, మొదట పాలకులు నేర్చుకోవాలి. అలనాడు జరిగిన రైల్వే ప్రమాదానికి కేంద్ర మంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి తప్పుకున్నారు. అటు తర్వాత ఎందరో నాయకులు ప్రత్యక్ష బాధ్యత లేకపోయినా బాధ్యత నెత్తిమీద వేసుకొని మార్గదర్శకులుగా ఉన్నారు. ఇప్పుడు అలాంటి దార్శనికత దుర్లభం అయింది. ప్రజల్లోంచి ప్రజాప్రతినిధులోంచి పాలకుల్లోంచి అలాంటి మార్గదర్శకులు వచ్చినప్పుడే మానవ తప్పిదాలను అరికట్టడానికి ఈ ప్రజాస్వామ్యంలో రహదారి ఏర్పడుతుంది. అది సాధ్యమా? సాంకేతిక పరిజ్ఞానాన్నిఅంది పుచ్చుకున్న ఈ కాలంలో ఆన్‌లైన్‌లో ఇలాంటి సమావేశాలు జరుపుకొని తమ సందేశాలను అదించి స్వీయ నియంత్రణతో సక్రమంగా బాధ్యత నిర్వహించుకోవచ్చు కదా! ప్రజలు అప్పుడు క్రమశిక్షణకు కట్టుబడే అవకాశం ఉంటుందికదా! ●

# అన్ని దానాలలో రక్త దానమే మిన్న

కామిడి సతీష్ రెడ్డి

రక్తదానం ప్రాణదానంతో సమానం. అత్యవసర సమయాలలో శస్త్రచికిత్స సమయంలో రక్తం అవసరం ఉంటుంది. నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలో గాయపడిన వారికి సకాలంలో రక్తం అందక చనిపోయిన వారు అధిక సంఖ్యలో ఉంటున్నారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 1వ తేదీన జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవంగా జరుపుకుంటారు. 1975 సంవత్సరంలో స్వరూప కృష్ణన్,డా.జె.జి.జొలిల చొరవతో ఈ రక్తదాన దినోత్సవం ప్రారంభం అయినది. రక్తదానం చేయాలని ప్రోత్సహిస్తూ రక్తదానం ఆవశ్యకతను తెలియపరచడం రక్తదాన దినోత్సవం ప్రాముఖ్యతగా చెప్పవచ్చు. నేటికీ గ్రామీణ ప్రాంతాలలో రక్తదానంపై ప్రజలకు యువతకు అవగాహన లేదు. రక్తదానం చేస్తే నీరసించి పోతామని, బలహీనపడి పోతామని అపోహ ప్రజల్లో బలంగా ఉంది. వివిధ స్వచ్ఛందసంస్థలు, రెడ్క్రాస్ లాంటివి గ్రామాల్లో ,పట్టణాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తాన్ని సేకరిస్తున్నారు. ముఖ్యంగా యువత మాత్రం రక్తదానం అంటేనే రెండు అడుగులు వెనక్కి వేస్తున్నారు. ఒకవేళ స్వచ్ఛందంగా రక్తదానం చేసే వారికి ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థల నుండి ప్రోత్సాహం లేకపోవడంచే రక్తదానం చేయడానికి అనేకమంది వెనుకంజ వేస్తున్నసంఘటనలు కోకొల్లలు. ప్రతి ఆరోగ్యవంతుడిలో సుమారు 5నుండి 6 లీటర్ల రక్తం ఉంటుంది. 18 సంవత్సరాల నుండి 65 సంవత్సరాల లోపు ఉన్న ఎవరైనా రక్తదానం చేయడానికి అర్హులు. ఆరోగ్యవంతులు ప్రతి మూడు నెలలకు ఓమారు అనగా సంవత్సరానికి నాలుగు సార్లు రక్తదానంచేయవచ్చు. 45 కిలోల బరువు పైన ఉన్న వారు మాత్రమే రక్తదానం చేయడానికి అవకాశం ఉంటుంది. సాధారణంగా ఒక వ్యక్తి నుండి రక్తదాత 350 మిల్లీలీటర్ల రక్తాన్ని సేకరిస్తారు. రక్తదానం చేసేవ్యక్తిని వైద్యుల సంరక్షణలో కొన్ని వైద్యపరీక్షలు నిర్వహిస్తారు. హైపటైటిస్ బి, హెచ్ఐవి,రక్తహీనత, బలహీనత, షుగర్,దీర్ఘకాలిక వ్యాధులతో, బాధపడేవారు రక్తదానం చేయడానికి అనర్హులు. ఒకవేళ తెలియక చేసి రక్తం ఉపయోగపడదు. రక్తదానం చేసిన వారికి పూర్తిస్థాయిలో రక్తం 21రోజుల్లో తిరిగి ఉత్పత్తి అవుతుంది. రక్తంలో మొత్తం ఎనిమిది గ్రూపులు ఉన్నాయి 4 నెగటివ్ గ్రూపులు నాలుగు పాజిటివ్ గ్రూపులు రక్తదానం చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీవోనెంబర్ 184ద్వారా ఆ రోజు స్పెషల్ క్యాజువల్ మంజూరు చేయబడుతుంది. ప్రపంచంలో అధిక మొత్తంలో ఓ పాజిటివ్ వారే అధికంగా ఉన్నారు. ఒక యూనిట్ సుమారు 500 మిల్లీ లీటర్లు రక్తంలో మూడు నిండు ప్రాణాలు కాపాడవచ్చు. రక్తదానం చేసేవారు మిగతా వారికన్నా చాలా చురుకుగా ఆరోగ్యంగా ఉంటారు. రక్త గ్రూపులు దేశవ్యాప్తంగా వాని శాతం ఓ పాజిటివ్ 46,ఏ పాజిటివ్ 37శాతం, బి నెగటివ్ 8శాతం, యే నెగటివ్ 4 శాతం, నెగిటివ్ 2, ఏబి నెగటివ్ ఒక శాతం.ఒక శాతం ఏ బి పాజిటివ్. ఒక శాతం ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో రెడ్ క్రాస్ అనే అంతర్జాతీయ సంస్థ,ఆయా జిల్లాల ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న రక్తనిధి కేంద్రాలు అధిక సంఖ్యలో రక్తాన్ని సేకరిస్తున్నాయి. ప్రతిఏటా వందలాది రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ వేల యూనిట్ల రక్తం సేకరిస్తున్నారు. అలాగే జిల్లా కేంద్రాలు, డివిజన్ కేంద్రాలలో రక్తదాన కేంద్రాలు ఉన్నాయి. అనేక మంది తమ జన్మదినాలు ,పెళ్లి రోజును పురస్కరించుకొని కూడా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ తమ మిత్రులు,బంధువులు, సన్నిహితుల ద్వారా రక్తాన్ని సేకరిస్తున్నారు. బ్లడ్ బ్యాంకులకు అందజేస్తూ తమ దాతృత్వంతో, ఉదారతను చాటుతున్నారు. ప్రైవేటు బ్లడ్ బ్యాంకులలో కల్తీ రక్తాన్ని విక్రయిస్తున్నట్లు కూడా వార్తలు వినవస్తున్నాయి. రెడ్‌క్రాస్,ప్రభుత్వ రక్తనిధి కేంద్రాలలోనామ మాత్రపు డబ్బులతో రక్తాన్ని విక్రయిస్తున్నారు. సమాజంలో ఇప్పటివరకు రక్తదానం చేయని వారు అధిక సంఖ్యలో ఉన్నారు. రక్తదానం చేయడం అంటే ఓ మనిషిని బ్రతికించేది. రక్తం ఎవరికో ఒకరికి ఉపయోగపడుతుంది. రక్తదానం పట్ల ప్రజల్లో అవగాహన కొరవడింది. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కరపత్రాలు, గోడ పత్రికలు, సదస్సుల ద్వారా గ్రామ ప్రజలు యువతలో, మహిళా సంఘాలద్వారా విస్తృత ప్రచారం చేయాలి. రక్తదానం మించిన దానం లేదు అనే నినాదాన్ని విశ్వవ్యాప్తం చేయాలి. ●

# సంక్షేమ వసతి గృహాల సమస్యలు పట్టవా?

బి. వీరభద్రం

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంక్షేమ వసతి గృహాల్లో 7,65,705 మంది విద్యార్థులు నివాసం ఉంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే 10 నెలల క్రితం డైట్ చార్జీలు పెంచేందుకు అప్పటి బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి, ప్రస్తుత టీజీపీఎస్సీ చైర్మన్ ఆధ్వర్యంలో వేసిన ఉన్నతాధికారుల కమిటీ ప్రతిపాదనల మేరకు డైట్ చార్జీలు 40 శాతం పెంచింది. ఉన్నతాధికారుల కమిటీ జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) సూచనలను పరిగణలోకి తీసుకొని, చివరిసారిగా 2017లో మెస్‌చార్జీలు పెంచినప్పుడు నిత్యావసరాల ధరలు, ప్రస్తుతం రెండు రెట్లు పెరిగిన ధరలను బేరీజు వేసుకొని, సుమారు 22రకాల నిత్యావసరాల ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం పెరుగుదల అధ్యయనం చేసి, పలు సూచనలతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు 40 శాతం డైట్ చార్జీలు పెంచాలని, వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణకు 200శాతం కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని ఉన్నతాధికారుల కమిటీ ప్రభుత్వం ఎదుట పలు ప్రతిపాదనలతో కూడిన రిపోర్ట్‌ను ఉంచింది. ఉన్నతాధికారుల కమిటీ మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని సూచన చేస్తూనే, ప్రతి నెల వసతిగృహాలకు గ్రీన్ ఛానల్ ద్వారా డైట్ బిల్లులు చెల్లించాలని ఉన్నతాధికారుల కమిటీ కోరింది. రాష్ట్ర ప్రభుత్వం ఆనాడు రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ పాయిజన్ ఘటనలు, కొమరం భీమ్ ఆసిఫాబాద్‌లో విద్యార్థిని మరణించడం కారణంగా ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను దారి మళ్లించడం కోసం, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నుండి మెస్ చార్జీలు పెంచాలని వస్తున్న ఒత్తిడిల తట్టుకోలేక రాష్ట్రవ్యాప్తంగానున్న సంక్షేమ వసతి గృహాల్లో డైట్ చార్జీలు పెంచుతూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి భాజా భజంత్రీలతో అమలుకు సాధ్యంకాని, ప్రభుత్వమే తయారు చేసిన కామన్ మెనూతో హంగూ, ఆర్భాటంగా నూతన డైట్ అమలు ప్రారంభమనీ, ఇక విద్యార్థులకుఆకలి బాధలు ఉండవనీ, ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతం కావనీ, వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణకూ తగు చర్యలు తీసుకొని 200శాతం కాస్మోటిక్ ఛార్జీలు పెంచినట్లు ప్రజాప్రతినిధులు అసాధ్యమైన హామీలిచ్చి సన్నాయి నొక్కులు నొక్కారు. 10నెలలైనా చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. పెరుగుతున్న వడ్డీల భారం రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధికారుల కమిటీ చేసిన ప్రతిపాదనలలో కేవలం మెనూ చార్జీలు పెంచడం మాత్రమే కాదు, గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతినెలా



డైట్‌చార్జీలు సంక్షేమ వసతి గృహాలకు చెల్లించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం గాలికొదిలేసింది. ప్రతీనెల డైట్ చార్జీలు చెల్లించకుండా, విద్యార్థులకు పెంచిన డైట్ చార్జీలతో డైట్ అందించడం సాధ్యపడదు. గతం కంటే నేడు పెరిగిన చార్జీలతో విద్యార్థులకు డైట్ అందిస్తున్న కారణంగా సంక్షేమ వసతి గృహాధికారులకూ డైట్ చార్జీలు సకాలంలో చెల్లించకపోవడంతో అదనపు భారంగా మారింది. ఫైనాన్షియర్స్ ల దగ్గర వడ్డీలు, ఇఎమ్ఐ లతో పర్సనల్‌లోన్లు, తమ పుస్తెలు తాడులమ్మి, తాకట్టు పెట్టి, విద్యార్థులకు సంక్షేమ వసతి గృహాల్లో రెగ్యులర్ మెనూ ప్రకారం భోజనం అందించాల్సిన దుస్థితి ఏర్పడింది. అద్దె భవనాల కిరాయిలూ, కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించడం లేదు. రాష్ట్రంలో సుమారు 2300ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలు, 400కు పైగా గురుకులాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ప్రైవేటు బిల్డింగ్ ఓనర్లకు కిరాయిలు చెల్లించకపోగా బిల్డింగులకు తాళాలు వేసినసందర్భాలు లేకపోలేదు. కనీసం కరెంట్ బిల్లులు చెల్లించకపోయినా డిస్కంలు నిరంతరాయంగా పవర్‌సప్లై చేస్తున్నాయి. సంక్షేమ వసతి గృహాలకు, గురుకులాలకు నిత్యావసర వస్తువులు కూరగాయలు, పాలు, కోడిగుడ్లు,చికెన్, అరటిపండ్లు అందించే టెండరుదారులు తమ బిల్లులు చెల్లించకపోవడంతో చేతులెత్తేశారు. కొన్నిచోట్ల 15రోజులకు సరిపడా ఒకేసారి కూరగాయలు వేస్తే మురిగిపోతున్న సందర్భాలు ఉన్నాయి. ప్రభుత్వం ఇటు టెండర్ దారులకు, బిల్డింగ్ ఓనర్లకుబిల్లులు చెల్లించకపోవడంతో సంక్షేమ వసతి గృహాల అధికారులు, గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులపైన తీవ్ర ఒత్తిడులు తీసుకొస్తున్నారు. కేజీబీవీలలో చదువుకునే విద్యార్థులు ఇతర గురుకులాలు,ఆశ్రమ పాఠశాలల విద్యార్థులతో పోలిస్తే తీవ్ర వివక్షతను ఎదుర్కొంటున్నారు. ఉపాధ్యాయుల కొరత, మౌలిక సదుపాయాలు, నిధుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఇతర విద్యార్థులతో పోల్చినప్పుడు తమకు కల్పిస్తున్న సదుపాయాలు చాలా పరిమితమైనవి. అక్కడ పనిచేసే ఉద్యోగులు తమని పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవిత భీమా, ఆరోగ్య భీమా తమకు వర్తింపజేయాలని, 20సంవత్సరాలుగా శ్రమదోపిడీకి గురవుతున్నారు. ప్రభుత్వం కేజీబీవీలు పట్ల వివక్ష వీడాలి. ప్రతిఏటా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్యపెరుగుతున్న డ్రా పౌట్స్ తెలంగాణ రాష్ట్రంలో ప్రతియేటా సంక్షేమ వసతి గృహాల్లో చదివే విద్యార్థుల సంఖ్యతగ్గిపోతుంది. వసతిగృహాల వ్యవస్థ నిర్వీర్యం అవుతోంది. వసతి గృహాల్లో నాసిరకం భోజనం, అపరిశుభ్ర పరిసరాలు, వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు, అధికారుల నిర్లక్ష్యం, చాలీచాలని తిండి కారణంగా తల్లిదండ్రులు విసుగెత్తి విద్యార్థులను ఇండ్లకు తీసుకెళ్తున్నారు. దీనితో ఏటేటా విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి వసతి గృహాలపై దృష్టి సారించి తగు సదుపాయాలు కల్పించాలి. లేనిపక్షంలో సంక్షేమవసతి గృహాలు రానున్న రోజుల్లో ప్రభుత్వ విధానాలతో మూతపడే పరిస్థితి ఏర్పడుతుంది. ●

# వచ్చే ఫిబ్రవరికి ముందే హెచ్-1బి వీసాల్లో మార్పులు

## అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్




**వాషింగ్టన్, సెప్టెంబరు 30:** హెచ్-1బి వీసాల విషయంలో అమెరికా కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇటీవల వాటి ఫీజును 215 డాలర్ల నుంచి లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ వ్యాఖ్యలు చేశారు. 2026 ఫిబ్రవరికి ముందే ఆ వీసాల జారీ ప్రక్రియలో గణనీయమైన మార్పులు ఉంటాయని వెల్లడించారు. పాత విధానంలో లోపాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఇటీవల ట్రంప్ ప్రకటించిన వీసా ఫీజు ప్రపంచవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. హెచ్-1బి వీసాపై విధించిన లక్ష డాలర్ల రుసుము వార్షిక ఫీజు కాదని, దరఖాస్తు చేసుకొనే సమయంలో కట్టాల్సిన వన్‌టైమ్ ఫీజు మాత్రమేనని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ స్పష్టత ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ వన్‌టైమ్ లక్ష డాలర్ల రుసుము ఇకపై కొత్తగా హెచ్-1బి వీసాకు దరఖాస్తు చేసుకునే వారికే అమలు చేస్తామని, ప్రస్తుత వీసాదారులకు, రెన్యూవల్‌కు వర్తించదని చెప్పారు. దీనిని ఉద్దేశించి వాణిజ్య మంత్రి మాట్లాడారు. '2026 నుంచి ఈ ప్రక్రియ అంతా అమలులోకి వస్తుంది. నా అంచనా ప్రకారం ఇప్పుడు.. 2026లో గణనీయమైన మార్పులు ఉంటాయి' అని పేర్కొన్నారు. లక్ష డాలర్ల ఫీజు కారణంగా రానున్న రోజుల్లో ఆ వీసాపై వచ్చే వారి సంఖ్యలో మార్పు ఉంటుందని అంచనా వేశారు. లాటరీ విధానంలో కూడా మార్పులు ఉండొచ్చనేలా వ్యాఖ్యలు చేశారు. ఒక దేశం లాటరీ ద్వారా నైపుణ్యం కలిగిన కార్మికులను తెచ్చుకోవడం ఏమిటని ప్రశ్నించారు. పాత వీసా విధానంలో లోపాలున్నాయని, ఫలితంగా అనుభవం లేని టెక్ కన్సల్టెన్సీలు దేశంలో కుటుంబాలతో సహా ప్రవేశించాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. నిపుణులైన కార్మికులు మాత్రమే దేశంలోకి వచ్చేలా అమెరికా ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోందని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. హెచ్-1బి కోసం ప్రస్తుతం ఉన్న లాటరీ విధానాన్ని మార్చాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ భావిస్తోంది. అధిక నైపుణ్యం కలిగిన విదేశీయులను మాత్రమే అనుమతించడం, అమెరికన్లకు ప్రాధాన్యం కల్పించే ఉద్దేశంతో వీటిని రూపొందించినట్లు తెలుస్తోంది. ఉద్యోగి వేతన స్థాయిని అనుసరించి రిజిస్ట్రేషన్‌లో ప్రాధాన్యం కల్పించడం, వేతన వర్గీకరణ (ఒకటి నుంచి నాలుగు) ఆధారంగా దరఖాస్తులను విభజించడం వంటి చర్యలు తీసుకోనున్నారు. వీసాలపై అమెరికా కాంగ్రెస్‌లో మరో బిల్లు.. హెచ్-1బి, ఎల్-1 వీసాలను సంస్కరించాలని, విదేశీ ఉద్యోగుల నియామకం విషయంలో కఠిన నిబంధనలు ఉండాలని పలువురు యుఎస్ సెనెటర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు సెనెటర్లు చక్‌గ్రాస్లీ, డిక్ దర్బిన్ బిల్లును ప్రవేశపెట్టారు. కార్పొరేట్ దుర్వినియోగాన్ని అరకట్టి అమెరికా ఉద్యోగులను రక్షించడమే లక్ష్యమని ఈ సందర్భంగా వారు వెల్లడించారు.

# లడఖ్ ప్రజలను మోసగించిన ప్రధాని మోడీ



## రాహుల్ గాంధీ ఆరోపణ

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 30:** లడఖ్ ప్రజలతో చర్చలు జరపాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మంగళవారం డిమాండ్ చేశారు. హింసా రాజకీయాలను ఆపాలని విన్నవించారు. ఇటీవల లేహ్‌లో నలుగురు ప్రాణాలను బలిగొన్న హింసపై న్యాయపరమైన విచారణను జరిపించాలన్నారు. కాల్పుల్లో మరణించిన బాధితుల్లో ఒకరు సైనికుల కుటుంబానికి చెందినవారని రాహుల్ తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. తండ్రి సైనికుడు, కొడుకు కూడా సైనికుడే వారి రక్తం దేశభక్తితో ప్రవహిస్తుంది. అయినప్పటికీ, లద్దాఖ్‌తోపాటు అతడి హక్కుల కోసం నిలబడినందుకు బీజేపి ప్రభుత్వం దేశ ధైర్యవంతుడైన కొడుకును కాల్చి చంపింది. ఈ రోజు దేశానికి సేవ చేసినందుకు లభించే ప్రతిఫలమా?'అని రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో విమర్శించారు. "లద్దాఖ్‌లో జరిగిన హత్యలపై న్యాయ విచారణ జరగాలని దోషులకు సాధ్యమైనంత కఠినమైన శిక్ష విధించాలి అనేది మా డిమాండ్ అన్నారు. మోడీ జీ, మీరు లద్దాఖ్ ప్రజలను మోసం చేశారని రాహుల్ ఆరోపించారు. లద్దాఖ్ ప్రజలు తమ వాక్కులను డిమాండ్ చేస్తున్నారని, అందుకు వారితో చర్చించాలని కోరారు. హింస, భయ రాజకీయాలను ఆపాలని అన్నారు. అంతకుముందు సెప్టెంబర్ 24న లేహ్‌లో నిరసనల సందర్భంగా హింస చెలరేగింది. స్థానిక బీజేపీ కార్యాలయానికి నిప్పు పెట్టారు. ఈ ఘర్షణల్లో నలుగురు మరణించారు. అయితే లద్దాఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలని, ఆ ప్రాంతాన్ని ఆరో షెడ్యూలు పరిధిలో చేర్చాలని కోరడంతో పాటు పలు డిమాండ్ల సాధన కోసం సాగుతున్న ఉద్య మం ఇటీవల హింసాత్మకంగా మారాయి.

# అమెరికా ఆనాడు యుద్ధం వద్దని ఒత్తిడి తెచ్చింది..

## కేంద్ర మాజీ హోంమంత్రి చిదంబరం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 26/11 ముంబై ఉగ్రదాడులపై కేంద్ర హోం శాఖ మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కీలక సమాచారాన్ని వెల్లడించారు. ముంబై దాడుల అనంతరం తాను కేంద్ర హోం మంత్రిగా బాధ్యతలు తీసుకోవడం నుంచి పాక్‌పై ప్రతిదాడికి అడ్డుపడిన పరిస్థితులను ఆయన ఒక ఇంటర్వ్యూలో వివరించారు. ముంబై ఉగ్రదాడుల అనంతరం పాకిస్థాన్‌పై సైనిక చర్యకు ఆలోచించినప్పటికీ అంతర్జాతీయ ఒత్తిడులు, ముఖ్యంగా అమెరికా నుంచి వచ్చిన ఒత్తిళ్ల కారణంగా ఆ నిర్ణయం నిలిచిపోయిందని చెప్పారు. అప్పట్లో పాకిస్థాన్‌పై దాడి చేయాలని తన మనసులో ఉందని, అయితే సైనిక చర్యకు దిగరాదని యూపీఏ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ముంబై ఉగ్రదాడుల్లో 175 మంది ప్రాణాలు కోల్పోయిన కొద్ది రోజులకే కేంద్ర హోం మంత్రిగా పి.చిదంబరం బాధ్యతలు చేపట్టారు. అప్పుడు ప్రపంచం అంతా యుద్ధం ప్రారంభించవద్దని చెప్పడానికి ఢిల్లీకి వస్తోందని, నాటి అమెరికా విదేశాంగ కార్యదర్శి కండోలీజా రైస్ ప్రత్యేకంగా తనను, ప్రధానిని కలిసేందుకు ఢిల్లీకి వచ్చారని చెప్పారు. యుద్ధంపై ముందుకు వెళ్లొద్దని తమను కోరారని వెల్లడించారు. పాకిస్థాన్‌కు బదులు చెప్పాలని తన మనసులో ఉందని, దీనిపై ప్రధానమంత్రి, ఇతర ముఖ్య వ్యక్తులతో చర్చించానని చెప్పారు. అయితే భౌతికంగా కాకుండా దౌత్యమార్గాలను ఉపయోగించాలని చివరికి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. చిదంబరం వ్యాఖ్యలపై బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా స్పందించారు. ముంబై దాడుల అనంతరం హోం మంత్రి భాధ్యతలు తీసుకునేందుకు తొలుత చిదంబరం నిరాకరించారని, పాకిస్థాన్‌పై మిలటరీ చర్యను ఆయన కోరుకున్నప్పటికీ ఆయనపై ఇతరులు విజయం సాధించారని అన్నారు. పాక్‌పై ప్రతీకార చర్యలను కాంగ్రెస్ సీనియర్ నేత సోనియాగాంధీ అడ్డుకున్నారా, ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అడ్డుకున్నారా అని ఆయన ప్రశ్నించారు. యూపీఏ ప్రభుత్వంపై కండోలీజా రైస్ ప్రభావం ఉన్నట్టు కనిపిస్తోందన్నారు. 2008 నవంబర్ 8న ఉగ్రవాద సంస్థ లష్కరే తొయిబాకు చెందిన 10 మంది పాక్ ఉగ్రవాదులు ముంబైలోని పలు కీలక ప్రాంతాల్లో ఒకేసారిదాడులకు దిగారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ రైల్వే స్టేషన్, ఒబెరాయ్ ట్రిడెంట్, తాజ్ మహల్ ప్యాలెస్ అండ్ టవర్ హోటల్, కామా ఆసుపత్రి, నారిమన్ హౌస్‌లపై విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో 175 మంది ప్రాణాలు కోల్పోగా, 308 మంది గాయపడ్డారు. లష్కరే ఉగ్రవాది అజ్మల్ కసబ్ ఒక్కరే ముంబై పోలీసులకు పట్టుబడగా, 2012లో అతన్ని ఉరితీశారు.




# జీవాయుధ ముప్పును సైతం ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి

## సిడిఎస్ అనిల్‌చౌహాన్ పిలుపు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** మానవులు సృష్టించిన జీవ ఆయుధాల వల్ల భవిష్యత్తులో సహజంగా లేదా ప్రమాదవశాత్తు ముప్పు పెరగొచ్చని భారతదేశ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్ ) జనరల్ అనిల్ చౌహాన్ హెచ్చరించారు. అణ్వాయుధాల నుంచి వెలువడే రేడియో కాలుష్యంతోనూ గండం పొంచి ఉండొచ్చన్నారు. కరోనా (కొవిడ్) మహమ్మారిని ఎదుర్కొనే క్రమంలో యావత్ ప్రపంచం అనేక సవాళ్లను ఎదుర్కొందని ఆయన గుర్తు చేశారు. ఫ్యూచర్‌లో జీవ ఆయుధాల ముప్పును, అణ్వాయుధాల రేడియో కాలుష్యాన్ని ఎదుర్కొనేందుకు భారత సైనిక దళాలు రక్షణపరమైన సన్నద్ధతతో ఉండాలని పిలుపునిచ్చారు. మిలిటరీ నర్సింగ్ సర్వీస్ శత వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం దిల్లీలోని మానిక్‌షా సెంటర్‌లో నిర్వహించిన శాస్త్రీయ చర్చా కార్యక్రమంలో అనిల్ చౌహాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. అణ్వస్త్రాల్యకూ వెరువని భారత్‌ను సిద్ధం చేద్దామని జీవ ఆయుధాలతో దాడి జరిగినప్పుడు, అణ్వాయుధాల నుంచి రేడియో కాలుష్యం వ్యాపించినప్పుడు ఎలా స్పందించాలి ఆ రెండు రకాల ముప్పులను ఎదుర్కోవాలి వాటి వల్ల ఇన్ఫెక్షన్ బారినపడే వారికి ఎలాంటి ప్రాథమిక చికిత్స, అత్యవసర చికిత్స అందించాలి అనే సమాచారంతో నిర్దిష్టమైన చికిత్సా విధానాలను మనం ఇప్పుడే సిద్ధం చేసుకోవాలన్నారు. ఆపరేషన్ సిందూర్ ముగిసిన తర్వాత భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒక విషయాన్ని క్లియర్‌గా చెప్పారు. న్యూక్లియర్ బెదిరింపులకు భారత్ భయపడదని ఆయన తేల్చి చెప్పారు.

# ఇంగ్లీషు రాయడం రాయని ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్




**సిమ్లా, సెప్టెంబరు 30:** అతడొక ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపల్. కానీ థౌజెండ్ స్పెల్లింగ్ రాయరాదు. హండ్రెడ్ స్పెల్లింగ్ రాదు. సిక్స్‌కు సిక్స్‌టీన్‌కు తేడా తెలియదు. కనీసం సెవెన్ స్పెల్లింగ్ కూడా చక్కగా రాయడం రాలేదు. ఆయన రూ.7,616ను (సావెన్ థర్స్‌డే సిక్స్ హరేంద్ర సిక్స్ రూపీస్ ఓన్లీ) అని రాశాడు. ఈ చెక్కు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ఓ ప్రభుత్వ స్కూల్ ప్రిన్సిపాల్ మిడ్‌డే మీల్ వర్కర్స్‌కు ఇవ్వాల్సిన నగదుకు సంబంధించి రూ.7,616 చెక్కు ఇచ్చాడు. అయితే ఆ చెక్కులో నగదుకు సంబంధించి ఇంగ్లీష్‌లో అన్నీ తప్పులే రాశాడు. దాంతో బ్యాంకు అధికారులు స్పెల్లింగ్ మిస్టేక్స్ ఉన్నాయంటూ ఆ చెక్కును నగదుగా మార్చకుండా రిజెక్ట్ చేశారు. ఆ చెక్కును సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారింది. నెటిజన్‌ల నుంచి రకరకాల కామెంట్స్ వస్తున్నాయి.

# బిజెపి సీనియర్‌నేత సంజయ్‌కుమార్ మల్హోత్రా కన్నుమూత



విజయ్ కుమార్ మల్హోత్రా(ఫైల్)

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ విజయ్ కుమార్ మల్హోత్రా మంగళవారం ఉదయం తన 94వ ఏట కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా వయసు సంబంధిత సమస్యలతో ఢిల్లీలోని ఎయిమ్స్ లో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం ప్రాణాలు కోల్పోయినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా ఆయన మరణవార్తను ఎక్స్ వేదికగా తెలిపారు. మల్హోత్రా జీవితం మొత్తం దేశానికి, ప్రజలకు అంకితం అయినదని అన్నారు. అది ఆయన నిరాడంబరతకు, ప్రజా సేవకు నిదర్శనమని కూడా సచ్‌దేవా తెలిపారు. జనసంఘ్ రోజుల నుంచి ఆయన ఢిల్లీలో పార్టీ సిద్ధాం తాలను విస్తరించడానికి అలుపెరుగని కృషి చేశారని కొనియాడారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ సహా పలువురు కేంద్ర మంత్రులు ఆయన మృతి పట్ల ప్రగాఢసానుభూతిని వ్యక్తం చేశారు. మల్హోత్రా చేసిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు.

# భారత్ జిసిసిలవైపు అమెరికా కంపెనీల ఫోకస్

## వర్క్‌ఫ్రం ఇండియా అంటున్న టెక్ దిగ్గజాలు

## ట్రంప్ హెచ్1బి వీసా ఫీజుల భారం

**బెంగళూరు,సెప్టెంబరు 30:** అమెరికా అధ్యక్షుడు వీసా ఫీజులు ఒక్కసారిగా లక్ష డాలర్లకు పెంచడంతో ఇపుడు అమెరికా సంస్థలన్నీ కూడా భారత్‌కేంద్రంగా పనులను షిఫ్ట్‌చేసే ఆలోచనలో పడ్డాయి. అమెరికా టెక్ సంస్థలు ఇతరబహుళ జాతి సంస్థలన్నీ కూడా భారత్‌లో అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాలు (జిసిసి)లు భారత్ కేంద్రంగా ఉండటంతో వీసా భారం అధిగమించేందుకు క్లిష్టమైన ప్రాజెక్టులన్నింటినీ భారత్‌కు తరలించడమే మేలని భావిస్తున్నాయి. ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థ కలిగిన భారత్‌లో 1700కిపైగా జిసిసిలున్నాయి. అంటే ప్రపంచం మొత్తం ఉన్న సంస్థల్లో 50శాతానికిపైగా భారత్ లోనే ఉన్నాయి. లగ్జరీ కార్ డిజైన్లు, డ్యాష్ బోర్డులనుంచి ఔషధాల అన్వేషణవరకూ వీటిల్లోనే జరుగుతోంది. కృత్రిమమేధ, వీసాలపై ఆంక్షలు పెరుగుతుండటంతో అమెరికా సంస్థలు తమ కొలువుల వ్యూహాలను మారుస్తున్నాయి. భారత్‌లోని జిసిసిలతో కలిసి పనులుచేసుకోవాలని చూస్తున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలున్న జిసిసిలతో తమ పనులు చక్కబెట్టుకోవచ్చనిచూస్తున్నాయి. వీసా పెంపుభారంతో ఇపుడు అమెరికాలోని అనేక సంస్థలు తమ వర్క్‌ఫోర్స్ అవసరాలను పునఃసమీక్ష చేస్తున్నాయి. ఐదువేల డాలర్లకు మించిలేని వీసా ఫీజులు ఒకేసారి లక్షడాలర్లకు పెంచడంవల్ల నైపుణ్యం ఉన్న వర్కర్లు లభించడం కష్టంగా మారుతోంది. హెచ్‌వన్‌బి, ఎల్‌వన్ వర్క్ వీసాలకు సంబంధించి కఠిన ఆంక్షలతో కూడిన వీసా బిల్లును సెనేట్‌లో ప్రవేశపెట్టారు. ఈ బిల్లులో అనేక లొసుగులు ఉన్నాయని, అవి యాజమాన్యాలకు మేలుచేస్తున్నాయని, అమెరికన్లకు నష్టం కలుగుతోందని చెపుతున్నారు. వీటిన్నింటినీ గమనిస్తున్న అమెరికా సంస్థలు హైఎండ్ పనులు అన్నీ ఎఐతో ముడిపెడుతున్నారు. ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ, అనలిటిక్స్ వంటి వాటిని ఇండియా జిసిసిలకు తరలిస్తున్నారు.


# ప్రతీకారం నాపై తీర్చుకోండి..పార్టీ నేతలపై కాదు..

## ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ ఎదుర్కోలేదు..

## త్వరలోనే బాధితులను పరామర్శిస్తా: టివికె చీఫ్ విజయ్



**చెన్నై,సెప్టెంబరు 30:** కరూర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనతో తన హృదయం పూర్తిగా బాధతో నిండిపోయిందని టీవీకే అధినేత, నటుడు విజయ్ అన్నారు. తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోలేదన్నారు. తన మనసు పూర్తిగా బాధతో నిండిపోయినట్లు ఆయన చెప్పారు. కరూర్ తొక్కిసలాట ఘటన జరిగిన రెండురోజుల తర్వాత టీవీకే అధినేత, నటుడు విజయ్ తొలిసారి స్పందించారు. ఈ మేరకు మంగళవారం ఓ వీడియో విడుదల చేశారు. ఈ ఘటనలో తమ తప్పిదమేమీ లేకపోయినా డీఎంకే సర్కార్ తమపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని ఆయన విమర్శించారు. స్టాలిన్ ప్రభుత్వానికి ప్రతీకార వాంఛ ఉంటే తనను ఏమైనా చేసుకోవచ్చన్నారు. తమ పార్టీ నేతలను టార్గెట్ చేయొద్దని ప్రభుత్వాన్ని కోరారు. కరూర్ జిల్లాకు చెందిన టీవీకే నేతలపై పోలీసులు కేసులు పెట్టిన నేపథ్యంలో విజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. కరూర్ ఘటన నన్ను తీవ్రంగా కలిచివేసింది. నాపై అమిత ప్రేమతో ప్రజలు ర్యాలీకి వచ్చారు. తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. త్వరలోనే కరూర్ వెళ్లి బాధితులను పరామర్శిస్తాను. వాస్తవానికి మేము ఏ తప్పు చేయకపోయినా, మాపై కేసులు పెట్టారు. నిజం త్వరలోనే బయటపడుతుందన్నారు. సీఎం స్టాలిన్ మాపై ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తున్నారా కావాలంటే నాపై ప్రతీకారం తీర్చుకోవచ్చు. నాపై కోపం, మా నాయకులపై చూపించవద్దు. ఈ ఘటనకు బాధ్యుడిగా పేర్కొంటూ టీవీకే పార్టీ కరూర్ పశ్చిమ జిల్లా మథియాళన్, కార్యకర్త పౌన్‌రాజ్, యూట్యూబర్ ఫెలిక్స్ జెరాల్డ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిపై హత్యాయత్నం, ప్రజా భద్రతకు ముప్పు కలిగించడం సహా పలు సెక్షన్ల కింద అభియోగాలు మోపారు. మరోవైపు విజయ్ ఉద్దేశపూర్వక రాజకీయ బలప్రదర్శన వల్లే ఈ ఘటన జరిగిందని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.



## అబార్షన్ చేయించుకోమన్నాడని

# బాయ్‌ఫ్రెండ్ పీకకోసిన యువతి


**రాయ్‌పూర్, సెప్టెంబరు 30:** చత్తీస్‌ఘడ్‌లో దారుణమైన హత్య జరిగింది. గర్భం దాల్చిన ఓ మైనర్ అమ్మాయి తన బాయ్‌ఫ్రెండ్‌ను కత్తితో గొంతుకోసి చంపేసింది. ఈ ఘటన రాయ్‌పూర్ లోని ఏవన్ లాడ్జిలో జరిగింది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం బిలాస్‌పూర్‌కు చెందిన 16 ఏళ్ల నిందితురాలు ఈనెల 28వ తేదీన తన బాయ్ ఫ్రెండ్ మొహమ్మద్ సద్దాంను కలిసేందుకు రాయ్‌పూర్ వెళ్లింది. బీహార్‌కు చెందిన ఎంఎస్ ఇంజినీరింగ్ ఆఫీసర్ అయిన బాధిత వ్యక్తితో కలిసి లాడ్జిలో గడిపింది. ప్రెగ్నెంట్ అయిన ఆ మైనర్‌పై బాధిత వ్యక్తి వత్తిడి తెచ్చాడు. అబార్షన్ చేయించుకోవాలని ఆమెపై ప్రెజర్ పెట్టాడు. దీంతో లాడ్జి బయట ఇద్దరి మధ్య ఆ రోజు గొడవ జరిగింది. కత్తితో చంపేస్తానని బెదిరించాడతను. అయితే ఆ రోజు రాత్రి లాడ్జి రూమ్ లో సద్దాం నిద్రిస్తున్న సమయంలో అతడు బెదిరించిన కత్తితోనే అతని గొంతు కోసేసిందామె. ఆ తర్వాత రూమ్‌ను బయటి నుంచి లాక్ చేసి సద్దాం మొబైల్ ఫోన్‌తో పరారీ అయ్యింది. లాడ్జి రూమ్ తాళంచెవులను సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్ వద్ద పడేసింది. మరుసటి రోజు బిలాస్‌పూర్‌లో స్వంత ఇంటికి వెళ్లిన తర్వాత జరిగిన నేరం గురించి ఆ మైనర్ తన తల్లికి చెప్పింది. కోని పోలీసు స్టేషన్‌కు వెళ్లి నిందితురాలి తల్లి మర్డర్ గురించి ఫిర్యాదు చేసింది. ఏవన్ లాడ్జికి వెళ్లిన రాయ్‌పూర్ పోలీసులు.. అక్కడ నిర్జీవంగా పడి ఉన్న సద్దాం మృతదేహాన్ని వెలికితీశారు. బీహార్‌లో ఉన్న సద్దాం ఫ్యామిలీతో కాంటాక్టు అవుతున్నట్లు పోలీసులు తెలిపారు. బాధిత వ్యక్తికి చెందిన ఫోన్ తమ వద్ద ఉన్నట్లు చెప్పారు. కేసు రిజిస్టర్ చేసి మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మైనర్ అమ్మాయి మూడు నెలల గర్భిణి అని తెలిసింది. అబార్షన్ చేయించుకోవాలన్న ఇష్టం లేదని ఆ అమ్మాయి పేర్కొన్నది. పెళ్లి చేసుకోవాలని లేదని, గర్భస్రావం చేయించుకోవాలని సద్దాం వత్తిడి చేసినట్లు విచారణలో వెల్లడైంది. చివరకు ఆమె బాయ్‌ఫ్రెండ్ ప్రాణాలు తీసింది.

## సంక్షిప్తంగా..

# పాకిస్థాన్‌లో భారీ పేలుడు, కాల్పులు..

**ఇస్లామాబాద్, సెప్టెంబరు 30:** పాకిస్థాన్‌లోని క్వెట్టా ప్రాంతం భారీ పేలుడుతో దద్దరిల్లింది. అక్కడే కాల్పుల మోత వినిపించింది. ఫ్రాంటియర్ కోర్ కేంద్ర కార్యాలయం సమీపంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆ భద్రతా సిబ్బంది లక్ష్యంగా దాడి జరిగినట్లు తెలుస్తోంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. బలోచిస్థాన్‌లోని క్వెట్టా నగరంలో పారామిలిటరీ బలగాలకు చెందిన ఫ్రాంటియర్ కోర్ కేంద్ర కార్యాలయం సమీపంలో పేలుళ్ల ఘటన జరిగింది. దాంతో దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఇళ్లు,భవనాల కిటికీ అద్దాలు పగిలిపోయాయి. అప్పటికే ఆందోళన చెందుతున్న ప్రజలకు కాల్పుల మోత వినిపించింది. ఈ వరుస ఘటనలు స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించాయి. దాడులకు పాల్పడిన వారిని గుర్తించేందుకు బలగాలు గాలింపు చేపట్టాయి. అత్యంత తీవ్రతతో జరిగిన పేలుడుకు గల కారణాలపై దర్యాప్తు జరుగుతోంది. క్షతగాత్రులను వెంటనే దగ్గరలోని ఆస్పత్రులను తరలించారు. దాంతో ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితిని విధించారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు 13 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.

# కూలిన స్కూల్ భవనం:శిథిలాల కింద 65 మంది విద్యార్థులు



**జకార్తా, సెప్టెంబరు 30:** ఇండొనేసియాలో నిర్మాణంలో ఉన్న ఓపాఠశాల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ఓ విద్యార్థి ప్రాణాలు కోల్పోగా దాదాపు 65 మంది విద్యార్థులు శిథిలాల్లో చిక్కుకున్నారు. అంతర్జాతీయ మీడియా వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం జావాలోని సిడోర్జో పట్టణంలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల ఇస్లామిక్ పాఠశాల భవనం సోమవారం కుప్పకూలింది. మధ్యాహ్న సమయంలో భారీ సంఖ్యలో విద్యార్థులు పాఠశాల భవనంలో ప్రార్థనల కోసం గుమిగూడారు. అదే సమయంలో భవనం కూలిపోవడంతో స్థానికులు 79 మంది విద్యార్థులను రక్షించారు. ఇంకా దాదాపు 65 మంది విద్యార్థులు శిథిలాల కింద చిక్కుకున్నట్లు భావిస్తున్నారు. విద్యార్థులంతా 12 నుంచి 17 యేళ్లలోపు ఉన్నట్లు తెలిపారు. ఈ ఘటనాస్థలంలో విద్యార్థుల కుటుంబాల రోదనలు మిన్నంటాయి. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. శిథిలాలలో చిక్కుకొన్న విద్యార్థుల సంఖ్యను నిర్ధారించడానికి పోలీసులు పాఠశాల అధికారుల సాయం తీసుకుంటున్నట్లు సమాచారం.

# ఇజ్రాయెల్ గాజా యుద్ధం ముగింపు స్వాగతిస్తున్నాం: ప్రధాని మోడీ



**వాషింగ్టన్, సెప్టెంబరు 30:** ఇజ్రాయెల్ హమాస్‌ల మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు కీలక ముందడుగు పడిన విషయం తెలిసిందే. గాజాలో యుద్ధం ముగింపున కు ట్రంప్ సూచించిన 20 సూత్రాల శాంతి ఫార్ములాకు ఇజ్రాయెల్ అంగీకరించింది. ట్రంప్ ప్లాన్‌ను పలు దేశాలు స్వాగతిస్తున్నాయి. తాజాగా గాజాపై ట్రంప్ ప్రణాళికను భారత్ కూడా స్వాగతించింది. గాజాలో యుద్ధం ముగించేందుకు ట్రంప్ చేసిన ప్రణాళికను స్వాగతిస్తున్నట్లు ప్రధాన మంత్రి మోడీ తెలిపారు. ట్రంప్ ప్రణాళిక పశ్చిమాసియాలో దీర్ఘకాలిక శాంతికి మార్గమని పేర్కొన్నారు. యుద్ధం ముగించి శాంతిని నెల కొల్పే ఈ ప్రయత్నానికి అందరూ మద్దతు ఇస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ప్రస్తుతం ఆ పోస్టు వైరల్ అవుతోంది. ఇజ్రాయెల్ హమాస్‌ల మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే.

# మంత్రి బాలాజీని అరెస్టు చేయాలంటూ టివికె కార్యకర్త ఆత్మహత్య

**విల్లుపురం(తమిళనాడు),సెప్టెంబరు 30:** తమిళనాడు రాష్ట్రంలోని కరూర్ జిల్లాలో టీవీకే ప్రచార ర్యాలీలో జరిగిన తొక్కిసలాట ఘటన రాజకీయ పరంగా తీవ్ర దుమారం రేపుతోంది. విల్లుపురం జిల్లాకు చెందిన అయ్యప్పన్ (51) టీవీకే పార్టీలో కార్యకర్తగా పనిచేస్తున్నారు. మూడు రోజుల క్రితం తన వృద్ధ తల్లిదండ్రులను చూసేందుకని మైలం గ్రామానికి వెళ్లారు. అయితే, ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గమనించిన ఆయన తల్లి మునియమ్మాల్ చుట్టుపక్కల వారికి సమాచారం అందించడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయ్యప్పన్ గదిలో సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో పార్టీ చీఫ్ విజయ్ ప్రచారం సందర్భంగా 41 మంది ప్రాణాలు కోల్పోయిన కరూర్ తొక్కిసలాటకు డీఎంకే మంత్రి సెంథిల్ బాలాజీ, పోలీసులే కారణమని అయ్యప్పన్ సూసైడ్ నోట్‌లో రాశారు.

# బీహార్‌లో 7.42 కోట్ల మంది ఓటర్లు




## తుది ఓటరు జాబితా విడుదల చేసిన ఎన్నికల కమిషన్


## ముసాయిదా కంటే 18 లక్షల మంది ఓటర్లు అధికం

## అక్టోబరు 6-7 తేదీలో ఎన్నికల షెడ్యూల్?

## నవంబర్ 5-15 మధ్య మూడు దశల్లో పోలింగ్?

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడుతున్న వేళ బీహార్‌లో ఎంతో ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న తరుణంలో తుది ఓటరు జాబితా విడుదలైంది. దీంతో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ ముగిసింది. మంగళవారం విడుదలైన తుది జాబితా ప్రకారం, బీహార్‌లో 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఆగస్టు 1న విడుదల చేసిన ముసాయిదా జాబితా (7.24 కోట్లు)తో పోలిస్తే ఓటర్ల సంఖ్య 18 లక్షలు పెరిగింది. అదే జూన్ 24నాటికి ఎస్ఐఆర్ ప్రకటించిన నాటికి బీహార్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 7.89 కోట్లు. ముసాయిదా జాబితాతో పోలిస్తే వాస్తవంగా 21.53 లక్షలు అదనంగా ఉన్నారని అధికారులు తెలిపారు. కానీ 3.66 లక్షల మంది ఓటర్లు తమ పేర్లు నమోదు ఫారాలను నింపారు కానీ, గుర్తింపు పత్రాలు సమర్పించలేదు. దీంతో వారి పేర్లను తొలగించారు. దీంతో ముసాయిదా జాబితా కంటే 18 లక్షల మంది ఓటర్లు పెరిగారు. జూన్ 24కి ముందు బీహార్‌లో మొత్తం 7.89 కోట్ల మంది ఓటర్లు. ఆగస్టు 1న ఈసీ విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో 7.24 కోట్ల మంది ఓటర్లున్నారు. అంటే దాదాపు 65 మంది లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించింది. ఇక అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ అక్టోబర్ 6-7 తేదీల్లో విడుదలయ్యేఅవకాశముందని ఈసీ వర్గాలు తెలిపాయి. 3-4 తేదీల్లో కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు బీహార్‌లో పర్యటించనున్నారు. ఆ తర్వాత షెడ్యూల్ విడుదల కానుంది. నవంబర్ 5 నుంచి 15 తేదీల మధ్య మూడు దశల్లో ఎన్నికల ప్రక్రియ ఉంటుందని అధికార వర్గాల సమాచారం. ప్రస్తుత బీహార్ అసెంబ్లీ కాలపరిమితి నవంబర్ 22న ముగియనుంది. అంటే, అంతకు ముందే ఎన్నికల ప్రక్రియ ముగించాల్సి ఉన్నందున అధికారుల ఆ మేరకు ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

# ఇడి విచారణకు ఊర్వశి రౌతేలా




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో సినీనటి ఊర్వశి రౌతేలా ఈడీ విచారణకు హాజరయ్యారు. మంగళవారం ఢిల్లీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రధాన కార్యాలయానికి వెళ్లిన ఊర్వశి రౌతేలా, విచారణ అధికారుల ముందు హాజరై, పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్ చేసే సమయంలో భారత గేమింగ్, ఆర్థిక చట్టాల గురించి తెలియదా? ప్రమోషన్ చేయడం వల్ల పారితోషకం ఎంత తీసుకున్నారు? ఏ రూపంలో ఎంతెంత అందుకున్నారు? అంటూ సినీ నటిపై ఈడీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. అధికారులు అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానమిచ్చానని, విచారణ అనంతరం ఊర్వశి రౌతేలా మీడియాతో మాటాడుతూ వెల్లడించారు. ఆర్థికపరమైన అంశాలతోపాటు ప్రమోషన్స్‌కు సంబంధించిన అంశాలపైనే ప్రశ్నించారని సినీనటి పేర్కొన్నారు.

# అప్పుడు.. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలోనే గ్రూప్-1 నియామకాలు

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగులు కన్న కలలు గడచిన పది సంవత్సరాలలో కలలుగానే మిగిలాయని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం వారి కలలను నిజం చేస్తోందన్నారు.పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా గ్రూప్ 1 నియామకాల్లో ఎంపికై స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖలో జిల్లా రిజిస్ట్రార్‌లుగా నియమితులైన పలువురు అభ్యర్థులు మంగళవారం సచివాల యంలో మంత్రి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని అభినందిం చారు. ప్రజా ప్రభుత్వం అనేక కార్యక్రమాలతో ముందుకు వెళుతోందని, ఈ కీలక సమయంలో కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న అభ్యర్థులపై గురుతరమైన బాధ్యత ఉందన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో 2011 లో గ్రూప్ 1 కు నోటిఫికేషన్ జారీ చేయగా, 2018 లో భర్తీ ప్రక్రియ పూర్తయిందని గుర్తుచేశారు.

ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్ 1 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌లు జారీ చేస్తే మీరేంది భర్తీ చేసేది, తెలంగాణ సాధించు కున్నతర్వాత స్వరాష్ట్రంలో మా ఉద్యోగాలను మేమే భర్తీ చేసుకుంటామని నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తించి అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తని ఆ పార్టీ నాయకులు ఈ రోజు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం శోచనీయమన్నారు.ఉద్యోగాలు ఇవ్వా లన్నా, పేదలకు అండగా ఉండాలన్నా కాంగ్రెస్ ప్రభుత్వాలతోనే సాధ్యమని తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా గ్రూప్1 పోస్టులు భర్తీ చేసి ప్రజాప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలోనూ గ్రూప్1 పరీక్షలు నిర్వహించి నియామకాలు జరిపిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. అన్నారు ఉమ్మడి రాష్ట్రంలో క్రమం తప్పకుండా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్ 1 నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేసేవారని ఏ ఉద్యోగిని అడిగినా ఫలాన సంవత్సరంలో నియమితులయ్యామని చెప్పే వారు. కానీ దురదృష్టవశాత్తూ గడచిన పదేళ్లలో ఒక్క గ్రూప్1 ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాల భర్తీకి సంబంధించిన టిజిపిఎస్సీని పూర్తిగా నిర్వీర్యం చేశారని, ఈ దశలో అధికారంలోకి వచ్చిన తమ ప్రభుత్వం టిజిపిఎస్సీని పూర్తిగా ప్రక్షాళన చేసి గ్రూప్1, గ్రూప్2 నోటిఫికేషన్లు జారీ చేయడమేకాకుండా ఉద్యోగాలను కూడా భర్తీ చేస్తోందన్నారు.ఏడాదిన్నరలోనే దాదాపు 60 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని,ఇది చూసి ఓర్వలేని కొంతమంది ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని దుయ్యబట్టారు.గత ప్రభుత్వం స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖను ఒక ఆదాయ వనరుగానే చూసిందని సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ఎన్నో సంస్కరణలు తీసుకు వచ్చినట్లు తెలిపారు. ప్రజల సమయాన్ని ఆదా చేసేలా స్లాట్ బుకింగ్ విధా నాన్ని తీసుకువచ్చామని కార్పోరేట్‌కు ధీటుగా అత్యంత ఆధునిక వసతులతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకొని అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నామన్నారు.ప్రభుత్వ ఆలోచనలకు ఆకాంక్షలకు అనుగుణంగా నిజాయితీతో నిబద్ధతతో విధులు నిర్వహించి ప్రభుత్వ పేరు ప్రతిష్ఠలను పెంచాలని ఈ సందర్భంగా కొత్తగా నియమితులైన జిల్లా రిజిస్ట్రార్‌లకు మంత్రి సూచించారు.



# సీజనల్ కేసుల నమోదురహిత రాష్ట్రంగా నిలవాలి

### వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా

**హైదరాబాద్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :** సీజనల్ కేసుల నమోదు రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు కార్యాలయంలో సీజనల్ వ్యాధుల నివారణ పై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మంత్రి రాజనర్సింహా పాల్గొన్నారు.రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల నివారణ పై ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రదర్శనను మంత్రి పరిశీలించారు. రాషంలో అన్ని ఆసుపత్రులలో సీజనల్ రోగాలకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని సమీక్షలో మంత్రి ఆరోగ్య అధికారులు వివరించారు. సీజనల్ వ్యాధులు పూర్తి నియంత్రణలో ఉన్నాయని, గత సంవత్సరంతో పోలిస్తే సీజనల్ వ్యాధుల కేసులు తగుముఖం పటాయని సమీక్షలో డైరెక్టర్ అఫ్ హెల్త్ డా. రవీందర్ కుమార్ వెలడించారు. సీజనల్ వ్యాధుల కట్టడి పై ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్ర స్థాయి లో పర్యటించి ప్రజలో అవగాహన ను కల్పించామని వెల్లడించారు. సమీక్షలో రాష్ట్ర వైద్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి డా. క్రిసినా జెడ్ చోంగ్తూ,ఆరోగ్యశ్రీ, ట్రస్ట్ సీఈఓ ఉదయ్ కుమార్, టీ ఎంఈ డా. నరేంద్ర కుమార్, డైరెక్టర్ అఫ్ హెల్త్ డా. రవీందర్ కుమార్, టీవివిపి కమిషనర్ డా. అజయ్ కుమార్ స్పెషల్ ఆఫీసర్ విమలా థామస్ పాల్గొన్నారు.

# రాత్రి కరెంట్ వినియోగదారులపై బాదుడే!

### రాయితీ ఎత్తివేయాలని డిస్కంల పిటిషన్

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** డిమాండ్ లేని సమయంలో వినియోగ దారులకు ఇస్తున్న రాయితీని ఎత్తివేసేందుకు అనుమతి ఇవ్వాలని తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్‌లో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు పిటీషన్‌లు వేశాయి. ప్రస్తుతం రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకూ కరెంట్ వినియోగిస్తున్న వారికి విద్యుత్ పంపిణీ సంస్థలు యూనిట్‌కు రూ.1.50 రాయితీని ఇస్తున్నాయి. 2025-26లోని ఏప్రిల్, మే, జూన్ నెలల్లో విద్యుత్ డిమాండ్ ఉన్న పీక్ అవర్స్‌లో రూ.4.79, సాధారణ సమయంలో రూ.4.24, సాయంత్రం పీక్ అవర్స్‌లో రూ.5.77 చొప్పున కొనుగోలు చేస్తుండగా, ఇన్సెంటివ్ సమయంలో రూ.5.59 చొప్పున విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు పంపిణీ సంస్థలు పిటిషన్‌లో పేర్కొన్నాయి. అయితే అదనపు ఆదాయం కోసం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్న పంపిణీ సంస్థలు విద్యుత్ డిమాండ్ లేని సమయంలో వినియోగదారులకు ఇస్తున్న రూ.1.50 రాయితీని ఎత్తివేయాలని విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు సమర్పించిన పిటిషన్‌లో కోరాయి.

# జూబ్లీహిల్స్‌లో 3,98,982 ఓటర్లు

### పురుషులు -207367, స్త్రీలు -1,91,1590, ఇతరులు 25 మంది

### తుదిజాబితా విడుదల చేసిన ఎన్నికల సంఘం

**హైదరాబాద్, సెప్టెంబరు 30,ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా జరిగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలనీ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ కోరారు. ఈమేరకు మంగళవారం కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధ్యక్షతన జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ... భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ రోజు తుది ఓటరు జాబితా విడుదల చేశామన్నారు. తుది జాబితా ప్రకారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 407 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 3,98,982 మంది ఓటర్లు ఉన్నాయన్నారు. అందులో పురుషులు -207367 స్త్రీలు -1,91,1590, ఇతరు 25మంది ఉన్నట్లు తెలిపారు. ఓటర్లు తమ పేరును ఓటరు జాబితాలో వెరిఫై చేసుకునేందుకు ఈసిఐ వెబ్‌సైట్, సిఈవో వెబ్‌సైట్, ఈఆర్‌వో కార్యాలయం, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ లో సంప్రదించ వచ్చుననీ కమిషనర్ తెలిపారు.

రాజకీయ పార్టీలు, పౌరులు ఫారం6, ఫారం7, ఫారం8 లో అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు చేసుకోవడానికి నామినేషన్ల చివరి తేదీ వరకు అవకాశం ఉందన్నారు. జూలై 1, 2025 నాటికి18 ఏళ్లు నిండిన వారు, అర్హులు ఉండి ఇప్పటికీ ఓటరుగా నమోదు చేసుకొని వారు ఫారం6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో ఉన్న పోలింగ్ కేంద్రాలకు అదనంగా కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పడినందువల్ల కొంతమంది ఓటర్లు సమీప పోలింగ్ కేంద్రాలకు మార్చబడ్డారని తెలిపారు. కాబట్టి ఓటర్లు తమ వివరాలు ఈసీఐ, సీఈవో వెబ్‌సైట్‌లలో తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని సూచించారు.

స్వేచ్ఛాయుత, నిష్పాక్షి క, పారదర్శక ఎన్నికలు జరగడానికి అన్ని రాజకీయ పార్టీలు అన్ని పోలింగ్ కేంద్రాలకు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలని ఆర్.వి. కర్ణన్ కోరారు.అంతకుముందు తుది జాబితా ప్రతులను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు.సమావేశంలో జోనల్ కమిషనర్ రవి కిరణ్ , రాజకీయ పార్టీల తరఫున కె. నందేశ్ కుమార్ (బీఎస్పీ), పొన్న వెంకటరమణ, కొల్లూరు పవన్ కుమార్ (బీజేపీ), విజయ్ మల్లంగి (ఆప్), ఎం. శ్రీనివాసరావు (సీపీఐఎం), పి. రాజేశ్ కుమార్ (కాంగ్రెస్), ముఠా జై, ఎ. శ్రీనివాస్ గుప్తా (బీఆర్ఎస్), కె.జోగేందర్‌సింగ్, బి.వై.శ్రీకాంత్ (టీడీపీ), సయ్యద్ ఖలీలుద్దీన్ (ఏఐఎంఐఎం) తదితరులు

# ఆరు కోట్ల విలువైన గంజాయి పట్టివేత

**అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త :** ఒడిశా రాష్ట్రం నుంచి రాజస్థాన్ రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న 12 క్వింటాళ్ల గంజాయిని రాచకొండ పోలీసులు పట్టుకున్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు మంగళ వారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నిందితుల వివరాలను వెల్లడించారు. రాజస్థాన్ జోధ్పూర్ జిల్లాకు చెందిన విక్రమ్ వైష్ణవ్ డ్రైవర్ గా విధులు నిర్వహిస్తూ అక్రమంగా గంజాయిని తరలించేవాడు. ఈ క్రమంలో రాజస్థాన్ కు చెందిన కొంతమంది గంజాయి స్మగ్లర్లతో పరిచయం ఏర్పాటు చేసుకున్నాడు. జోద్పూర్ కు చెందిన దేవీలాల్ అలియాస్ కట్టు (మీడియేటర్), అయూబ్ ఖాన్ (రిసీవర్),రామ్ లాల్ డీసీఎం ఓనర్ లు విక్రమ్ డ్రైవర్ గా ఏర్పరచుకొని ఒడిశా మల్కానగిరి జిల్లా నుంచి రాజస్థాన్ కు గంజాయి సరఫరా చేసేందుకు ఐదు లక్షలు ఒప్పందం చేసుకున్నారు. దేవిలాల్,రామ్ లాల్,అయూబ్ కాన్ లు గాంజా సరఫరా చేసేందుకు తమ ప్రాంతంలో నెట్వర్క్ ఏర్పాటు చేసుకున్నారు. వీరి ఆదేశాల మేరకు విక్రమ్ ట్రక్కులో రాజస్థాన్ జైపూర్ నుంచి ఐరన్ లోడ్ తీసుకొని మహారాష్ట్ర నాందేడ్ లో అన్లోడ్ చేశాడు. అక్కడ నుంచి హైదరాబాద్ మీదుగా ఖమ్మం ఒడిశా వెళ్ళాడు. ట్రక్కులో ఎవరికి అనుమానం రాకుండా వెనుకభాగంలో సిమెంట్ బ్యాగులు నింపి ముందు భాగాన్ని ఖాళీగా ఉంచాడు. దేవిలాల్, రామ్‌లాల్, అయూబ్ కాన్ ఆదేశాలతో మల్కాన్ గిరిలో సుమారు 12 కింటల్లో గంజాయి బ్యాగులను ట్రక్కు ముంగటి భాగంలో వేసుకొని ఎవరికి అనుమానం రాకుండా తార్పాల్ కప్పాడు. ఒడిస్సా నుంచి రాజస్థాన్ వెళ్లేందుకు విక్రమ్ తిరుగు ప్రయాణమయ్యాడు. మంగళవారం మహేశ్వరం ఎస్ఓటి అబ్దుల్లాపూర్మెట్ పోలీసులకు సమాచారం రావడంతో విజయవాడ జాతీయ రహదారి కొత్తగూడెం వద్ద వాహనాన్ని తనిఖీ చేయగా అందులో సుమారు 6 కోట్ల విలువచేసే 12 క్వింటాల్ గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని డ్రైవర్ విక్రమ్ అదుపులోకి తీసుకొని విచారి స్తున్నారు. నిందితుడు వద్ద నుండి 12 క్విం టాళ్ల గంజాయి సరఫరా చేసే ట్రక్కు, సెల్‌ఫోన్‌ని స్వాధీనం చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సిపి సుధీర్‌బాబు

# రెండుచోట్ల ఎక్సైజ్ దాడులు.. 86 మద్యం బాటిళ్ల స్వాధీనం

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** పహాడీషరీఫ్ వద్ద రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎఇఎస్ జీవన్ కిరణ్ అధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో 41 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.గోవా, హర్యానా, ఢిల్లీ ప్రాం తాల నుంచి మద్యం బాటిళ్లు వచ్చినట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న మద్యం బాటిల్లను సరూర్నగర్ ఎక్సైజ్ పోలీస్స్టేషన్లో అప్పగించారు. ఎస్టీఎఫ్ బీ అండ్ డీ టీమ్‌లు శంషాబాద్ ఏరియాలో నిర్వహించిన దాడుల్లో 45 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్టీఎఫ్‌సీ టీమ్ సీఐ బిక్షారెడ్డి, డీ టీమ్ సీఐ నాగరాజులు సిబ్బంది కలిసి చేపట్టిన వాహన తనిఖీల్లో మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. రెండు చోట్ల పట్టుకున్న మద్యం బాటిళ్ల విలువ రూ. 2.50 లక్షలుగా ఉంటుందని అంచనాలు వేశారు.

**ఆబ్కారీభవన్‌లో చండీ హోమం..**

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అబ్కారీభవన్‌లో మంగళవారం దేవి నవరాత్రుల సందర్భంగా చండి హోమం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ఎక్సైజ్ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.చండిహోమం వద్ద పూజలు నిర్వహించి , శ్రీలలిత త్రిపుర సుందరి దేవి అలయంలో అమ్మవారి వద్ద పూజలు నిర్వహించి పురోహితుల ఆశ్వీరాదాలు తీసుకున్నారు. నేడు దేవాలయ ప్రాంగణంలో చండి యాగం, పూర్ణహుతి, అన్నదాన కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో టీజీబీసీ నుంచి జనరల్ మేనేజర్ బి. అంశా, అసిస్టెంట్ మేనేజర్ వి.జయ లక్ష్మి, విజయలు పాల్గొన్నారు.



# మూసీ పరీవాహక ప్రాంతంలో కూలుస్తున్న పేదల ఇళ్లు

### అక్రమ నిర్మాణాలకు మద్దతు

### బిజెపి ఎంపి రఘునందన్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం మూసి జపం చేస్తోందని బిజెపి ఎంపి రఘునందన్‌రావు మండిపడ్డారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రజలు ఒకటి కోరుకుంటే.. ప్రభుత్వం మరొకటి చేస్తోందన్నారు. అభివృద్ధి పేరుతో మూసి పరివాహక ప్రాంతాల్లో పేదల ఇళ్లు కూలుస్తుందని, నార్సింగిలో అక్రమ నిర్మాణాలు భారీగా పెరిగిపోయాయన్నారు. ఆదిత్య వింటేజ్ బంగ్లాను పూర్తిగా మూసి పరివాహకంలో నిర్మిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆదిత్య వింటేజ్ బంగ్లా నిర్మాణం నిలివేస్తామని చెప్పారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తీసుకెళ్లాలని అన్నారు. సర్వీస్ రోడ్డు ఆక్రమించి కట్టే భవనానికి హెచ్ఎండిఏ ఎలా అనుమతి ఇచ్చిందని ప్రశ్నించారు. ఇది పూర్తిగా ఎఫ్‌టిఎల్ పరిధిలోనే నిర్మిస్తున్నారని, ఆదిత్య వింటేజ్ బంగ్లా నిర్మాణాలపై సిఎం రేవంత్ పాటు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు లేఖ రాస్తున్నానని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే కోర్టుకు వెళ్లాలని, కోర్టులో ఆదిత్య వింటేజ్ బంగ్లాపై ఏ గద్ద వాలిందో.. ఎన్ని సూట్ కేసులు ఎత్తుకెళ్లిందో అక్కడే తేల్చుతానంటూ రఘునందన్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి సహచరి మాలతి. చిత్రంలో గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు తదితరులు

# బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీం జడ్జిచే విచారణ

### తెలంగాణ పౌర హక్కుల సంఘం డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కట్టా రామచంద్రారెడ్డి, కదారి సత్యనారాయణరెడ్డి బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్‌చే న్యాయవిచారణ జరిపించాలని, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామచంద్రారెడ్డి సహచరి మాలతి మాట్లాడుతూ రామ చంద్రారెడ్డి అంత్యక్రియలు అక్టోబరు 8నగాని 9న సిద్దిపేట జిల్లా కోయల మండలం, తీగలకుంటపల్లిలో జరుగుతాయని చెప్పారు. ఈ అంత్యక్రియలకు అభిమానులు, సానుభూతిపరులు పెద్దఎత్తున హాజరై ఘనంగా నివాళులు అర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆమెతోపాటు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర బలగాలు 21 నెలలపాటు 70 ఎన్‌కౌంటర్ల పేర్లతో ఇప్పటివరకు 700 మంది మావోయిస్టులు, ఆదివాసీలను కాల్చిచంపారని, వీటిలో 99 శాతం బూటకపు ఎన్‌కౌంటర్లు జరిగాయని వారు ఆరోపించారు. సెప్టెంబరు 10వ తేదీ వరకు ఈ కేంద్ర కమిటీ సభ్యులు సురక్షితంగా ఉన్నారని, 11న వారిని అరెస్టు చేసి పదిరోజులపాటు రహస్య సమాచారం కోసం చిత్రహింసలకు గురిచేసి 22న అబూజ్‌మడ్ ఇలాకా మూప్పర్తి అడవుల్లో ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపారని వారన్నారు. పోలీసుల నిర్బంధంలో వారు ఉన్నప్పటికీ విషయం బయటకు పొక్కనీయకుండా న్యాయస్థానంలో ప్రవేశపెట్టకుండా అత్యంత కిరాతకంగా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం చంపివేసిందని ఆరోపించారు.

# 31.8 శాతం బాలల్లో పౌష్టికాహార లోపం

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** తెలంగాణలోని 5 యేళ్లలోపు చిన్నారుల్లోని 31.8 శాతం మంది పోషకాహార లోపంతో బాధ పడుతున్నారు. పట్టణాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లోనే చిన్నారుల్లో పోషకాహార లోపం అధికంగా ఉన్నట్టు మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ వెల్లడించింది. బాలికల కంటే బాలురలోనే ఈ సమస్య అధికంగా ఉన్నట్టు పేర్కొంది. ఈ మేరకు సెంట్రల్ అండ్ స్టేట్ స్టాటిస్టికల్ ఆర్గనైజేషన్ కార్యక్రమంలో చిల్డ్రన్ ఇన్ ఇండియా-2025 పేరిట నివేదికను విడుదల చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో 35 శాతం, పట్టణాల్లో 25.8 శాతం చిన్నారులు పోషకాహార లోపంతో బాధ పడుతున్నట్టు పేర్కొంది. బాలురలో 33.4 శాతం, బాలికల్లో 30 శాతం మంది పోషకాహార లోపంతో బాధ పడుతున్నట్టు వివరించింది. ఇక రాష్ట్రంలో పలువురు పిల్లలు ఒబెసిటీ (స్థూలకాయం)తో బాధ పడుతున్నారు. పట్టణాల్లోని చిన్నారుల్లో 4.2 , గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారుల్లో 3.0 మంది స్థూలకాయంతో బాధపడుతున్నట్టు తెలిపింది. దీనికి సంబంధించి బాలురులో 3.0 శాతం, బాలికల్లో 3.8 శాతం మంది ఈ సమస్యతో సతమతమవుతున్నారని అధ్యయనం వెల్లడించింది.

# గృహిణులు, ఖైదీలను యువత చదువులో ఆదర్శంగా తీసుకోవాలి

### ఘనంగా బిఆర్ అంబేద్కర్ స్నాతకోత్సవాల్లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ




స్నాతకోత్సవంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, చిత్రంలో ఇగ్నో విసి ఆచార్య ఉమాకంజిలాల్, అంబేద్కర్ వర్సిటీ విసి ఘంటా చక్రపాణి తదితరులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** విద్యను అభ్యసించడంలో మహిళలను, ఖైదీలను ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యా లయ కులపతి జిష్ణుదేవ్ వర్మ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయ 26వ స్నాతకోత్సవాలు మంగళవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. గవర్నర్ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులకు అపారమైన అవకాశాలున్నాయని, విద్యార్థికి చదువుతోపాటు పారిశ్రామిక ప్రగతికి అవసరమైన సాంకేతిక నైపుణ్యం, డిజిటల్ లిటరసీ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. డిజిటల్ విద్య, నైపుణ్య సాధికారత, విద్యార్థులకు ఉపాధి కల్పనకు అంబేద్కర్ వర్సిటీ చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. ఆదివాసీ, గిరిజన విద్యా ర్థులకు ఉచిత విద్యను అందిస్తూ సమాజంలో అందరికి సమాన అవకాశాలు కల్పించడానికి చేస్తున్న కృషి గొప్పదన్నారు. ట్రాన్స్‌జెండర్ విద్యార్థులు, దివ్యాంగులకు ఉచిత ఉపకార వేతనాలు రాజ్యాంగ విలువలను కాపాడేలా ఉన్నాయన్నారు. ఉద్యోగం చేస్తూ చదువుకోవడం, గృహిణులు, వయోవృద్ధులు, వికలాంగులు, పేద విద్యార్థులు, ఖైదీలకు విశ్వవిద్యాలయం ఒక గొప్ప వరమని అన్నారు. ఇగ్నో ఉపకులపతి ఆచార్య ఉమాకాంజీలాల్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానం కీలక భూమిక పోసిస్తుందన్నారు. మూక్స్ ద్వారా ఉపాధి నైపుణ్యాలతో అంబేద్కర్ వర్సిటీ ముందడుగు వేస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రముక గేయ రచయిత గోరటి వెంకన్న, శాంతి విద్య ప్రచారకులు ప్రేమ్ రావత్‌లకు గౌరవ డాక్టరేట్లను అందించారు.

డిగ్రీ, పీజీ తదితర కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన 60,288 మందికి ఉత్తీర్ణత పత్రాలు అందించారు. మొత్తం 86 మందికి బంగారు పతకాలను అందించారు. 203 మంది ఖైదీలు డిగ్రీ పూర్తిచేసుకోగా వారిలో ఇద్దరు ఖైదీలు బంగారు పతకాలు సాధించగా, ఇద్దరు ఖైదీలు బుక్‌ప్రైజ్ అందుకున్నారు. కార్య క్రమంలో ఐఎఎస్ యోగితారాణి, విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ విజయకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**'సార్వత్రిక్ష కుటుంబం**

తిరుపతికి చెందిన శ్రీధర్ టిటిడిలో చిరుద్యోగి. ఆయన అంబేద్కర్ వర్సిటీలో డిగ్రీ చదివారు. ఆయన సతీమణి ఉమాదేవి ఇదే వర్సిటీలో డిగ్రీలో చేరారు. కుమారుడు కార్తిక్ ఎంకాం పూర్తిచేసి అధ్యాపకుడిగా కొనసాగుతున్నాడు. పెద్ద కుమార్తె విద్య ఎమ్మెస్సీ సైకాలజీ పూర్తి చేయగా, చిన్న కుమార్తె గాయత్రి ఎంకాం చదివి బంగారు పతకం సాధించారు. ఎంకాంలో అత్యధిక మార్కులు సాధించడంతో భారతీయ స్టేట్ బ్యాంకు ప్రాయోజిత బంగారు పతకానికి ఎంపికైంది. ఆమెకు స్నాతకోత్సవంలో గవర్నర్ బంగారు పతకాన్ని అందించారు.

# ఎమ్మెల్యే కాలేరు దౌర్జన్యంపై సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండన

**హైదరాబాద్, సెప్టెంబరు 30,ప్రభాతవార్త:** సిపిఎం హైదరాబాద్ సెంట్రల్‌సిటీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడైన మహేందర్‌పై అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు, దుర్భాషలను సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఓ ప్రకటనలో తెలిపారు. అనునిత్యం ప్రజల్లో ఉంటూ, ప్రజల తరపున పోరాటం చేస్తున్న సిపిఎం నాయకులపై దౌర్జన్యాలకు పాల్పడితే ప్రజల నుంచి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మంగళవారం అంబర్పేట్ ఏరియాలో వరదబాధితులకు పురుగులతో కూడిన బియ్యాన్ని ఎంఎల్ఎతో పాటు, అధికారులు పంచుతుండగా మహేందర్, సిపిఎం నాయకులు, కార్యకర్తలు అడ్డుకుని నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేసారు. దీన్ని జీర్ణించుకోలేని స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ నోటికొచ్చినట్లు బూతులు తిడుతూ, అక్కడినుండి ఈడ్చు కెళ్లా లని, తర్వాత వాని అంతు చూస్తానని మహేం దర్‌ను బెదిరించడం సరైంది కాదన్నారు. ప్రజాప్రతినిధిగా ఉండి ఇలాంటి బెదిరింపులకు పాల్పడడం సరైందికాదని సిపిఐఎం పార్టీ నాయ కులు, కార్యకర్తలు ఇలాంటి బెదిరింపులకు, దౌర్జన్యాలకు భయపడేవారు కాదన్నారు.

# సిపిఎస్ వద్దంటూ నేడు ఎక్స్ అకౌంట్ వార్

### ఎన్ఎంఒపిఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 1న 11 గంటల నుంచి సిపిఎస్ వద్దు యుపిఎస్ వద్దు ఒపిఎస్ ముద్దు అంటూ హాష్‌టాగ్‌తో దేశ ప్రధాని, కేంద్ర ఆర్థికమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రుల,ఆర్థిక మంత్రిలను టాగ్ చేస్తూ దేశ వ్యాప్తంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు ఎక్స్‌అకౌంట్ ద్వారా తమ మెసేజ్‌లతో వినతులు తెలుపుతారని సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ తెలిపారు. అదే విధంగా ఇటీవల ఉపాధ్యాయులకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్‌లో ఉపాధ్యాయులు రెండు సంవత్సరాల్లో టిఈటి ఉత్తీర్ణత కాకుంటే ఉపాధ్యాయుడిని తన ఉద్యోగం నుండి తొలగించడం అనేది ఉద్యోగిగా తనకు ఉన్న ఫండమెంటల్ రూల్స్‌ను ఉల్లంఘించడమేనని, అందు కోసం ఆర్‌టిఈ చట్ట సవరణకు ట్విట్టర్ ఎక్స్ ద్వారా తమ వినతిని తెలుపుతారని స్థితప్రజ్ఞ తెలిపారు. ఉద్యోగ ఉపాధ్యాయుల్లో సిపిఎస్ యూపిఎస్ పట్ల ఉన్న వ్యతిరేకత తెలుపుతారన్నారు.ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ గత సంవత్సరం 2024 ఆగస్టులో కేంద్ర క్యాబినెట్ ఆమోదం పొందిన నేటి వరకు యుపిఎస్, ప్రభుత్వ ఉద్యోగులను ఎందుకు ఆకర్షించలేదో కేంద్ర ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసుకోవలని, ఉద్యోగులు యుపిఎస్‌ని కాదు, ఓపిఎస్‌ని మాత్రమే కోరుకుంటున్నారని ఇటీవల ఎన్. ఎంఓపిఎస్‌కు పిఎఫ్ఆర్‌డిఏ ఆర్‌టిఐ ద్వారా ఇచ్చిన ఈ సమాధానాన్ని చూస్తే అర్థం అవుతుందని స్థితప్రజ్ఞ అన్నారు. సెప్టెంబర్ 24వ తేదీ వరకు 25 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో కేవలం యూపిఎస్‌ను కేవలం 70,670 మంది మాత్రమే ఎంచుకున్నారని ఇటీవల ఆర్‌టిఐ ద్వారా తెలిసిందన్నారు.ఇప్పటికి ఉద్యోగుల సంక్షేమాన్ని సామాజిక భద్రతను షేర్ మార్కెట్ పాలు చేయకుండా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సిపిఎస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్ గౌడ్‌లు పాల్గొన్నారు.



# ముగిసిన బిఐఎస్ శిక్షణ తరగతులు

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) హైదరాబాద్ కార్యాలయంలో రెండు రోజులు పాటు జరిగిన శిక్షణా కార్యక్రమం మంగళవారంతో ముగిసింది.రెండు రోజులు పాటు సెంట్రల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (సిపిటిఐ)లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రానికి చెందిన 46 మంది అధికారులు పాల్గొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఆధునిక సాంకేతికతపై ప్రత్యేక దృష్టి సారించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అంతే కాకుండా విద్యుత్ పంపిణీ రంగానికి సంబంధించిన భారతీయ ప్రమాణాలపై దృష్టి సారించించారు. ముఖ్యంగా విద్యుత్ పంపిణీ ఓవర్‌హెడ్ కండక్టర్లు, పంపిణీ వ్యవస్థల కోసం భూగర్భ కేబుల్‌లు, పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు ఎంపిక, పరీక్షలు తదితర అంశాలపై మొదటి రోజు విస్తృతంగా చర్చించారు.రెండో రోజు జరిగిన సమావేశంలో ఏరియల్ బంచ్డ్ కేబుల్స్, ఇన్సులేటర్ల ఎంపిక , డైమెన్షనింగ్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఎంపిక,ఇన్‌స్టాలేషన్.నిర్వహణ, మినరల్ ఇన్సులేటింగ్ ఆయిల్స్ పర్యవేక్షణ, నిర్వహణ, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తు తదితర అంశాలపై చర్చ జరిగింది. ఇటువంటి కార్యక్రమాలు తరచు జరగడం ద్వారా వినియోగదారులకు నాణ్యమైన, మరింత మెరుగైన వస్తువులు అందుబాటులోకి తీసుకు వచ్చే అవకాశం ఉంటుందనే అభిప్రాయాన్ని ఈ కార్యక్రమానికి హైజరైన అధికారులు వ్యక్తం చేశారు.




## గాంధీ విగ్రహం వద్ద విద్వేషపూరిత రాతలు

**లండన్, సెప్టెంబరు 30:** బ్రిటన్ రాజధాని లండన్‌లో మహాత్మాగాంధీ విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. లండన్‌లోని టావిస్టాక్ స్క్వేర్‌లో ఉన్న గాంధీ విగ్రహంపై గుర్తుతెలియని వ్యక్తులు విద్వేషపూరిత వ్యాఖ్యలు రాశారు. టెర్రరిస్టు, గాంధీ,మోడీ హిందుస్థాని టెర్రరిస్టులని నల్ల రంగుతో విగ్రహంపై రాశారు. మహాత్ముని జయంతికి మూడు రోజుల ముందు జరిగిన ఈ ఘటనను అక్కడి భారత రాయబార కార్యాలయం తీవ్రంగా ఖండించింది. దీనిని సిగ్గుమాలిన చర్యగా పేర్కొంది. దీనిని అహింస వారసత్వంపై జరిగిన దాడిగా అభివర్ణించింది. మహాత్ముని విగ్రహాన్ని పూర్వ రూపంలోకి తీసుకు వచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారని తెలిపింది. మహాత్మా గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తంచేయడంపాటు తీవ్రంగా ఖడిస్తున్నామని ఎక్స్ వేదికగా వెల్లడించింది. అంతర్జాతీయ అహింసా దినోత్సవానికి సరిగ్గా మూడు రోజుల ముందు జరిగిన ఈ ఘటన కేవలం ధ్వంసం మాత్రమే కాదని, అహింస భావనపై, మహాత్ముడి వారసత్వంపై జరిగిన హింసాత్మక దాడి అని తెలిపింది. మహాత్ముని జయంతి అయిన అక్టోబర్ 2ను ప్రతి సంవత్సరం అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కాగా, ప్రముఖ కళాకారిణి ఫ్రెడ్డా బ్రిలియంట్ రూపొందించిన గాంధీజీ కాంస్య విగ్రహాన్ని లండన్‌లోని టావిస్టాక్ స్క్వేర్‌లోని యూనివర్సిటీ కాలేజ్ సమీపంలో 1968లో ప్రతిష్ఠించారు.

## రేపు మద్యం, మాంసం దుకాణాలు బంద్

### పూర్తిగా మూసేయాలి : జిహెచ్ఎంసి

**హైదరాబాద్,సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది. అక్టోబర్ 2వ తేదీన నగరంలోని అన్ని మాంసం దుకాణాలు మూసివేయనున్నారు. గొర్రెలు, మేకలు, పశువులు, పందుల మాంసం విక్రయించే రిటైల్ దుకాణాలతో పాటు, గొడ్డు మాంసం విక్రయ కేంద్రాలు కూడా పూర్తిగా మూసివేయాలని జిహెచ్ఎంసి ఆదేశించింది. గాంధీ జయంతి సందర్భంగా హింసకు తావు లేకుండా ఈ చర్య తీసుకున్నారు. మున్సిపల్ అధికారులు ఈ ఆదేశాల అమలును పర్యవేక్షిస్తారు. ఈ సంవత్సరం దసరా పండగ అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున వచ్చింది. దీంతో హైదరాబాద్ నగరంలోని మాంసం ప్రియులతో పాటు మద్యం వినియోగదారులకు కూడా కొంత నిరాశ ఎదురుకానుంది. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని.. అక్టోబర్ 2వ తేదీన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మాంసం విక్రయాలపై కఠినమైన నిషేధం ఉంటుంది. గాంధీజీ సిద్ధాంతాలను గౌరవిస్తూ, హింసకు తావు లేకుండా ఈ డ్రై డే అమలు చేయాలని జీహెచ్ఎంసీ ఆదేశించింది. జిహెచ్ఎంసిస్టాండింగ్ కమిటీ తీర్మానం నం 172 (సెప్టెంబర్ 24, 2025) ఆధారంగా.. బిబీఎంది చట్టంలోని సెక్షన్ 533(బి)ప్రకారం ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. దీని ప్రకారం.. పశువులు, గొర్రెలు, మేకల కబేళాలు పూర్తిగా మూసివేయనున్నారు. నగరంలోని అన్ని రిటైల్ మాంసం దుకాణాలు, గొడ్డు మాంసం విక్రయ కేంద్రాలు కూడా మూసివేయాలని ఆదేశించారు. మున్సిపల్ సిబ్బంది ఈ ఆదేశాల అమలును పటిష్టంగా పర్యవేక్షిస్తారు. ఆదేశాలను ఉల్లంఘించే దుకాణాలపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. సాధారణంగా దసరా పండుగ సందర్భంగా మాంసం విక్రయాలు, వినియోగం అధికంగా ఉంటుంది. అయితే.. దసరా పండుగ కూడా అక్టోబర్ 2వ తేదీన వస్తుండగా. మాంసం విక్రయాలు నిలిపివేయడంతో నాన్ వెజ్ ప్రియులకు కొంత ఇబ్బంది తప్పదు. ఇక మద్యం విషయానికి వస్తే.. అక్టోబర్2న రాష్ట్రవ్యాప్తంగా సాధారణంగా డ్రై డే అమలు చేస్తారు. అంటే.. మద్యం దుకాణాలు, బార్లు, పబ్‌లు పూర్తిగా మూసివేస్తారు. ఈ నిర్ణయం మద్యం వినియోగదారులకు అసౌకర్యాన్ని కలిగిస్తుంది. దసరా సంబరాలు ఉన్నప్పటికీ.. ఈ ఒక్క రోజు మాత్రం మద్యం అందుబాటులో ఉండదు.

## భారీగా విద్యుత్ డిమాండ్

**15 శాతం పెరిగిన మార్కెట్, ట్రేడింగ్ వాల్యూమ్‌లు**

**డేటా సెంటర్లు, హైడ్రోజన్, ఎలక్ట్రిక్ వాహనాలే కారణం**

**ఇదే సమయంలో పెరుగుతున్న సైబర్‌నప్రమాదం**

**2030 నాటికి విద్యుత్ రంగానికి రూ.33 లక్షల కోట్లు ఖర్చు**

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** కొత్తగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను అధిగమించేందుకు పక్కా ప్రణాళికతో కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. అధికంగా డేటా సెంటర్లు, గ్రీన్ హైడ్రోజన్, సామర్థ్య మార్కెట్లు వంటి వాటితో వేగంగా విద్యుత్ వినియోగం పెరుగుతోంది. మొత్తం విద్యుత్ వినియోగంలో ప్రధానంగా మార్కెట్, స్వల్పకాలిక ట్రేడింగ్ వాల్యూమ్‌ల నుండే 15 శాతానికి పెరిగాయి. అలాగే 8 నుండి 9 శాతం వరకూ విద్యుత్ సరఫరా పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా జరుగుతుందని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సిఇఎ) అధికారవర్గాలు వెల్లడించాయి. డేటా సెంటర్లు నేడు ఒక గిగావాట్ల నుండి తక్కువ వ్యవధిలో 16 గిగావాట్లకు పెరుగుదల చోటు చేసుకుంటోంది. అలాగే గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, విద్యుత్ వాహనాలు కూడా గణనీయమైన డిమాండ్‌ను పెంచుతున్నట్లు గుర్తించింది. అంతేకాకుండా ఈ రంగాలు వారం రోజులూ 24 గంటల పాటు విద్యుత్ వినియోగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఉత్పత్తిని పెంచాల్సిన అవసరాన్ని గుర్తించింది. ఇదే సమయంలో విద్యుత్ పంపిణీ సంస్థల పనితీరును మెరుగుపచే దిశగా ఇప్పటికే చర్యలు చేపట్టినా, మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉందని భావిస్తోంది. ఇందుకు రూఫ్‌టాప్ సోలార్, ఇతర పునరుత్పాదక శక్తితో లోడ్ డిస్పాచ్ కేంద్రాలకు ఆటోమేషన్ మద్దతుతో పంపిణీ స్థాయి వరకూ పటిష్ట ఏర్పాట్లు చేయనుంది. డిమాండ్‌తో పాటు, మరోపక్క సైబర్ ప్రమాదం పెరుగుతున్నందున భద్రతపై సైతం దృష్టిసారించింది. ముఖ్యంగా స్మార్ట్ మీటర్లు, ప్రోసుమర్లు గ్రిడ్‌లోకి ప్రవేశించడంతో ముప్పు పెరుగుతోంది. అయితే దీన్ని అడ్డుకట్ట వేసేందుకు ఇప్పటికే ఐఐటీ కాన్పూర్ సహకారంతో బెంగుళూరులోని ఐఐఎస్సీలో సైబర్ భద్రతపై ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు చేసింది. కాగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను ఎదుర్కొనేందుకు, ఏకీకరణ సవాళ్లను అధిగమించడానికి 2032 నాటికి దేశంలోని విద్యుత్ ఉత్పత్తి రంగానికి 33 లక్షల కోట్ల రూపాయలు అవసరం ఉంటుందని కేంద్రం అంచనా వేసింది. ఇదే సమయంలో 3.78 మిలియన్ల విద్యుత్ ఉత్తి చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు దీనికి సంబంధించి సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సిఈఏ) తాజాగా 2022-32 కాలానికి గాను ప్రతిష్టాత్మక జాతీయ విద్యుత్ ప్రణాళిక (ఎన్‌ఇపి)ను రూపొందించింది. ఈ కాలంలో 378,370 మెగావాట్ల సామర్థ్యానికి విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని ఈ ప్రణాళికలో స్పష్టం చేసింది. 2022-27 సంవత్సరాల కాలంలో మొత్తం సామర్థ్యం అదనంగా 211,819 మెగావాట్లు ఉంటుందని అంచనా. ఇందులో పునరుత్పాదక విద్యుత్‌కు సంబంధించి 179,939 మెగావాట్లు, అణు విద్యుత్ 6,300 మెగావాట్లు, థర్మల్ (బొగ్గు, గ్యాస్) ప్రాజెక్టు ద్వారా 25,580 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి పెంచాలని నిర్ణయించింది.

## మాట ఇస్తే నిలుపుకోవడం కాంగ్రెస్ పార్టీకే సాధ్యం

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** ప్రజలకు మాట ఇస్తే నిలుపుకోవడం కాంగ్రెస్‌కే సాధ్యమని బిసి రిజర్వేషన్లతో మరోసారి నిరూపితమైందని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. బిసి రిజర్వేషన్లు కాంగ్రెస్ పార్టీ కమిటెమెంట్ అన్నారు. బిజెపి, బిఆర్ఎస్ ఒకటే అన్నారు. కలిసే సంసారం చేస్తున్నారని అన్నారు. బిజెపి బిఆర్ఎస్ ఒక్కటై కుట్ర పూరితంగా కాంగ్రెస్‌పై విష ప్రచారం చేస్తున్నారని అన్నారు. తెలంగాణకి బిఆర్ఎస్ చేసిన బాకీకి (అప్పులకు)మేము వడ్డీలు కడుతున్నామని అన్నారు. బకాయిల గురించి మాట్లాడితే మొదటి ముద్దాయి కెసిఆర్ అన్నారు. బిఆర్ఎస్ బకాయి కార్డు ప్రచారంపై దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టు ఉందని జనాలు




నవ్వుకుంటున్నారని అన్నారు. బిఆర్ఎస్ బాకాయి కార్డు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుప్పల రాష్ట్రంగా మార్చిన మీకు బకాయి అనే పదం కూడా ఎత్తేఅర్హత లేదన్నారు. నిరుద్యోగుల కలలు సాకారం చేస్తే బాకీ పడినట్లా? రైతు భరోసా ఇస్తే బాకీ పడినట్లా? అన్నారు. ప్రతి ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం అని చెప్పి ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారు? బిఆర్ఎస్ పాలనలో ఎంతమందికి దళిత బంధు ఇచ్చారు? రూ.500 సబ్సిడీతో గ్యాస్ సిలిండర్ ఇవ్వడం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వడం బకాయి పడ్డట్టా? ఆరోగ్య శ్రీ రూ.10 లక్షలకు పెంచడం బకాయి పడ్డట్టా? ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేయడం, రైతు భరోసా ఇవ్వడం, వరికి బోనస్ ఇవ్వడం బకాయి పడ్డట్టా? రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం బకాయి పడ్డట్టా? ఇచ్చిన హామీలను నెరవేర్చడం బకాయి పడడమా? బిఆర్ఎస్ ప్రచారం ఎంతో లోపాభూయిష్టంగా, హాస్యాస్పదంగా ఉందని, కాళేశ్వరం, ఫార్ములా కార్‌రేస్, పలు ప్రభుత్వ పథకాల్లో స్కాంలు చేసిన బిఆర్ఎస్ బండారం ఒక్కొక్కటి బయట పడుతుండడంతో దిక్కుతోచక బకాయి కార్డు పేరుతో మోసపూరిత ప్రచారం చేస్తుందన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలన నవాబు పాలనతెలంగాణను సర్వనాశనం చేసింది మీరు అన్నారు. తెలంగాణలో 40 లక్షల మందికి రేషన్ కార్డులు బాకీ పడింది మీరు కదా?అన్నారు. ఎరువుల పేరిట కేంద్రంలోని బిజెపి మోసం చేస్తుందని, జిఎస్‌టి పేరిట వేల కోట్లు కేంద్రంలోని బిజెపి దోచుకుందన్నారు. పదేళ్ల పాలనలో బిఆర్ఎస్ చేసిన రుణ మాఫీ ఎంత?అన్నారు. ప్రజల మనసులో కాంగ్రెస్ పార్టీ ఉందని, స్థానిక సంస్థలో ఎన్నికల్లో 80 శాతం పైగా సీట్లు గెలుచుకుంటామన్నారు. జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి తీరుతుందని, బిసి రిజర్వేషన్లపై ప్రధాని మోడీని అడిగే దమ్ము ఈటల, బండి సంజయ్, అరవింద్‌కి లేదా? అన్నారు. బిసి రిజర్వేషన్ల గురించి అర్హత బిజెపి నేతలకు లేదని, పార్టీలకు అతీతంగా బిసి రిజర్వేషన్లకు మద్దతు ఇవ్వాలన్నారు. బిసి రిజర్వేషన్లపై కోర్టు తీర్పు సానుకూలంగా వస్తుందని ఆశిస్తున్నామని, జిఎస్‌టి ద్వారా 8 ఏళ్ల ప్రజల సొమ్ము కేంద్రంలోని బిజెపి దోచుకుందన్నారు. హైడ్రా రావాల్సిన అవసరంపై అనేక సార్లు ప్రస్తావించానని, హైడ్రాను అభినందిస్తున్నానన్నారు.

## విదేశీ ఎంబసీలకు బాంబు బెదరింపులు!

**చెన్నై, సెప్టెంబరు 30:** తమిళనాడు రాజధాని చెన్నైలోని 10 విదేశీ రాయబార కార్యాలయాలకు, డీజీపీ ఆఫీస్‌కు బాంబు బెదిరింపు మెయిల్స్ రావడం కలకలం రేపింది. మంగళవారం చెన్నైలోని తేనాంపేట లోని అమెరికా




కాన్సులేట్ సహా సింగపూర్, కొరియా, స్వీడన్, ఆస్ట్రేలియా, శ్రీలంక, బ్రిటన్ తదితర ఎంబసీలకు ఈ మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. కరూర్ తొక్కిసలాట ఘటన, డీఎంకే మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ పేరును ప్రస్తావిస్తూ వేర్వేరు ఈమెయిల్ ఐడీలతో డీజీపీ కార్యాలయానికి ఈ బెదిరింపులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. విదేశీ ఎంబసీలకు బాంబు బెదిరింపు మెయిల్స్ రావడంతో అప్రమత్తమైన భద్రతాబలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. అన్ని కాన్సులేట్‌లలో బాంబు స్క్వాడ్ బృందాలు, డాగ్ స్క్వాడ్‌ల సాయంతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెన్నై పోలీసులు చెప్పారు. కాన్సులేట్‌ల చుట్టూ భద్రతను పెంచినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ఇదిలావుంటే ముంబై నుంచి ఢిల్లీ వెళ్తున్న ఇండిగో విమానానికి కూడా మంగళవారం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. 200ల మంది ప్రయాణికులు ఉన్న విమానం గాల్లో ఉండగా బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో అప్రమత్తమైన ఎయిర్‌లైన్స్ అధికారులు ఢిల్లీ విమానాశ్రయ అధికారులకు సమాచారమిచ్చారు. పైలట్లు విమానాన్ని సురక్షితంగా ఢిల్లీలో ల్యాండ్ చేసిన అనంతరం తనిఖీలు చేపట్టగా ఎలాంటి బాంబు లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## విధులకు దూరం అవుతున్న లక్షమంది ఉద్యోగులు

### ట్రంప్ పాలనతో సంక్షోభం అంచున అమెరికా

**వాషింగ్టన్, సెప్టెంబరు 30:** అమెరికా ప్రభుత్వ యంత్రాంగం కనీవినీ ఎరుగని సంక్షోభం ఎదుర్కొంటోంది. డొనాల్డ్ ట్రంప్ పాలనలో తీసుకున్న సంచలన నిర్ణయాల ఫలితంగా 30వ తేదీ నుంచి ఏకంగా లక్ష మంది ఫెడరల్ ఉద్యోగులు తమ విధులకు దూరమవుతున్నారు. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద సామూహిక నిష్క్రమణగా నిపుణులు దీనిని అభివర్ణిస్తున్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఈ సంఖ్య 3 లక్షలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఇది రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఒకే ఏడాదిలో ఇంత పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు వైదొలగడం ఇదే మొదటిసారి. ట్రంప్ ప్రభుత్వం 'డిఫర్డ్ రెసిగ్నేషన్ ప్రోగ్రామ్' (డీఆర్‌పీ) పేరుతో ఒక ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని ప్రకారం, ఉద్యోగులు స్వచ్ఛందంగా రాజీనామా చేస్తే సెప్టెంబర్ 30 వరకు ఎలాంటి పని చేయకుండానే పూర్తి జీతభత్యాలు పొందే అవకాశం కల్పించింది. దీనికి తోడు కొత్త నియామకాలపై నిషేధం, అనవసరమైన ఉద్యోగుల తొలగింపు వంటి చర్యలు చేపట్టడంతో చాలా మంది ఉద్యోగులు ఒత్తిడితో రాజీనామా బాట పట్టారు. ప్రభుత్వ సామర్థ్యాన్ని పెంచేందుకే ఈ సంస్కరణలు అని ట్రంప్ సర్కార్ సమర్థించుకుంటుండగా, ఇది ప్రభుత్వ వ్యవస్థను నిర్వీర్యం చేయడమేనని విమర్శకులు ఆరోపిస్తున్నారు. ఈ విధానాలను సవాలు చేస్తూ ఉద్యోగ సంఘాలు కోర్టును ఆశ్రయించినా, సుప్రీంకోర్టు 81 తేడాతో ప్రభుత్వ చర్యలను సమర్థించడం గమనార్హం. ఈ సంస్కరణల అమలు కోసం ఎలాన్ మస్క్ నేతృత్వంలో 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ' (డాగ్) అనే కొత్త విభాగాన్ని కూడా ఏర్పాటు చేశారు. ప్రజలపై తీవ్ర ప్రభావం ఈ సామూహిక రాజీనామాల ప్రభావం ఇప్పటికే ప్రభుత్వ సేవలపై స్పష్టంగా కనిపిస్తోంది. పన్నుల వసూలు సంస్థ ఐఆర్ఎస్‌లో 25 శాతం సిబ్బంది తగ్గడంతో వచ్చే ఏడాది పన్నుల సీజన్‌లో తీవ్ర జాప్యం తప్పదని ఆందోళన వ్యక్తమవుతోంది. పర్యావరణ పరిరక్షణ ఏజెన్సీ 'ఈపీఏ', ఫెడరల్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ 'ఫెమా' వంటి అత్యవసర సేవల విభాగాల్లో సిబ్బంది కొరతతో సంక్షోభ



సమయాల్లో స్పందించడం కష్టంగా మారింది. ఆరోగ్యం, వ్యవసాయం, విదేశాంగ శాఖల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ పరిణామాలు కేవలం ప్రభుత్వ సేవలకే పరిమితం కాలేదు. వాషింగ్టన్ డీసీ వంటి నగరాల్లో స్థానిక ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. మరోవైపు, నేటితో ప్రభుత్వానికి నిధుల గడువు ముగియనుండటంతో 'ప్రభుత్వ షట్‌డౌన్' ముప్పు కూడా పొంచి ఉంది. అదే జరిగితే, మరో 7 లక్షల మంది ఉద్యోగులను తాత్కాలికంగా విధులకు దూరం పెట్టాల్సి వస్తుంది. ఇది ఇప్పటికే ఉన్న సిబ్బంది సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

## ప్రకాశం వద్ద తీవ్రస్థాయికి వరద

### నీట మునుగుతున్న ఇళ్లు, బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలింపు

### నది ఘాట్లలో స్నానాలపై నిషేధం



ప్రకాశం బ్యారేజీ వద్ద వరద దృశ్యం

**విజయవాడ, సెప్టెంబరు 30, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ వరద ఉధృతి తీవ్రస్థాయికి చేరుతుంది. ఆనకట్ట వద్దకు 6,86,074 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంది. ఇక్కడ రెండో నెంబరు ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. బ్యారేజీకి చెందిన 69 గేట్లను ఎత్తి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఏడు లక్షల క్యూసెక్కుల వరద వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో దసరా శరన్నవరాత్రులకు వచ్చే యాత్రికులు నది ఘాట్లలో స్నానాలు చేయరాదని, జల్లు స్నానం మాత్రమే ఆచరించాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ స్నానాల కోసం నదిలోకి దిగకూడదని హెచ్చరించింది.

**పునరావాస శిబిరాలకు తరలింపు**

ఏకకాలంలో నాగార్జున సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తుండడంతో గుంటూరు జిల్లా తాడేపల్లి, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లోని కృష్ణా నదీ పరివాహక ప్రాంతం లోని పలుగ్రామాల్లోకి వరద నీరు చేరింది. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం రామాపురం వద్ద వరద నీరు భారీగా రావడంతో ఆ గ్రామస్తులను పునరావాస శిబిరాలకు అధికారులు తరలించారు.

**లంక గ్రామాలకు ముప్పు**

వరద మరింత పెరిగితే గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని దాదాపు 50 లంక గ్రామాలకు ముంపు సమస్య ఏర్పడనుంది. నాగార్జునసాగర్, పులిచింతల జలాశయాలు నిండుకుండను తలపిస్తున్నాయి.

**ఒకటిన మరో అల్పపీడనం**

అక్టోబరు ఒకటిన బంగాళాఖాతంలో మరో అల్ప పీడనం ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. సోమవారం ఉత్తరాంధ్రతోపాటు నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కృష్ణా, గోదావరి పరీ వాహక ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం రెండు ఎన్‌డిఆర్ఎఫ్, నాలుగు ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేశారు.

పర్యాటకశాఖ బోట్లను తాళ్లతో కట్టేశారు. కృష్ణా నది పరివాహక లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. గురటూరు జిల్లాలోని తుళ్లూరు, తాడేపల్లి, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లోని నదీ పరివాహక ప్రాంతంలోని పలు గ్రామాలకు వరద నీరు చేరింది. తుళ్లూరు, కొల్లిపర మండలాల్లోని లంక గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. కొల్లిపర, దుగ్గిరాల తుళ్లూరు, తాడేపల్లి మండలాల్లో 12 వేల ఎకరాల్లో వరి పంట నీటమునిగింది. కంద, అరటి, పసుపు, కూరగాయల తోటలు నీట మునిగాయి. దాదాపు నాలుగు వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు నీట మునిగినట్టు అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లా దాచేపల్లి, అమరావతి, అచ్చంపేట, మాచవరం మండలాల్లో పది వేల ఎకరాల్లో పత్తి పంట దెబ్బతింది. కృష్ణాతీరంలోని ఎనిమిది మండలాల్లో పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కృష్ణాలో 1634 మంది రైతులకు సంబంధించిన 2174 ఎకరాలు ఉద్యానవన పంటలు నీట మునిగాయి. కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లోని అరటి, కంద, బొప్పాయి, తమలపాకులు, కూరగా యలు, మల్బరీ తదితర పంటలు ముంపుకు గురయ్యాయి. ఉత్తర కోస్తా బంగాళాఖాతం అనుకుని ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని.. దీని ప్రభావంతో ఆ ప్రాంతంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని వాతావరణం కేంద్రం మంగళవారం వెల్లడించింది. రానున్న నాలుగు రోజులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని వివరించింది. ఇక ఉత్తర అండమాన్ పరిసర ప్రాంతాలలో మంగళవారం అంటే.. ఈ రోజు ఉపరితల ఆవర్తనం ఏర్పడుతుందని.. అది రేపు అంటే.. అక్టోబర్ 1వ తేదీ నాటికి మధ్య బంగాళఖాతంలో అల్పపీడనంగా మారుతుందని స్పష్టం చేసింది. 2వ తేదీ నాటికి పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించి.. అది వాయుగుండంగా మారుతుందని చెప్పింది. ఇది 3వ తేదీ నాటి దక్షిణ ఒడిశా, ఉత్తర కోస్తా జిల్లాల మధ్య తీరం దాటే ఆవకాశం ఉందని వివరించింది. ఈ నేపథ్యంలో అల్లూరి, పార్వతీపురం, కాకినాడ, యానాం, ఉభయ గోదావరి జిల్లాలతోపాటు నెల్లూరు, తిరుపతి జిల్లాలలో రానున్న 24 గంటల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. మరోవైపు.. వర్షాల నేపథ్యంలో రాష్ట్ర విపత్తు నివారణ సంస్థ అప్రమత్తమైంది. అందులోభాగంగా జిల్లా కలెక్టర్లకు కీలక సూచన చేసింది. ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. పలు చోట్ల పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. బాపట్ల, ప్రకాశం జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. చెట్ల కింద నిలబడరాదన్నారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## పత్తి ధరలు పతనం

### మండీల్లో రూ.1,500 కోత

### ప్రైవేటు వ్యాపారుల దోపిడీ

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** తెలంగాణలో పత్తి మార్కెటింగ్ సీజన్ సమీపిస్తున్న తరుణంలో మండి ధరలు ఎమ్మెస్పీ కంటే తక్కువగా పడిపోవడంతో పత్తి రైతులు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) కొనుగోలు కేంద్రాలపైనే ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుత 2025-26 పత్తి మార్కెటింగ్ సీజన్ అక్టోబర్ మొదటి వారంలో ప్రారంభం కానుండటంతో, మండి ధరలు కనీస మద్దతు ధర కంటే చాలా తక్కువగా పడిపోవడంతో, తెలంగాణ రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో ప్రధానంగా వరంగల్, ఆదిలాబాద్ మరియు నల్గొండ వంటి జిల్లాల్లోని మండీలకు, కనీస మద్దతు ధరలకు మధ్య వ్యత్యాసం నెలకొంది. ఇప్పటికే కొనుగోళ్లు ప్రారంభించిన ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరలతో రైతులను దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి తగినట్లుగా ప్రపంచ వ్యాప్తంగా పత్తి ఉత్పత్తి 1.3 శాతం తగ్గి 117.2 మిలియన్ బేళ్లకు చేరుకోవడం, బ్రెజిల్ నుండి అధిక సరఫరా కారణంగా అంతర్జాతీయ ధరలు ఉత్పత్తి ఖర్చుల కంటే తక్కువగా ఉండటంతో తెలంగాణ మండి ధరలు మరింత దిగజారాయి. ఫలితంగా ఆయా జిల్లాల్లో దాదాపు 6 లక్షల మంది రైతులు భారీగా నష్టపోతున్నట్లు ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలోని జమ్మికుంట, భైంసా వంటి మార్కెట్లలో పత్తి మండి ధరలు క్వింటాలుకు రూ.6,333 నుండి రూ.6,805 కు మధ్య ఉన్నాయి, మీడియం స్టేపుల్ పత్తికి కనీస మద్దతు ధర రూ.7,710 కంటే రూ.1,435 వరకు తక్కువగా ఉందని రైతులు చెబుతున్నారు. ఇక లాంగ్ స్టేపుల్ రకాలు అధ్వాన్నంగా ఉన్నాయి. ఎమ్మెస్పీ రూ.8,110గా నిర్ణయించబడినా, మండి ధరలు గణనీయంగా తక్కువగా ఉన్నాయి. కాగా ఇటీవల జరిగిన సమావేశంలో రాష్ట్ర అధికారులు మరియు సిసిఐ ప్రతినిధులు ఎమ్మెస్పీ కంటే రూ.1,099 తేడాతో మండీల్లో కొనుగోలు చేస్తున్న విషయాన్ని గుర్తించారు. ఈ నేపథ్యంలో రైతులను అమ్మకాల ఇబ్బందులు, వ్యాపారుల దోపిడీ నుండి రక్షి ంచడానికి త్వరితగతిన పత్తి సేకరణ చేయాలని కోరారు. ఇక ఈ సీజన్‌లో తెలంగాణ వ్యాప్తంగా 45.85 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది.

తద్వారా 53 నుండి 55 లక్షల బేళ్ల చొప్పున పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేస్తోంది. అనుకూలమైన పరిస్థితులలో అయితే ఇది 70 లక్షల బేళ్లను తాకే అవకాశం ఉందని భావిస్తోంది. ఈ ఉత్పత్తిలో 80-90 శాతం సిసిఐ కేంద్రాలకు చేరే అవకాశం ఉందని లెక్కకడుతోంది. గత సీజన్‌లో తెలంగాణలో 508 కేంద్రాలలో 40 లక్షల బేళ్ల మేర 210.20 క్వింటాళ్ల పత్తిని కాటన్ కార్పొరేషన్ కొనుగోలు చేసి జాతీయ సేకరణలో అగ్రస్థానంలో ఉంది. మరోపక్క స్లాట్ బుకింగ్‌లు, ఆధార్‌లింక్డ్ చెల్లింపులతో పాటు, స్థానిక కేంద్రాలలో పర్యవేక్షణ కమిటీల కోసం కేంద్రం కపాస్ కిసాన్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఇది న్యాయమైన నాణ్యత తనిఖీలు మరియు ఖచ్చితమైన బరువులను నిర్ధారించడానికి సహాయపడుతుంది. ఇదే సమయంలో దీనివల్ల చెల్లింపుల్లో జాప్యం, నాణ్యత వంటి వాటితో తిరస్కరించే అవాకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# వచ్చే ఫిబ్రవరికి ముందే హెచ్-1బి వీసాల్లో మార్పులు

## అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్




**వాషింగ్టన్, సెప్టెంబరు 30:** హెచ్-1బి వీసాల విషయంలో అమెరికా కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇటీవల వాటి ఫీజును 215 డాలర్ల నుంచి లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ వ్యాఖ్యలు చేశారు. 2026 ఫిబ్రవరికి ముందే ఆ వీసాల జారీ ప్రక్రియలో గణనీయమైన మార్పులు ఉంటాయని వెల్లడించారు. పాత విధానంలో లోపాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఇటీవల ట్రంప్ ప్రకటించిన వీసా ఫీజు ప్రపంచవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. హెచ్-1బి వీసాపై విధించిన లక్ష డాలర్ల రుసుము వార్షిక ఫీజు కాదని, దరఖాస్తు చేసుకొనే సమయంలో కట్టాల్సిన వన్‌టైమ్ ఫీజు మాత్రమేనని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ స్పష్టత ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ వన్‌టైమ్ లక్ష డాలర్ల రుసుము ఇకపై కొత్తగా హెచ్-1బి వీసాకు దరఖాస్తు చేసుకునే వారికే అమలు చేస్తామని, ప్రస్తుత వీసాదారులకు, రెన్యూవల్‌కు వర్తించదని చెప్పారు. దీనిని ఉద్దేశించి వాణిజ్య మంత్రి మాట్లాడారు. '2026 నుంచి ఈ ప్రక్రియ అంతా అమలులోకి వస్తుంది. నా అంచనా ప్రకారం ఇప్పుడు.. 2026లో గణనీయమైన మార్పులు ఉంటాయి' అని పేర్కొన్నారు. లక్ష డాలర్ల ఫీజు కారణంగా రానున్న రోజుల్లో ఆ వీసాపై వచ్చే వారి సంఖ్యలో మార్పు ఉంటుందని అంచనా వేశారు. లాటరీ విధానంలో కూడా మార్పులు ఉండొచ్చనేలా వ్యాఖ్యలు చేశారు. ఒక దేశం లాటరీ ద్వారా నైపుణ్యం కలిగిన కార్మికులను తెచ్చుకోవడం ఏమిటని ప్రశ్నించారు. పాత వీసా విధానంలో లోపాలున్నాయని, ఫలితంగా అనుభవం లేని టెక్ కన్సల్టెన్సీలు దేశంలో కుటుంబాలతో సహా ప్రవేశించాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. నిపుణులైన కార్మికులు మాత్రమే దేశంలోకి వచ్చేలా అమెరికా ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోందని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. హెచ్-1బి కోసం ప్రస్తుతం ఉన్న లాటరీ విధానాన్ని మార్చాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ భావిస్తోంది. అధిక నైపుణ్యం కలిగిన విదేశీయులను మాత్రమే అనుమతించడం, అమెరికన్లకు ప్రాధాన్యం కల్పించే ఉద్దేశంతో వీటిని రూపొందించినట్లు తెలుస్తోంది. ఉద్యోగి వేతన స్థాయిని అనుసరించి రిజిస్ట్రేషన్‌లో ప్రాధాన్యం కల్పించడం, వేతన వర్గీకరణ (ఒకటి నుంచి నాలుగు) ఆధారంగా దరఖాస్తులను విభజించడం వంటి చర్యలు తీసుకోనున్నారు.

వీసాలపై అమెరికా కాంగ్రెస్‌లో మరో బిల్లు..

హెచ్-1బి, ఎల్-1 వీసాలను సంస్కరించాలని, విదేశీ ఉద్యోగుల నియామకం విషయంలో కఠిన నిబంధనలు ఉండాలని పలువురు యుఎస్ సెనెటర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు సెనెటర్లు చక్‌గ్రాస్లీ, డిక్ డర్బిన్ బిల్లును ప్రవేశపెట్టారు. కార్పొరేట్ దుర్వినియోగాన్ని అరకట్టి అమెరికా ఉద్యోగులను రక్షించడమే లక్ష్యమని ఈ సందర్భంగా వారు వెల్లడించారు.

# అమెరికా ఆనాడు యుద్ధం వద్దని ఒత్తిడి తెచ్చింది..

## కేంద్ర మాజీ హోంమంత్రి చిదంబరం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 26/11 ముంబై ఉగ్రదాడులపై కేంద్ర హోం శాఖ మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కీలక సమాచారాన్ని వెల్లడించారు. ముంబై దాడుల అనంతరం తాను కేంద్ర హోం మంత్రిగా బాధ్యతలు తీసుకోవడం నుంచి పాక్‌పై ప్రతిదాడికి అడ్డుపడిన పరిస్థితులను ఆయన ఒక ఇంటర్వ్యూలో వివరించారు. ముంబై ఉగ్రదాడుల అనంతరం పాకిస్థాన్‌పై సైనిక చర్యకు ఆలోచించినప్పటికీ అంతర్జాతీయ ఒత్తిడులు, ముఖ్యంగా అమెరికా నుంచి వచ్చిన ఒత్తిళ్ల కారణంగా ఆ నిర్ణయం నిలిచిపోయిందని చెప్పారు. అప్పట్లో పాకిస్థాన్‌పై దాడి చేయాలని తన మనసులో ఉందని, అయితే సైనిక చర్యకు దిగరాదని యూపీఏ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ముంబై ఉగ్రదాడుల్లో 175 మంది ప్రాణాలు కోల్పోయిన కొద్ది రోజులకే కేంద్ర హోం మంత్రిగా పి.చిదంబరం బాధ్యతలు చేపట్టారు. అప్పుడు ప్రపంచం అంతా యుద్ధం ప్రారంభించవద్దని చెప్పడానికి ఢిల్లీకి వస్తోందని, నాటి అమెరికా విదేశాంగ కార్యదర్శి కండోలీజా రైస్ ప్రత్యేకంగా తనను, ప్రధానిని కలిసేందుకు ఢిల్లీకి వచ్చారని చెప్పారు. యుద్ధంపై ముందుకు వెళ్లొద్దని తమను కోరారని వెల్లడించారు. పాకిస్థాన్‌కు బదులు చెప్పాలని తన మనసులో ఉందని, దీనిపై ప్రధానమంత్రి, ఇతర ముఖ్య వ్యక్తులతో చర్చించానని చెప్పారు. అయితే భౌతికంగా కాకుండా దౌత్యమార్గాలను ఉపయోగించాలని చివరికి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. చిదంబరం వ్యాఖ్యలపై బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా స్పందించారు. ముంబై దాడుల అనంతరం హోం మంత్రి భాధ్యతలు తీసుకునేందుకు తొలుత చిదంబరం నిరాకరించారని, పాకిస్థాన్‌పై మిలటరీ చర్యను ఆయన కోరుకున్నప్పటికీ ఆయనపై ఇతరులు విజయం సాధించారని అన్నారు. పాక్‌పై ప్రతీకార చర్యలను కాంగ్రెస్ సీనియర్ నేత సోనియాగాంధీ అడ్డుకున్నారా, ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అడ్డుకున్నారా అని ఆయన ప్రశ్నించారు. యూపీఏ ప్రభుత్వంపై కండోలీజా రైస్ ప్రభావం ఉన్నట్టు కనిపిస్తోందన్నారు. 2008 నవంబర్ 8న ఉగ్రవాద సంస్థ లష్కరే తొయిబాకు చెందిన 10 మంది పాక్ ఉగ్రవాదులు ముంబైలోని పలు కీలక ప్రాంతాల్లో ఒకేసారిదాడులకు దిగారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ రైల్వే స్టేషన్, ఒబెరాయ్ ట్రిడెంట్, తాజ్ మహల్ ప్యాలెస్ అండ్ టవర్ హోటల్, కామా ఆసుపత్రి, నారిమన్ హౌస్‌లపై విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో 175 మంది ప్రాణాలు కోల్పోగా, 308 మంది గాయపడ్డారు. లష్కరే ఉగ్రవాది అజ్మల్ కసబ్ ఒక్కరే ముంబై పోలీసులకు పట్టుబడగా, 2012లో అతన్ని ఉరితీశారు.

# భారత్ జిసిసిలవైపు అమెరికా కంపెనీల ఫోకస్

## వర్క్‌ఫ్రం ఇండియా అంటున్న టెక్ దిగ్గజాలు

## ట్రంప్ హెచ్1బి వీసా ఫీజుల భారం

**బెంగళూరు,సెప్టెంబరు 30:** అమెరికా అధ్యక్షుడు వీసా ఫీజులు ఒక్కసారిగా లక్ష డాలర్లకు పెంచడంతో ఇపుడు అమెరికా సంస్థలన్నీ కూడా భారత్‌కేంద్రంగా పనులను షిఫ్ట్‌చేసే ఆలోచనలో పడ్డాయి. అమెరికా టెక్ సంస్థలు ఇతరబహుళ జాతి సంస్థలన్నీ కూడా భారత్‌లో అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాలు (జిసిసి)లు భారత్ కేంద్రంగా ఉండటంతో వీసా భారం అధిగమించేందుకు క్లిష్టమైన ప్రాజెక్టులన్నింటినీ భారత్‌కు తరలించడమే మేలని భావిస్తున్నాయి. ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థ కలిగిన భారత్‌లో 1700కిపైగా జిసిసిలున్నాయి. అంటే ప్రపంచం మొత్తం ఉన్న సంస్థల్లో 50శాతానికిపైగా భారత్ లోనే ఉన్నాయి. లగ్జరీ కార్ డిజైన్లు, డ్యాష్ బోర్డులనుంచి ఔషధాల అన్వేషణవరకూ వీటిల్లోనే జరుగుతోంది. కృత్రిమమేధ, వీసాలపై ఆంక్షలు పెరుగుతుండటంతో అమెరికా సంస్థలు తమ కొలువుల వ్యూహాలను మారుస్తున్నాయి. భారత్‌లోని జిసిసిలతో కలిసి పనులుచేసుకోవాలని చూస్తున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలున్న జిసిసిలతో తమ పనులు చక్కబెట్టుకోవచ్చనిచూస్తున్నాయి. వీసా పెంపుభారంతో ఇపుడు అమెరికాలోని అనేక సంస్థలు తమ వర్క్‌ఫోర్స్ అవసరాలను పునఃసమీక్ష చేస్తున్నాయి. ఐదువేల డాలర్లకు మించిలేని వీసా ఫీజులు ఒకేసారి లక్షడాలర్లకు పెంచడంవల్ల నైపుణ్యం ఉన్న వర్కర్లు లభించడం కష్టంగా మారుతోంది. హెచ్‌వన్‌బి, ఎల్‌వన్ వర్క్ వీసాలకు సంబంధించి కఠిన ఆంక్షలతో కూడిన వీసా బిల్లును సెనేట్‌లో ప్రవేశపెట్టారు. ఈ బిల్లులో అనేక లొసుగులు ఉన్నాయని, అవి యాజమాన్యాలకు మేలుచేస్తున్నాయని, అమెరికన్లకు నష్టం కలుగుతోందని చెపుతున్నారు. వీటిన్నింటినీ గమనిస్తున్న అమెరికా సంస్థలు హైఎండ్ పనులు అన్నీ ఎఐతో ముడిపెడుతున్నారు. ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ, అనలిటిక్స్ వంటి వాటిని ఇండియా జిసిసిలకు తరలిస్తున్నారు.

# ప్రతీకారం నాపై తీర్చుకోండి..పార్టీ నేతలపై కాదు..

## ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ ఎదుర్కోలేదు..

## త్వరలోనే బాధితులను పరామర్శిస్తా: టివికె చీఫ్ విజయ్



**చెన్నై,సెప్టెంబరు 30:** కరూర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనతో తన హృదయం పూర్తిగా బాధతో నిండిపోయిందని టీవీకే అధినేత, నటుడు విజయ్ అన్నారు. తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోలేదన్నారు. తన మనసు పూర్తిగా బాధతో నిండిపోయినట్లు ఆయన చెప్పారు. కరూర్ తొక్కిసలాట ఘటన జరిగిన రెండురోజుల తర్వాత టీవీకే అధినేత, నటుడు విజయ్ తొలిసారి స్పందించారు. ఈ మేరకు మంగళవారం ఓ వీడియో విడుదల చేశారు. ఈ ఘటనలో తమ తప్పిదమేమీ లేకపోయినా డీఎంకే సర్కార్ తమపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిందని ఆయన విమర్శించారు. స్టాలిన్ ప్రభుత్వానికి ప్రతీకార వాంఛ ఉంటే తనను ఏమైనా చేసుకోవచ్చన్నారు. తమ పార్టీ నేతలను టార్గెట్ చేయొద్దని ప్రభుత్వాన్ని కోరారు. కరూర్ జిల్లాకు చెందిన టీవీకే నేతలపై పోలీసులు కేసులు పెట్టిన నేపథ్యంలో విజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. కరూర్ ఘటన నన్ను తీవ్రంగా కలిచివేసింది. నాపై అమిత ప్రేమతో ప్రజలు ర్యాలీకి వచ్చారు. తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. త్వరలోనే కరూర్ వెళ్లి బాధితులను పరామర్శిస్తాను. వాస్తవానికి మేము ఏ తప్పు చేయకపోయినా, మాపై కేసులు పెట్టారు. నిజం త్వరలోనే బయటపడుతుందన్నారు. సీఎం స్టాలిన్ మాపై ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తున్నారా కావాలంటే నాపై ప్రతీకారం తీర్చుకోవచ్చు. నాపై కోపం, మా నాయకులపై చూపించవద్దు. ఈ ఘటనకు బాధ్యుడిగా పేర్కొంటూ టీవీకే పార్టీ కరూర్ పశ్చిమ జిల్లా మథియాళన్, కార్యకర్త పౌన్‌రాజ్, యూట్యూబర్ ఫెలిక్స్ జెరాల్డ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిపై హత్యాయత్నం, ప్రజా భద్రతకు ముప్పు కలిగించడం సహా పలు సెక్షన్ల కింద అభియోగాలు మోపారు. మరోవైపు విజయ్ ఉద్దేశపూర్వక రాజకీయ బలప్రదర్శన వల్లే ఈ ఘటన జరిగిందని పోలీసులు ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్నారు.

# బీహార్‌లో 7.42 కోట్ల మంది ఓటర్లు




## తుది ఓటరు జాబితా విడుదల చేసిన ఎన్నికల కమిషన్

## ముసాయిదా కంటే 18 లక్షల మంది ఓటర్లు అధికం

## అక్టోబరు 6-7 తేదీలో ఎన్నికల షెడ్యూల్?

## నవంబర్ 5-15 మధ్య మూడు దశల్లో పోలింగ్?

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడుతున్న వేళ బీహార్‌లో ఎంతో ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న తరుణంలో తుది ఓటరు జాబితా విడుదలైంది. దీంతో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఎస్‌ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ ముగిసింది. మంగళవారం విడుదలైన తుది జాబితా ప్రకారం, బీహార్‌లో 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఆగస్టు 1న విడుదల చేసిన ముసాయిదా జాబితా (7.24 కోట్లు)తో పోలిస్తే ఓటర్ల సంఖ్య 18 లక్షలు పెరిగింది. అదే జూన్ 24నాటికి ఎస్‌ఐఆర్ ప్రకటించిన నాటికి బీహార్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 7.89 కోట్లు. ముసాయిదా జాబితాతో పోలిస్తే వాస్తవంగా 21.53 లక్షలు అదనంగా ఉన్నారని అధికారులు తెలిపారు. కానీ 3.66 లక్షల మంది ఓటర్లు తమ పేర్లు నమోదు ఫారాలను నింపారు కానీ, గుర్తింపు పత్రాలు సమర్పించలేదు. దీంతో వారి పేర్లను తొలగించారు. దీంతో ముసాయిదా జాబితా కంటే 18 లక్షల మంది ఓటర్లు పెరిగారు. జూన్ 24కి ముందు బీహార్‌లో మొత్తం 7.89 కోట్ల మంది ఓటర్లు. ఆగస్టు 1న ఈసీ విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో 7.24 కోట్ల మంది ఓటర్లున్నారు. అంటే దాదాపు 65 మంది లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించింది. ఇక అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ అక్టోబర్ 6-7 తేదీల్లో విడుదలయ్యేఅవకాశముందని ఈసీ వర్గాలు తెలిపాయి. 3-4 తేదీల్లో కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు బీహార్‌లో పర్యటించనున్నారు. ఆ తర్వాత షెడ్యూల్ విడుదల కానుంది. నవంబర్ 5 నుంచి 15 తేదీల మధ్య మూడు దశల్లో ఎన్నికల ప్రక్రియ ఉంటుందని అధికార వర్గాల సమాచారం. ప్రస్తుత బీహార్ అసెంబ్లీ కాలపరిమితి నవంబర్ 22న ముగియనుంది. అంటే, అంతకు ముందే ఎన్నికల ప్రక్రియ ముగించాల్సి ఉన్నందున అధికారుల ఆ మేరకు ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

# ఇడి విచారణకు ఊర్వశి రౌతేలా





**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో సినీనటి ఊర్వశి రౌతేలా ఈడీ విచారణకు హాజరయ్యారు. మంగళవారం ఢిల్లీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రధాన కార్యాలయానికి వెళ్లిన ఊర్వశి రౌతేలా, విచారణ అధికారుల ముందు హాజరై, పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్ చేసే సమయంలో భారత గేమింగ్, ఆర్థిక చట్టాల గురించి తెలియదా? ప్రమోషన్ చేయడం వల్ల పారితోషకం ఎంత తీసుకున్నారు? ఏ రూపంలో ఎంతెంత అందుకున్నారు? అంటూ సినీ నటిపై ఈడీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. అధికారులు అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానమిచ్చానని, విచారణ అనంతరం ఊర్వశి రౌతేలా మీడియాతో మాటాడుతూ వెల్లడించారు. ఆర్థికపరమైన అంశాలతోపాటు ప్రమోషన్స్‌కు సంబంధించిన అంశాలపైనే ప్రశ్నించారని సినీనటి పేర్కొన్నారు.



# జీవాయుధ ముప్పును సైతం ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి

## సిడిఎస్ అనిల్‌చౌహాన్ పిలుపు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** మానవులు సృష్టించిన జీవ ఆయుధాల వల్ల భవిష్యత్తులో సహజంగా లేదా ప్రమాదవశాత్తు ముప్పు పెరగొచ్చని భారతదేశ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్ ) జనరల్ అనిల్ చౌహాన్ హెచ్చరించారు. అణ్వాయుధాల నుంచి వెలువడే రేడియో కాలుష్యంతోనూ గండం పొంచి ఉండొచ్చన్నారు. కరోనా (కొవిడ్) మహమ్మారిని ఎదుర్కొనే క్రమంలో యావత్ ప్రపంచం అనేక సవాళ్లను ఎదుర్కొందని ఆయన గుర్తు చేశారు. ఫ్యూచర్‌లో జీవ ఆయుధాల ముప్పును, అణ్వాయుధాల రేడియో కాలుష్యాన్ని ఎదుర్కొనేందుకు భారత సైనిక దళాలు రక్షణపరమైన సన్నద్ధతతో ఉండాలని పిలుపునిచ్చారు. మిలిటరీ నర్సింగ్ సర్వీస్ శత వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఢిల్లీలోని మానిక్‌షా సెంటర్‌లో నిర్వహించిన శాస్త్రీయ చర్చా కార్యక్రమంలో అనిల్ చౌహాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. అణ్వస్త్రాల్వకూ వెరువని భారత్‌ను సిద్ధం చేద్దామని జీవ ఆయుధాలతో దాడి జరిగినప్పుడు, అణ్వాయుధాల నుంచి రేడియో కాలుష్యం వ్యాపించినప్పుడు ఎలా స్పందిం చాలి ఆ రెండు రకాల ముప్పులను ఎదుర్కోవాలి వాటి వల్ల ఇన్ఫెక్షన్ బారినపడే వారికి ఎలాంటి ప్రాథమిక చికిత్స, అత్యవసర చికిత్స అందించాలి అనే సమాచారంతో నిర్దిష్టమైన చికిత్సా విధానాలను మనం ఇప్పుడే సిద్ధం చేసుకోవాలన్నారు. ఆపరేషన్ సిందూర్ ముగిసిన తర్వాత భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒక విషయాన్ని క్లియర్‌గా చెప్పారు. న్యూక్లియర్ బెదిరింపులకు భారత్ భయపడదని ఆయన తేల్చి చెప్పారు.



## అబార్షన్ చేయించుకోమన్నాడని

# బాయ్‌ఫ్రెండ్ పీకకోసిన యువతి

**రాయ్‌పూర్, సెప్టెంబరు 30:** చత్తీస్‌ఘడ్‌లో దారుణమైన హత్య జరిగింది. గర్భం దాల్చిన ఓ మైనర్ అమ్మాయి తన బాయ్‌ఫ్రెండ్‌ను కత్తితో గొంతుకోసి చంపేసింది. ఈ ఘటన రాయ్‌పూర్‌లోని ఏవన్ లాడ్జీలో జరిగింది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం బిలాస్‌పూర్‌కు చెందిన 16 ఏళ్ల నిందితురాలు ఈనెల 28వ తేదీన తన బాయ్‌ఫ్రెండ్ మొహమ్మద్ సద్దాంను కలిసేందుకు రాయ్‌పూర్ వెళ్లింది. బీహార్‌కు చెందిన ఎంఎస్ ఇంజినీరింగ్ ఆఫీసర్ అయిన బాధిత వ్యక్తితో కలిసి లాడ్జీలో గడిపింది. ప్రెగ్నెంట్ అయిన ఆ మైనర్‌పై బాధిత వ్యక్తి వత్తిడి తెచ్చాడు. అబార్షన్ చేయించుకోవాలని ఆమెపై ప్రెజర్ పెట్టాడు. దీంతో లాడ్జీ బయట ఇద్దరి మధ్య ఆ రోజు గొడవ జరిగింది. కత్తితో చంపేస్తానని బెదిరించాడతను. అయితే ఆ రోజు రాత్రి లాడ్జీ రూమ్‌లో సద్దాం నిద్రిస్తున్న సమయంలో అతడు బెదిరించిన కత్తితోనే అతని గొంతు కోసేసిందామె. ఆ తర్వాత రూమ్‌ను బయటి నుంచి లాక్ చేసి సద్దాం మొబైల్ ఫోన్‌తో పరారీ అయ్యింది. లాడ్జీ రూమ్ తాళంచెవులను సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్ వద్ద పడేసింది. మరుసటి రోజు బిలాస్‌పూర్‌లో స్వంత ఇంటికి వెళ్లిన తర్వాత జరిగిన నేరం గురించి ఆ మైనర్ తన తల్లికి చెప్పింది. కోని పోలీసు స్టేషన్‌కు వెళ్లి నిందితురాలి తల్లి మర్డర్ గురించి ఫిర్యాదు చేసింది. ఏవన్ లాడ్జీకి వెళ్లిన రాయ్‌పూర్ పోలీసులు.. అక్కడ నిర్జీవంగా పడి ఉన్న సద్దాం మృతదేహాన్ని వెలికితీశారు. బీహార్‌లో ఉన్న సద్దాం ఫ్యామిలీతో కాంటాక్టు అవుతున్నట్లు పోలీసులు తెలిపారు. బాధిత వ్యక్తికి చెందిన ఫోన్ తమ వద్ద ఉన్నట్లు చెప్పారు. కేసు రిజిస్టర్ చేసి మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మైనర్ అమ్మాయి మూడు నెలల గర్భిణి అని తెలిసింది. అబార్షన్ చేయించుకోవాలన్న ఇష్టం లేదని ఆ అమ్మాయి పేర్కొన్నది. పెళ్లి చేసుకోవాలని లేదని, గరస్రావ్రం చేయించుకోవాలని సద్దాం వత్తిడి చేసినట్లు విచారణలో వెల్లడైంది. చివరకు ఆమె బాయ్‌ప్రెండ్ ప్రాణాలు తీసింది.




# లడఖ్ ప్రజలను మోసగించిన ప్రధాని మోడీ

## రాహుల్ గాంధీ ఆరోపణ

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 30:** లడఖ్ ప్రజలతో చర్చలు జరపాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మంగళవారం డిమాండ్ చేసారు. హింసా రాజకీయాలను ఆపాలని విన్నవించారు. ఇటీవల లేహ్‌లో నలుగురు ప్రాణాలను బలిగొన్న హింసపై న్యాయపరమైన విచారణను జరిపించాలన్నారు. కాల్పుల్లో మరణించిన బాధితుల్లో ఒకరు సైనికుల కుటుంబానికి చెందినవారని రాహుల్ తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. తండ్రి సైనికుడు, కొడుకు కూడా సైనికుడే వారి రక్తం దేశభక్తితో ప్రవహిస్తుంది. అయినప్పటికీ, లద్దాఖ్‌తోపాటు అతడి హక్కుల కోసం నిలబడినందుకు బీజేపి ప్రభుత్వం దేశ ధైర్యవంతుడైన కొడుకును కాల్చి చంపింది. ఈ రోజు దేశానికి సేవ చేసినందుకు లభించే ప్రతిఫలమా?'అని రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో విమర్శించారు. "లద్దాఖ్‌లో జరిగిన హత్యలపై న్యాయ విచారణ జరగాలని దోషులకు సాధ్యమైనంత కఠినమైన శిక్ష విధించాలి అనేది మా డిమాండ్ అన్నారు. మోడీ జీ, మీరు లద్దాఖ్ ప్రజలను మోసం చేశారని రాహుల్ ఆరోపించారు. లద్దాఖ్ ప్రజలు తమ హక్కులను డిమాండ్ చేస్తున్నారని, అందుకు వారితో చర్చించాలని కోరారు. హింస, భయ రాజకీయాలను ఆపాలని అన్నారు. అంతకుముందు సెప్టెంబర్ 24న లేహ్‌లో నిరసనల సందర్భంగా హింస చెలరేగింది. స్థానిక బీజేపీ కార్యాలయానికి నిప్పు పెట్టారు. ఈ ఘర్షణల్లో నలుగురు మరణించారు. అయితే లద్దాఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలని, ఆ ప్రాంతాన్ని ఆరో షెడ్యూలు పరిధిలో చేర్చాలని కోరడంతో పాటు పలు డిమాండ్ల సాధన కోసం సాగుతున్న ఉద్యమం ఇటీవల హింసాత్మకంగా మారాయి.

# ఇంగ్లీషు రాయడం రాయని ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్




**సిమ్లా, సెప్టెంబరు 30:** అతడొక ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపల్. కానీ థౌజెండ్ స్పెల్లింగ్ రాయరాదు. హండ్రెడ్ స్పెల్లింగ్ రాదు. సిక్స్‌కు సిక్స్‌టీన్‌కు తేడా తెలియదు. కనీసం సెవెన్ స్పెల్లింగ్ కూడా చక్కగా రాయడం రాలేదు. ఆయన రూ.7,616ను (సావెన్ థర్స్‌డే సిక్స్ హరేంద్ర సిక్స్ రూపీస్ ఓన్లీ) అని రాశాడు. ఈ చెక్కు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ఓ ప్రభుత్వ స్కూల్ ప్రిన్సిపాల్ మిడ్‌డే మీల్ వర్కర్స్‌కు ఇవ్వాల్సిన నగదుకు సంబంధించి రూ.7,616 చెక్కు ఇచ్చాడు. అయితే ఆ చెక్కులో నగదుకు సంబంధించి ఇంగ్లీష్‌లో అన్నీ తప్పులే రాశాడు. దాంతో బ్యాంకు అధికారులు స్పెల్లింగ్ మిస్టేక్స్ ఉన్నాయంటూ ఆ చెక్కును నగదుగా మార్చకుండా రిజెక్ట్ చేశారు. ఆ చెక్కును సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారింది. నెటిజన్‌ల నుంచి రకరకాల కామెంట్స్ వస్తున్నాయి.

# బిజెపి సీనియర్‌నేత సంజయ్‌కుమార్ మల్హోత్రా కన్నుమూత



విజయ్ కుమార్ మల్హోత్రా(ఫైల్)

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ విజయ్ కుమార్ మల్హోత్రా మంగళవారం ఉదయం తన 94వ ఏట కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా వయసు సంబంధిత సమస్యలతో ఢిల్లీలోని ఎయిమ్స్ లో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం ప్రాణాలు కోల్పోయినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా ఆయన మరణవార్తను ఎక్స్ వేదికగా తెలిపారు. మల్హోత్రా జీవితం మొత్తం దేశానికి, ప్రజలకు అంకితం అయినదని అన్నారు. అది ఆయన నిరాడంబరతకు, ప్రజా సేవకు నిదర్శనమని కూడా సచ్‌దేవా తెలిపారు. జనసంఘ్ రోజుల నుంచి ఆయన ఢిల్లీలో పార్టీ సిద్ధాం తాలను విస్తరించడానికి అలుపెరుగని కృషి చేశారని కొనియాడారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ సహా పలువురు కేంద్ర మంత్రులు ఆయన మృతి పట్ల ప్రగాఢసానుభూతిని వ్యక్తం చేశారు. మల్హోత్రా చేసిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు.

## సంక్షిప్తంగా..

# పాకిస్థాన్‌లో భారీ పేలుడు, కాల్పులు..

**ఇస్లామాబాద్, సెప్టెంబరు 30:** పాకిస్థాన్‌లోని క్వెట్టా ప్రాంతం భారీ పేలుడుతో దద్దరిల్లింది. అక్కడే కాల్పుల మోత వినిపించింది. ఫ్రాంటియర్ కోర్ కేంద్ర కార్యాలయం సమీపంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆ భద్రతా సిబ్బంది లక్ష్యంగా దాడి జరిగినట్లు తెలుస్తోంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. బలోచిస్థాన్‌లోని క్వెట్టా నగరంలో పారామిలిటరీ బలగాలకు చెందిన ఫ్రాంటియర్ కోర్ కేంద్ర కార్యాలయం సమీపంలో పేలుళ్ల ఘటన జరిగింది. దాంతో దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఇళ్లు,భవనాల కిటికీ అద్దాలు పగిలిపోయాయి. అప్పటికే ఆందోళన చెందుతున్న ప్రజలకు కాల్పుల మోత వినిపించింది. ఈ వరుస ఘటనలు స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించాయి. దాడులకు పాల్పడిన వారిని గుర్తించేందుకు బలగాలు గాలింపు చేపట్టాయి. అత్యంత తీవ్రతతో జరిగిన పేలుడుకు గల కారణాలపై దర్యాప్తు జరుగుతోంది. క్షతగాత్రులను వెంటనే దగ్గరలోని ఆస్పత్రులను తరలించారు. దాంతో ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితిని విధించారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు 13 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.

# కూలిన స్కూల్ భవనం:శిథిలాల కింద 65 మంది విద్యార్థులు



**జకార్తా, సెప్టెంబరు 30:** ఇండొనేసియాలో నిర్మాణంలో ఉన్న ఓపాఠశాల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ఓ విద్యార్థి ప్రాణాలు కోల్పోగా దాదాపు 65 మంది విద్యార్థులు శిథిలాల్లో చిక్కుకున్నారు. అంతర్జాతీయ మీడియా వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం జావాలోని సిడోర్జో పట్టణంలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల ఇస్లామిక్ పాఠశాల భవనం సోమవారం కుప్పకూలింది. మధ్యాహ్న సమయంలో భారీ సంఖ్యలో విద్యార్థులు పాఠశాల భవనంలో ప్రార్థనల కోసం గుమిగూడారు. అదే సమయంలో భవనం కూలిపోవడంతో స్థానికులు 79 మంది విద్యార్థులను రక్షించారు. ఇంకా దాదాపు 65 మంది విద్యార్థులు శిథిలాల కింద చిక్కుకున్నట్లు భావిస్తున్నారు. విద్యార్థులంతా 12 నుంచి 17 యేళ్లలోపు ఉన్నట్లు తెలిపారు. ఈ ఘటనాస్థలంలో విద్యార్థుల కుటుంబాల రోదనలు మిన్నంటాయి. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. శిథిలాలలో చిక్కుకొన్న విద్యార్థుల సంఖ్యను నిర్ధారించడానికి పోలీసులు పాఠశాల అధికారుల సాయం తీసుకుంటున్నట్లు సమాచారం.

# ఇజ్రాయెల్ గాజా యుద్ధం ముగింపు స్వాగతిస్తున్నాం: ప్రధాని మోడీ



**వాషింగ్టన్, సెప్టెంబరు 30:** ఇజ్రాయెల్ హమాస్‌ల మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు కీలక ముందడుగు పడిన విషయం తెలిసిందే. గాజాలో యుద్ధం ముగింపున కు ట్రంప్ సూచించిన 20 సూత్రాల శాంతి ఫార్ములాకు ఇజ్రాయెల్ అంగీకరించింది. ట్రంప్ ప్లాన్‌ను పలు దేశాలు స్వాగతిస్తున్నాయి. తాజాగా గాజాపై ట్రంప్ ప్రణాళికను భారత్ కూడా స్వాగతిం చింది. గాజాలో యుద్ధం ముగించేందుకు ట్రంప్ చేసిన ప్రణాళికను స్వాగతిస్తున్నట్లు ప్రధాన మంత్రి మోడీ తెలిపారు. ట్రంప్ ప్రణాళిక పశ్చిమాసియాలో దీర్ఘకాలిక శాంతికి మార్గమని పేర్కొన్నారు. యుద్ధం ముగించి శాంతిని నెల కొల్పే ఈ ప్రయత్నానికి అందరూ మద్దతు ఇస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ప్రస్తుతం ఆ పోస్టు వైరల్ అవుతోంది. ఇజ్రాయెల్ హమాస్‌ల మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే.

# మంత్రి బాలాజీని అరెస్టు చేయాలంటూ టివికె కార్యకర్త ఆత్మహత్య

**విల్లుపురం(తమిళనాడు),సెప్టెంబరు 30:** తమిళనాడు రాష్ట్రంలోని కరూర్ జిల్లాలో టీవీకే ప్రచార ర్యాలీలో జరిగిన తొక్కిసలాట ఘటన రాజకీయ పరంగా తీవ్ర దుమారం రేపుతోంది. విల్లుపురం జిల్లాకు చెందిన అయ్యప్పన్ (51) టీవీకే పార్టీలో కార్యకర్తగా పనిచేస్తున్నారు. మూడు రోజుల క్రితం తన వృద్ధ తల్లిదండ్రులను చూసేందుకని మైలం గ్రామానికి వెళ్లారు. అయితే, ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గమనించిన ఆయన తల్లి మునియమ్మల్ చుట్టుపక్కల వారికి సమాచారం అందించడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయ్యప్పన్ గదిలో సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. అందులో పార్టీ చీఫ్ విజయ్ ప్రచారం సందర్భంగా 41 మంది ప్రాణాలు కోల్పోయిన కరూర్ తొక్కిసలాటకు డీఎంకే మంత్రి సెంథిల్ బాలాజీ, పోలీసులే కారణమని అయ్యప్పన్ సూసైడ్ నోట్‌లో రాశారు.

## వీనుల విందుగా..



నవరాత్రుల్లో అందర్నీ ఆకట్టుకునే నృత్యం... కోలాటం, బతుకమ్మ దుర్గమ్మ పాటలు పాడుతూ కోలాటం ఆడుతూ రంగురంగుల దుస్తుల్లో మహిళలు గుండ్రంగా తిరుగుతుంటే చూసేవాళ్లకి కన్నులపండగే. ఇక ఆడేవాళ్లకొచ్చే జోష్‌ని మాటల్లో చెప్పలేం. సాయంత్రం ఆరుగంటలకి మొదలైన ఆట.. ఓ పట్టాన ఆపాలనిపించదు. అందుకే ఒకప్పటితో పోలిస్తే.. కోలాటానికి ఆదరణ పెరిగిందని చెప్పాలి. విజయనగర రాజుల కాలంలో ప్రాచుర్యంలోకి వచ్చిన ఈ ఆట.. పూర్వం జానపదుల్లోనే ఎక్కువ కనిపించేది కానీ ఇప్పుడిది అందరి నృత్యం. కోల అంటే కర్రపుల్ల, ఆట అంటే నృత్యం అని అర్థం. పల్లె, పట్టణం, చిన్నాపెద్దా భేదం లేకుండా పండుగల వేళ.. అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో మహిళలంతా ఒకచోట చేరి సాయంత్రాలు ఒకే రంగు దుస్తులేసుకుని మరి కోలాటమాడుతున్నారు. పైగా ఈ మధ్య అన్ని రకాల పాటల్నీ కోలాటంలో చేరుస్తున్నాం. కానీ, కోలు కోలన్న చెలియ మేలుకోలన్న.. ఆకువక్క గన్నేరు చెక్క.. అందరాల అడగనేరదు మా పెళ్లికూతురు 'కొందరాల కసరనేరదు' మా పెళ్లి కూతురు.. ఇలా కోలాటానికి ప్రత్యేకమైన పాటలూ ఉన్నాయి. చేతుల్ని పైకీ కిందకీ కదుపుతూ ఒకరి కర్రల్ని ఒకరు కొడుతూ ఒకే తీరులో అడుగులేయడం శరీరానికి మంచి వ్యాయామం, గుండెకి ఆరోగ్యం. ఇది కండరాల బలాన్ని పెంచి ఒత్తిడి, ఆందోళనల్ని తగ్గిస్తుంది. పిల్లలకి దీనివల్ల ఏకాగ్రత, మోటార్‌స్కిల్స్, సమన్వయం వంటివి పెరుగుతాయి. ఒకరి చేతి కర్రల్ని ఒకరు కొడుతూ ఒకే తీరులో అడుగులేయడం శరీరానికి మంచి వ్యాయామం, గుండెకి ఆరోగ్యమయం. ఇది కండరాల బలాన్ని పెంచి, ఒత్తిడి, ఆందోళనల్ని తగ్గిస్తుంది. పిల్లలకి దీనివల్ల ఏకాగ్రత, మోటార్‌సినకల్స్, సమన్వయం.. వంటివి పెరుగుతాయి. ఒక చేతి కర్రల్ని మరొకరి కర్రలకి తగిలిస్తుంటే వచ్చే శబ్దానికి గాజుల గల గలలు, అందెల రవం, బృంద గానం తోడై వీనుల విందుని కలిగిస్తాయి. మనసు ఆనందంతో నిండి పోతుంది. ఇంకెందుకు ఆలో చన.. ఆడటం రాదనో సిగ్గనో ఓ మూలకి చేరకుండా అందరితో కలిసి పోండి.. ఆడి పాడండి!

# ఇంట్లోనే కుంకుమ పువ్వు సాగు.. లక్షల ఆదాయం!



**ఇంట్లోనే కుంకుమ పువ్వు సాగు..లక్షల ఆదాయం.. వ్యాపారం.. ఇప్పుడిది చాలామంది కెరీర్‌గా మారిపోయింది. తమ అభిరుచినే వ్యాపారంగా మార్చుకొని సక్సెస్ సాధిస్తున్న వారెంతోమంది! ఒడిశాకు చెందిన సుజాత అగర్వాల్ ఇదే కోవకు చెందుతారు.** తనకున్న గార్డెనింగ్ అభిరుచినే వ్యాపార మార్గంగా మలచుకున్న ఆమె.. తన ఇంట్లోనే వివిధ రకాల కాయగూరలు పండిస్తోంది. మరోవైపు కుంకుమ పువ్వు కూడా సాగు చేస్తూ ఏడాది తిరిగేసరికి లక్షల ఆదాయం ఆర్జిస్తోంది. కొన్నేళ్ల క్రితం వరకు గృహిణిగా సాధారణ జీవితం గడిపిన సుజాత.. ఇప్పుడు ఓ వ్యాపారవేత్తగా పేరు తెచ్చుకుంది. అంతేకాదు.. తాను పాటిస్తున్న వ్యాపార మెలకువల్నే పాఠాలుగా చెబుతూ ఎంతోమంది యువతలో స్ఫూర్తి నింపుతోంది.

**అమ్మే నాకు స్ఫూర్తి!** సుజాతకు చిన్నతనం నుంచే గార్డెనింగ్ అంటే మక్కువ. తన ఇంటి మట్టుపై రంగురంగుల పూల మొక్కలు పెంచేది. 'మా అమ్మను చూశాకే తోటపనిపై నాకు ఇష్టం పెరిగింది. అమ్మ మొక్కలు నాటేది. ఇలా పచ్చదనం మధ్య పెరిగిన నాకూ గార్డెనింగ్‌పై ఆసక్తి పెరిగింది. హోమ్ సైన్స్‌లో పీజీ అయ్యాక పెళ్లి చేసుకున్నా. నా భర్త, అత్తింటి వారూ నా అభిరుచిని గౌరవించి నన్ను ప్రోత్సహించారు. దీనితో ఇంటి చుట్టూ ఎన్నో రకాల పూల మొక్కలు పెంచేదాన్ని. మల్లె, గులాబీ, బంతి, చామంతి, మందార.. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రస్తుతం మా గార్డెన్‌లో ఉన్న పూల మొక్కల సంఖ్య 250కి పైమాటే పిల్లలకు ట్యూషన్లు చెప్పడం, ఒడిస్సీ నృత్యం నేర్పడం అంటోంది సుజాత.

**అప్పుడు వచ్చిన ఆలోచన!** వృత్తిగతంగానైనా కెరీర్ పరంగానైనా, చాలామందికి కరోనా ముందు, తర్వాత అన్నట్లుగా మారిపోయింది. సుజాత లైఫ్ స్టైల్ కూడా అంతే! కోవిడ్ లాక్ డౌన్ కు ముందు ఓ సాధారణ గృహిణిగా, ట్యూటర్‌గా జీవితం గడిపిన ఆమె.. లాక్ డౌన్ పూర్తయ్యేసరికి వ్యాపారవేత్తగా మారిపోయింది. ఈ సమయంలో వచ్చిన ఆలోచనే తనను ఇటుగా అడుగులేయించిందంటోంది సుజాత. "లాక్ డౌన్ సమయంలో పిల్లలందరికీ ఇంటికే పరిమితమవడం వల్ల ఎక్కువగా ఖాళీ సమయం దొరికేది. దీనితో గార్డెనింగ్ గురించి మరిన్ని విషయాలు ఇంటర్నెట్‌లో శోధించా. అప్పుడే హైడ్రోపోనిక్స్ వ్యవసాయ పద్ధతి (మట్టి లేకుండా నీటితోనే పంట పండించడం) గురించి నాకు తెలిసింది. కానీ మూడో ప్రయత్నంలో సక్సెస్సయ్యా, నేను ఇంటి అవసరాలకు తీర్చగా ఇంకా మిగిలిపోయేవి. దీంతో వాటిని మార్కెట్లో అమ్మాలనుకున్నా. అయితే ఇదే సమయంలో క్యాబేజీ, బ్రకోలీ, ఇతర ఆకుకూరలు.. వంటివి మా ప్రాంతంలో పండించేందుకు అనుకూలమైన వాతావరణం లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి వాటిని దిగుమతి చేసుకుంటున్నట్లు తెలుసుకున్నా.

**కుంకుమ పువ్వు సాగు..** నీ వల్ల కాదన్నారు! తాను పండించే కాయగూరలు, ఆకుకూరలకు డిమాండ్ పెరగడంతో తన వ్యాపారాన్ని మరింత విస్తరించిన సుజాత.. 'బ్లూమ్ ఇన్ హైడ్రో' పేరుతో ఓ సంస్థను ప్రారంభించింది.. ఈ వేదికగా తన వ్యవసాయోత్పత్తుల్ని విక్రయించడం మొదలుపెట్టింది. ప్రస్తుతం తన ఇంట్లోనే హైడ్రోపోనిక్స్ విధానంలో దాదాపు 250 రకాల కాయగూరలు, మైక్రోగ్రీన్స్ సాగు చేస్తోంది అగ్రి ఆంత్రప్రెన్యూర్. ఏరోపోనిక్స్ (గాలి ద్వారా, తేమతో కూడిన వాతావరణంలో పంటలు పండించడం) పద్ధతిలో కుంకుమ పువ్వు కూడా సాగుచేస్తోంది. ఓసారి దైవారాధనలో ఉండగా ఆ పక్కనే ఉన్న కుంకుమ పువ్వు డబ్బా పై నా దృష్టి పడింది. దీన్ని ఇంట్లోనే సాగు చేస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన వచ్చింది. అయితే ఇందుకు అనుకూల వాతావరణం కశ్మీర్‌లో తప్ప మరెక్కడా ఉండదన్నారు చాలామంది. కానీ ఇంట్లో కూడా అధునాతన వ్యవసాయాన్ని ఉపయోగించి కుంకుమ పువ్వు సాగు చేయాలని నిరూపించాలనుకున్నా. ఈ అంచనానే దాదాపు రూ.11 లక్షలు ఖర్చు పెట్టి హ్యూమిడిఫైయర్, డీహ్యూమిడిఫైయర్, చిల్లర్, కుంకుమ పువ్వు బల్బుల్ని అమర్చడానికి ట్రేలు.. వంటివన్నీ తెప్పించుకున్నా. ఇలా వీటితోనే ఇంట్లో ఓ గదిలో కుంకుమ పువ్వు సాగుకు అనువైన వాతావరణం సృష్టించుకున్నా. కశ్మీర్ నుంచి కుంకుమ పువ్వు బల్బుల్ని తెప్పించుకొని ట్రేలో అమర్చారు. ఇలా తొలి విడతలో 450 గ్రాముల కుంకుమ పువ్వుల్ని సాగు చేశా. ఇలా క్రమంగా ఉత్పత్తి పెరుడుతూ వచ్చింది. ప్రస్తుతం ఏడాది కి రెండు విడతల్లో కిలో చొప్పున రెండు కిలోల కుంకుమ పువ్వు ఉత్పత్తి చేస్తున్నా. ఫలితంగా కిలోకు రూ.10 లక్షల చొప్పున సంవత్సరానికి రూ. 20 లక్షలకు పైగా ఆదాయం వస్తోంది. అంటూ చెప్పుకొచ్చింది సుజాత.

**వ్యవసాయమే అయినా..** చెమటోడ్చకుండా, వాతావరణ పరిస్థితుల్లో పంటలు పండాలని కోరుకుంటోంది నేటి యువతరం. అలాంటి వారికి హైడ్రోపోనిక్స్, ఏరోపోనిక్స్.. వంటి అధునాతన వ్యవసాయ పద్ధతులు చక్కగా నప్పుతాయి. అలా ఇప్పటివరకు నా దగ్గర దాదాపు 60 మందికి పైగా ఔత్సాహికులు ఆయా మైక్రోగ్రీన్స్, కుంకుమపువ్వు సాగు చేయడంపై శిక్షణ ఇచ్చా. వీరిలో కొంతమంది సొంతంగా వ్యాపారాలూ ఉన్నాయి. భవిష్యత్తులో మరింతమందిని ఈ దిశగా ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నా. అంటోన్న ఈ మహిళా వ్యాపారవేత్త 'ఒడిశా శాఫ్రన్ లేడీ'గా పేరు తెచ్చుకుంది. ఓ కార్యక్రమంలో భాగంగా, 'స్వయంసిద్ధ సమ్మాన్' అవార్డు కూడా అందుకుంది అగ్రిప్రెన్యూర్.

## నేటి అలంకరణ
# శ్రీమహిషాసురమర్ధిని



"మహిషమస్తక నృత్త వినోదిని
స్ఫుటరణన్మణి నూపుర మేఖలా
జననరక్షణ మోక్ష విధాయిని
జయతి శుంభ నిశుంభ నిషూదిని "

దసరా శరన్నవరాత్రుల్లో నవమి తిథిని మహర్నవమి అనికూడా అంటారు. మహిషాసురమర్దినిగా అమ్మవారు దర్శనమిస్తుంది. దేవీ నవావతారాలలో అత్యుగ్రరూపం మహిషాసురమర్దినీదేవి. ఆశ్వయుజ శుద్ధ నవమి రోజున అమ్మ మహిషాసురమర్దినిగా అవతరించి దుష్ట శిక్షణ శిష్ట రక్షణ చేసింది. ధర్మ విజయానికి సంకేతంగా ఆశ్వయుజ శుద్ధనవమినే 'మహర్నవమి'గా భక్తులు ఉత్సవం జరుపుకొంటారు. సింహ వాహనారూఢియై పాశం, పరుశు, త్రిశూలం, చక్రం, ఖడ్గం, విల్లు, ఆదిగా గల ఆయుధాలను ధరించిన అమ్మ సకల దేవతల అంశాలతో మహాశక్తి రూపంతో దుర్గమ్మవారు దర్శనమిస్తుంది. మహిషాసురుడనే రాక్షసుడిని సంహరించిన అమ్మను మహిషాసురమర్దినీదేవీగా పూజిస్తే శత్రుభయం తొలగిపోయి సకల విజయాలు కలుగుతాయి. విజయవాడలో ఇంద్రకీలాద్రిపై అమ్మవారు ఆ ఉగ్రరూపంతోనే పూర్వకాలంలో దర్శనమిచ్చేది. ఆ తల్లి ఉగ్రరూపాన్ని శ్రీ చక్రంలోకి ప్రతిపాదించి 'అయిగిరి నందిని నందిత మేథిని' అంటూ స్తుతిస్తూ స్తోత్రం చేశాడు. శంకరాచార్య స్వామివారు. దీంతో అమ్మవారు శాంతస్వరూపిణిగా సకల జీవకోటిని తన చల్లని చూపులతో అనుగ్రహిస్తోంది. ఈ అమ్మను పూజిస్తే సకల దేవతలను పూజించిన ఫలితం లభిస్తుంది.

**వస్త్ర అలంకారం:** మిరప పండు వర్ణం

**పుష్పాలు :** బకుల పుష్పం

**నివేదన :** కదంబం, చక్కెర పొంగలి

**మంత్రం:** "ఓం ఐం హ్రీం శ్రీం సర్వసమ్మోహిన్యైస్వాహా" అనే మంత్రాన్ని 108 సార్లు జపించాలి. చండీ సప్తసతి హోమం చెయ్యాలి.

-భట్టిప్రోలు నటరాజ కుమార్

**పిల్లలు**

**పుట్టినప్పటి** నుంచీ పదాలు పలకడం దగ్గర్నుంచి ఎన్నెన్నో నేర్పిస్తుంటాం కదా! ఆ జాబితాలో వీటికి చోటుందేమో చెక్ చేసుకోమంటున్నారు నిపుణులు. ఎందుకంటే..

పరిచయం.. హాయ్ చెప్పు నాన్న.. నీ పేరడుగుతున్నారు చెప్పు ఇలా ఎన్నిసార్లో కదిలిస్తేనో కానీ.. ఫోన్‌లోంచి తలెత్తడం లేదు ఈ తరం గడుగ్గాయులు. మరి ఒకప్పుడు? చక్కగా నమస్తే అని వాళ్లే పలకరించేలా చేసేవారు పెద్దవాళ్లు. ఈ తరహాలో పరిచయం చేసుకునేలా



తర్ఫీదు ఇవ్వండి. చిరునవ్వుతో, ముఖం లోకి చూస్తూ మాట్లాడతారు కదా.. ఎదుటివారి హావభావాలను అంచనా వేయడం, కలిసిపోవడం వంటి లక్షణాలు అలవడతాయి.

## వారిని ప్రోత్సహించండి..

**ప్రశ్నించనీయండి...** అబ్బబ్బా కాసేపు నోరు మూస్తా' ప్రశ్నల వర్షం కురిపించడం ప్రారంభించగానే మన నోట్లోంచి ఈ మాట వచ్చేస్తుంది. నిజానాకి ఇవి ప్రశ్నలు కాదు. నేర్చుకోవడంలో భాగం. వాళ్లు ఏమీ అడగకుండా ఉంటేనే కంగారుపడాలి. ప్రశ్నిస్తేనే.. వినడమూ తెలుస్తుంది. కాబట్టి కసురుకోవద్దు ప్రోత్సహించండి.

**ముగింపు కాదు..** పిల్లలతో ఏదైనా నచ్చనిది చేయించండి. మొక్కుబడిగా చేసేస్తారు. మనమై ఏదో ఒకటిలే. చేశారుగా అని ఊరుకుంటాం కానీ అది మంచిది కాదు. సరిగ్గా, పొందికగా పూర్తిచేయడం అలవాటు చేయండి. మంచి వ్యక్తిత్వం అలవడేది ఇక్కడే. లేదంటే తప్పించుకునే మార్గాల వైపే ముగ్గు చూపుతారు. పడేయొద్దు.. పిల్లలు ఏదైనా పాడు చేస్తే ముందు మనకే విసుగొస్తుంది. వెంటనే దాన్ని పక్కన పడేస్తాం.మరి మన చిన్నప్పుడు దాన్ని బాగు చేసుకొనేలా వాడుకున్నాం. అదే నేర్పించండి. అడిగారనో, స్థోమత ఉందనో కొత్తవి తెచ్చిపెడుతూ వెళ్లొద్దు. వాటినే బాగు చేసుకొని వాడటం నేర్పండి వస్తువుల విలువ అర్థమవ తుంది.

## జల్లించడం ఇక సులువు..

బియ్యం, గోధుమ, మైదా పిండిలతో రకరకాల వంటలు చేస్తుంటాం. ముఖ్యంగా కేకులు, బిస్కెట్లు, కొన్ని రకాల స్వీట్ల తయారీకి పిండి బాగా మెత్తగా ఉండాలి. అలాంటప్పుడు పిండిని తప్పనిసరిగా జల్లించు కోవాల్సిందే. కానీ అప్పుడు ప్లేటు చుట్టుపక్కల కూడా పిండి పడిపోతుంది. దాంతో దాన్ని శుభ్రం చేసుకోవాల్సిన అదనపు పనీ పడుతుంది. అలాకాకుండా చేస్తుందీ కొత్తరకం జల్లెడ, దీంట్లో పిండి వేసి జల్లిస్తే.. బాగా మెత్తగా ఉండటంతోపాటు చుట్టుపక్కల రావాలంటే..



## జలుబు తగ్గించే శొంఠి ..


ఎన్నో అనారోగ్య సమస్యలకు చెక్ పెడుతుందట. మరి అవేంటో తెలుసుకుందామా! ✦.నెలసరి నొప్పులకు కారణమయ్యే ప్రోస్టాగ్లాండిన్ల స్థాయులు తగ్గించే సమ్మేళనాలు శొంఠిపొడి ఉంటాయి. అందుకే రుతుక్రమ సమయంలో చిటికెడు ఈ పొడిని ఏ రూపంలో తీసుకున్నా మంచిదేనట. నొప్పి తీవ్రత తగ్గుతుంది. అంతేకాదు, మార్నింగ్ సిక్నెస్‌లో బాధపడేవారు రోజూ శొంఠి టీ తాగితే సమస్య దూరమవుతుంది. ✦ వర్షంలో తడిచినప్పుడే కాదు... వాతావరణంలో మార్పుల వల్ల జలుబు, దగ్గు వంటి సమస్యలు వేధిస్తుంటాయి. ఇవి కాస్తయినా అదుపులోకి రావాలంటే.. చిటికెడు శొంఠి పొడిని నీళ్లలో కలిపి మరగబెట్టండి. దానికి కాస్త తేనె కలిపి గోరువెచ్చగా ఉన్నప్పుడు తాగితే సరి. గొంతులో గరగరలతో పాటు సమస్య తగ్గుతుంది. ఇందులోనే కాస్త లవంగ పొడిని కూడా చేర్చుకుంటే శ్వాస కోస ఇబ్బందులూ తగ్గుతాయి. హాయిగా నిద్ర పడుతుంది. ✦ మందకొడిగా ఉండే వాతావరణంలో జీర్ణ సంబంధిత సమస్యలు వస్తుంటాయి. ఆకలి వేయదు. నోటికి రుచి ఉండదు. ఇలాంటప్పుడు వేడి వేడి అన్నంలో కాస్త శొంఠిపొడి, నెయ్యి వేసుకుని మొదటి ముద్ద తినండి. ఇది అజీర్తిని పోగొట్టి ఆకలిని పుట్టిస్తుంది. బాలింతల్లో పాలు పడేందుకూ సాయం చేస్తుంది✦. శొంఠిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ కాంపౌండ్స్ అయిన జింజెరాల్స్, షోగోల్స్ ఆర్థరైటిస్ యిటిస్ అదుపులో ఉంచుతాయి. అనాల్జసిక్ లక్షణాలు... కండరాలు, కీళ్ల నొప్పుల్ని తగ్గిస్తాయి.



## మొబైల్‌తో బరువు తగ్గిద్దాం ..

**ఉదయం లేచిన దగ్గర్నుంచి.. రాత్రి పడుకునే దాకా మనలో చేతిలో ఎక్కువ సమయం ఉండేది మొబైలే. ఆఫీస్ పనులు, కాల్స్, సందేశాలు, కాలక్షేపం కోసం.. ఇలా అన్నింటికీ స్మార్ట్ ఫోనే ఆధారమైంది. అయితే మొబైల్‌ను ఇలా మనం ఒక వినోద వస్తువుగానే చూస్తాం.** కానీ దీనితో సమాజ బరువు కూడా తగ్గచ్చంటు న్నారు నిపుణులు. తీసుకునే ఆహారం దగ్గర్నుంచి చేసే వ్యాయామాల దాకా..ఇలా ప్రతి విషయంలోనూ స్మార్ట్ ఫోన్ మనకు గైడ్ చేస్తుందంటున్నారు. బరువు తగ్గాలంటే చాలామందికి ఆహార, వ్యాయామ నియమాలే గుర్తొస్తాయి. అయితే ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న టెక్నాలజీ సహాయం తీసుకుంటే నిర్దేశిత లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చంటున్నారు నిపుణులు. మొబైల్‌లో మనం ఇన్‌స్టాల్ చేసుకొనే కొన్ని యాప్స్ /ట్రాకర్స్ ఇందుకు దోహదం చేస్తాయంటున్నారు.

**క్యాలరీలు.. కచ్చితంగా...** బరువు తగ్గే క్రమంలో కచ్చితమైన ఆహార నియమాలు పాటించడం చాలామందికి అలవాటే! ఈ క్రమంలో క్యాలరీలు తగ్గించి తీసుకోమంటారు నిపుణులు. అయితే మనం తీసుకునే ఆహారంలో ఎన్ని క్యాలరీలుంటాయో, బరువుకు తగ్గట్లుగా మనం ఎన్ని క్యాలరీలు తీసుకోవాలో కచ్చితంగా లెక్కించడం కష్టమే! కానీ 'క్యాలరీ ట్రాకింగ్ యాప్స్' ఈ పనిని సులభతరం చేస్తాయి. వాటిని ఇన్‌స్టాల్ చేసుకొని.. అందులో మీ బరువుకు సంబంధించిన సమాచారమంతా పొందుపరిస్తే.. మీ ఎత్తుకు తగ్గ బరువుండాలంటే అసలు మీరేం తినాలి? రోజూ ఎన్నిక్యాలరీలు తీసుకోవాలి? పోషకాలు మిస్సవకుండా ఏయే పదార్థాలు మెనూలో భాగం చేసుకోవాలి? వంటివనీనన యాప్ చెప్పేస్తుంది. ఈ సూచనల్ని ఫాలో అయ్యారంటే సులభంగా బరువు తగ్గేయచ్చు. అయితే మీరు డౌన్‌లోడ్ చేసుకొనే ముందు యాప్ రేటింగ్, రివ్యూలను ఓసారి పరిశీలిస్తే.. ఏది అత్యుత్తమమైందో మీకు అర్థమవుతుంది. ప్రస్తుతం ప్రజాదరణ పొందిన అలాంటి క్యాలరీ ట్రాకింగ్ యాప్స్‌లో మై ఫిట్‌నెస్ పాల్ ఒకటి. ఇందులో



క్యాలరీ కౌంటర్, ఫిట్‌నెస్ ట్రాకర్, డైట్ ప్లానింగ్, పోషకాహారానికి సంబంధించిన సమాచారం.. వంటి ఎన్నో అంశాల్ని పొందుపరిచారు.

## చెలి చిట్కా

పుదీనా ఆకులను మెత్తగానూరి ప్రతీరోజు రాత్రిపూట ముఖానికి రాసి ప్రొద్దుటే గోరువెచ్చని నీటితో కడిగివేయాలి. ఈ విధంగా చేయ దం వల్ల మొటిమలు మచ్చలు తగ్గుతాయి.

## అంబ పండ్లు, కూరగాయలతో..










అమ్మవారి మహిమ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిందేముంది? ఆ తల్లి దర్శించుకుంటే.. ఎలాంటి అలజడులు, ఆందోళనలైనా ఇట్టే తొలగిపోతాయి. మనసు ప్రశాంతంగా ఉంటుంది. దేవీనవరాత్రులలో పండ్లు, కూరగాయలతో అలంకరించిన దుర్గామాతను చూసి తరించండి.











## కళ తెచ్చే కనకాంబరం..



**చిన్ననాటి జ్ఞాపకాల్ని గుర్తుచేసే పూల మొక్క కనకాంబరం.** వాసన లేకపోయినా కంటికింపైన రంగుల్లో ఆకట్టుకుంట టాయివి. తేలిగ్గా ఉండి, మూడు నాలుగు రోజుల పాటు తాజాగా కనిపిస్తాయి. బతుకమ్మ పండక్కి ఈ పూలు దండల్లే ఆడపడచుల మనసుల్ని మురిపిస్తాయి. అయితే, సాధారణంగా కనకాంబరాలు అనగానే నారింజ, పసుపు రంగుల్లో ఉన్నవే ఎక్కువగా కనిపిస్తుంటాయి. కానీ, నేరేడు, ఎరుపు లేత గులాబీ.. వంటి మరెన్నో వర్ణాల్లోనూ ఇవి దొరుకుతాయి. దాంతో ఒక్క బతుకమ్మ వేడుకలోనేకాదు..పెళ్లి, పేరంటం.. ఏదైనా సరే మూరైనా కనకాంబరాల మాల తలలో పెట్టుకోవాల్సిందే అనుకుంటారు ఒకప్పటితరం. ఇలా వీటని కేశాలంకరణకే కాదు, ఇతర అలంకరణలు, దేవుడి పటాలకు దండలుగానూ వాడుతుంటారు. అంతేనా, ఈ కనకాంబరం మొక్కల్లో ఔషదగుణాలు ఎక్కువట. ఆయుర్వేద వైద్యంలో దగ్గు, అల్సర్ నివారణా మందుల్లో వాడతారట. పుణెలోని మోడరన్ కాలేజీ నిర్వహించిన బయోటెక్నాలజీ పరిశోధనల్లో కనకాంబరాలకు సెల్‌ఫోన్‌పై పేరుకునే బ్యాక్టీరియాను తొలగించే శక్తి ఉందనీ తేలింది.

## ఉమెన్స్‌వరల్డ్ కప్

# భారత్ బోణి

### శ్రీలంకపై 59 పరుగుల తేడాతో ఘనవిజయం

**గువహాటి, సెప్టెంబర్ 30:** మహిళల ప్రపంచ కప్ టోర్నీలో భారత జట్టు తొలి విజయం నమోదు చేసుకుంది. మంగళవారంనాడు గువహాటి వేదికగా శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో 59 పరుగుల తేడాతో టీమిండియా గెలుపొందింది. ఆల్ రౌండర్ దీప్తి శర్మ ఇటు బ్యాటింగ్, అటు బౌలింగ్‌లో అద్భుతంగా రాణించి జట్టును విజయతీరాలకు చేర్చింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ పురస్కారం అందుకుంది. ఇక మ్యాచ్ విషయానికొస్తే... వర్షంతో మ్యాచ్‌ను 47 ఓవర్లకే కుదించారు. టాస్ గెలిచిన శ్రీలంక బౌలింగ్ ఎంచుకోగా, భారత జట్టు తొలుత బ్యాటింగ్ చేసింది. ఓపెనర్లు ప్రతిక రావల్, స్మృతిమందాన జట్టుకు శుభారంభాన్ని అందించడంలో విఫలమయ్యారు. నాల్గో ఓవర్ రెండో బంతికే స్మృతిమందాన పెవిలియన్ చేరగా, వన్‌డౌన్‌లో వచ్చిన హర్లీన్ డియోల్, ప్రతిక రావల్ సమయోచితంగా ఆడుతూ వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును పరుగులెత్తించారు. ఇద్దరినీ విడదీయడానికి లంక బౌలర్లు శ్రమటోడ్చారు. రణవీర బౌలింగ్‌లో రావల్ (37) క్లీన్ బౌల్డ్‌గా అయ్యింది. హర్లీన్ డియోల్ 64 బంతులెదుర్కొని 6 ఫోర్లతో 48 పరుగులు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (19) కూడా నిరాశపరిచింది. రోడ్రిగ్యూస్ (0) పరుగుల ఖాతా తెరవకుండానే వెనుదిరిగింది. దీప్తి శర్మ క్రీజులోకి వచ్చిన తర్వాత భారత స్కోరు బోర్డు పరుగులెత్తింది. ఆమెకు అమన్‌జోత్ కౌర్ జత కలిశారు. దీప్తి శర్మ 53 బంతులెదుర్కొని 3 ఫోర్లతో 53 పరుగులు చేయగా. అమన్‌జోత్ కౌర్ 56 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 57 పరుగులు చేసింది. చివరలో నేహ రాణా (28 నాటౌట్) ధాటిగా ఆడడంతో టీమిండియా నిర్ణీత 47 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 269 పరుగులు చేసింది. లంక బౌలర్లలో ఇనోకా రణవీరా 4 వికెట్లు పడగొట్టగా, ఉదేశిక ప్రబోధని 2 వికెట్లు, చమరి ఆటపట్టు, అచిని కులసూర్య చెరో వికెట్ తమ ఖాతాలో వేసుకున్నారు. అనంతరం 270 పరుగుల లక్ష్యఛేదనతో బరిలోకి దిగిన శ్రీలంక బ్యాటర్లు ఆరంభంలో ధాటిగా ఆడినా, ఆ తర్వాత రాణించలేకపోయారు. ఓపెనర్ హాసిని పెరెరా (14) నిరుత్సాహపరచగా, రెండో ఓపెనర్‌గా బరిలోకి దిగిన కెప్టెన్ చమరి ఆటపట్టు 45 బంతులెదుర్కొని 3 ఫోర్లతో 29 పరుగులు చేసి వెనుదిరింది. వన్‌డౌన్‌లో వచ్చిన హర్షిత సమరవిక్రమ (29) ఎక్కువ సేపు క్రీజులో నిలబడలేకపోయింది. మిడిలార్డర్ బ్యాటర్లలో నీలాక్షిక సిల్వా (35) మాత్రమే రాణించారు. విష్మి గుణరత్నే 11, కవిశా దిల్హారి 15, అనుష్కా సంజీవని 6, సుగందిక కుమారి 10, అచిని కులసూర్య 17, ఉదేశిక ప్రబోధని 14 పరుగులు చేశారు. దీంతో లంక 45.4 ఓవర్లలో 211 పరుగులకే ఆలౌటైంది. 59 పరుగుల తేడాతో విజయం సాధించిన ప్రపంచ కప్ టోర్నీలో టీమిండియా బోణి కొట్టింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3 వికెట్లు తీయగా, నేహ రానా, శ్రీ చరణి రెండేసి వికెట్లు పడగొట్టారు. టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించిన దీప్తి శర్మకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ పురస్కారం లభించింది.




ఆట




## జపాన్ ఓపెన్..
# రన్నరప్‌గా బోపన్న జోడీ
### ఫ్రాన్స్ చేతిలో 5-7 తేడాతో ఓటమి

**న్యూఢిల్లీ:** జపాన్ ఓపెన్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌ల్లో రోహన్ బోపన్న మరియు అతని జపాన్ భాగస్వామి టకేరు యుజుకి ఓటమిపాలై రన్నరప్‌గా నిలిచారు. టోక్యోలో జరిగిన వైల్డ్‌కార్డ్ ద్వయం కోసం డ్రీమ్ రన్ రెండవ సీడ్ హ్యూగో నైస్ (మొనాకో)-ఎడ్వర్డ్ రోజర్‌వాస్సెలిన్ (ఫ్రాన్స్) చేతిలో 5-7, 5-7 తేడాతో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో గట్టి పోటీ ఎదురై అనేక బ్రేక్ పాయింట్లు, సుదీర్ఘ ర్యాలీలు జరిగాయి. కానీ నైస్ మరియు రోజర్‌వాస్సెలిన్ అనుభవం మరియు స్థిరత్వం చివరికి గెలుపును తెచ్చిపెట్టాయి.
క్వార్టర్ ఫైనల్స్‌లో వారు మూడవ సీడ్ మాక్సిమో గొంజాలెజ్ (అర్జెంటీనా) మరియు ఆండ్రెస్ మోల్టెని (అర్జెంటీనా) లను 7-6(5), 7-6(4) తేడాతో ఓడించారు. సెమీఫైనల్ మ్యాచ్ మరో నాటకీయ థ్రిల్లర్‌గా సాగింది. వారు టాప్ సీడ్స్, యుఎస్‌ఎకు చెందిన క్రిస్టియన్ హారిసన్ మరియు ఇవాన్ కింగ్‌లను 4-6, 6-3, 1-0 (18-16) తేడాతో ఓడించి మూడు మ్యాచ్ పాయింట్లను కాపాడుకున్నారు. 43 ఏళ్ల వయసులో ఆస్ట్రేలియన్ ఓపెన్ మరియు మయామి మాస్టర్స్ టైటిళ్లను గెలుచుకున్న ఈ భారత స్టార్, ఇప్పుడు 64 కెరీర్ టూర్‌లెవల్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. మరియు 26 ఎటిపి డబుల్స్ టైటిళ్లతో సహా 537 టూర్‌లెవల్ డబుల్స్ విజయాలను సాధించాడు.

## వెస్టిండీస్ సిరీస్‌లో టీమిండియా నుంచి
# 11 మంది ఔట్
### ఛాంపియన్ టీమ్‌లో నలుగురికే ఛాన్స్




**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025 గెలిచిన తర్వాత టీమిండియా ఇప్పుడు స్వదేశంలో కొత్త సిరీస్ ఆడటానికి సిద్ధమవుతోంది. ఈ సిరీస్ కోసం భారత జట్టు జట్టును ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో ఛాంపియన్ జట్టు నుంచి నలుగురు ఆటగాళ్ళు మాత్రమే బరిలోకి దిగనున్నారు. ఆసియా కప్‌లో విజయం సాధించిన తర్వాత, టీం ఇండియా ఇప్పుడు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా వెస్టిండీస్‌తో జరిగే రెండు టెస్ట్‌ల సిరీస్‌పై దృష్టి పెట్టింది. శుభ్‌మాన్ గిల్ నేతృత్వంలో, యువ, అనుభవజ్ఞులైన ఆటగాళ్ల బృందం అక్టోబర్ 2 నుంచి మైదానంలోకి దిగుతుంది. ఈ సిరీస్ భారత్‌లో జరుగుతుంది. ఇక్కడ కెప్టెన్సీ మాత్రమే కాకుండా ఆటగాళ్లను కూడా అప్‌డేట్ చేస్తారు. వాస్తవానికి ఆసియా కప్ విజేత భారత జట్టు నుంచి నలుగురు ఆటగాళ్ళు మాత్రమే ఈ సిరీస్‌లో ఆడతారు. మిగిలిన 11 మంది ఆటగాళ్ళు భారత టెస్ట్ జట్టులో లేరు. ఈ నలుగురు ఆటగాళ్ళు శుభ్‌మాన్ గిల్, అక్షర్ పటేల్, జస్‌ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్. వీరితో పాటు, సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివం దుబే, సంజు శాంసన్, హర్షిత్ రాణా, రింకు సింగ్, అర్షదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, జితేష్ శర్మ కూడా టెస్ట్ జట్టులో లేరు. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ అక్టోబర్ 2న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరుగుతుంది. రెండవ మ్యాచ్ అక్టోబర్ 10న ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ప్రారంభమవుతుంది. ఈ సిరీస్ టీమిండియాకు కీలకం కానుంది. టీమ్ ఇండియా గత ఏడాది న్యూజిలాండ్‌తో జరిగిన చివరి స్వదేశీ టెస్ట్ సిరీస్, అక్కడ భారత జట్టు క్లీన్ స్వీప్‌ను చవిచూసింది. అయితే, ఆ సమయంలో రోహిత్ శర్మ కెప్టెన్‌గా ఉన్నాడు. కానీ ఈ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో శుభమాన్ గిల్ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. వెస్టిండీస్‌తో జరిగే ఈ టెస్ట్ సిరీస్ కోసం టీం ఇండియా జట్టులో శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, ధృవ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా (వైస్ కెప్టెన్), వాషింగ్టన్ సుందర్, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీష్ కుమార్ రెడ్డి, ఎన్ జగదీశన్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్ ఉన్నారు.




## ఖతార్ క్లాసిక్ స్క్వాష్‌లో
### అభయ్ ఓటమి, క్వార్టర్ ఫైనల్‌కు సుబ్రమణ్యం

**న్యూఢిల్లీ:** ఖతార్ క్లాసిక్ స్క్వాష్-2025లో భారత్ ప్లేయర్ అభయ్ ఓటమిచెందాడు. ఖతార్‌లోని దోహాలో జరుగుతున్న క్లాసిక్ స్క్వాష్‌లో భారత ఆటగాడు అభయ్ సింగ్ ఐదు గేమ్‌ల థ్రిల్లర్‌లో ఈజిప్టు ప్రపంచ 15వ ర్యాంకర్ ఫేర్స్ డెస్సౌకీ చేతిలో పరాజయం చెందాడు. గత రౌండ్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ మరియు ప్రస్తుత ప్రపంచ 5వ ర్యాంక్‌లో ఉన్న ఈజిప్ట్‌కు చెందిన కరీం గవాద్‌ను ఓడించిన ప్రపంచ 35వ ర్యాంక్‌లో ఉన్న అభయ్, డెస్సౌకీపై రెండుసార్లు ఆధిక్యంలోకి వెళ్లాడు. కానీ ఆ తర్వాత ఈజిప్షియన్ ఆటగాడు 66 నిమిషాల్లో 11-13, 11-5, 9-11, 11-3, 11-3 తేడాతో గెలిచాడు. అనేక ఆసియా క్రీడల పతక విజేత అయిన 27 ఏళ్ల అభయ్, తదుపరి అక్టోబర్ 5 నుండి న్యూయార్క్‌లో జరిగే పిఎస్‌ఎ కాంస్య ఈవెంట్‌లో ఆడనున్నాడు. అంతకుముందు, భారత్‌కే చెందిన రమిత్ టాండన్ మొదటి రౌండ్‌లో ఈజిప్ట్‌కు చెందిన టాప్ సీడ్ మోస్తఫా అసల్ చేతిలో 3-0 తేడాతో (4-11, 5-11, 4-11) ఓడిపోయాడు. కాగా మహిళల విభాగంలో, ఏడో సీడ్ మలేషియా శివసంగారి సుబ్రమణ్యం రెండవ రౌండ్‌లో బెల్జియంకు చెందిన నేలే గిలిస్‌ను 3-0 తేడాతో ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌లో చోటు దక్కించుకుంది. ప్లాటినం స్థాయి టోర్నమెంట్‌లో శివసంగారి 11-8, 11-6, 11-5 తేడాతో గెలిచింది.

## వరల్డ్ పారా అథ్లెటిక్స్‌ఛాంపియన్‌షిప్..
### సంజయ్‌కి స్వర్ణం, సందీప్, యోగేష్‌కు రజతం




**న్యూఢిల్లీ:** ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025, పురుషుల జావెలిన్ త్రో ఎఫ్ 44లో సందీప్ సంజయ్ సర్గర్ స్వర్ణంతో మెరవగా, సందీప్ చౌదరి రజతంతోను, పురుషుల డిస్కస్ ఎఫ్ 56లో యోగేష్ కథునియా వరుసగా మూడో రజతం సాధించాడు. న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మంగళవారం జరిగిన ఈ పోటీలో సంజయ్ తన వ్యక్తిగత బెస్ట్ 62.82 మీటర్లతో స్వర్ణం సాధించగా, చౌదరి సీజన్ బెస్ట్ 62.67 మీటర్లతో రజతం సాధించాడు. ఇక బ్రెజిల్‌కు చెందిన ఎడెనిల్సన్ రాబర్టో 62.36 మీటర్లు విసిరి కాంస్యం గెలుచుకున్నాడు, ఇది ఎఫ్42 విభాగంలో ప్రపంచ రికార్డు. ఈ పోటీలో పాల్గొన్న మరో ఇద్దరు భారతీయులు పుష్పేంద్ర సింగ్ (61.94 మీ.), మహేంద్ర గుర్జార్ (57.84 మీ.) వరుసగా 4, 7 స్థానాల్లో నిలిచారు. కాగా ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో రెండుసార్లు రజత పతక విజేత, అర్జున అవార్డు గ్రహీత అయిన భారత్ పారా అథ్లెట్ యోగేష్ కథునియా తన విజయాల జాబితాలో మరో ప్రశంసను జోడించాడు. తన రెండవ ప్రయత్నంలో సాధించిన 42.49 మీటర్ల అత్యుత్తమ త్రో తో, కతునియా రెండవ స్థానంలో నిలిచాడు. బ్రెజిల్‌కు చెందిన క్లాడినీ బాటిస్టా 45.67 మీటర్ల త్రోతో స్వర్ణం సాధించిన తర్వాత రెండవ స్థానంలో నిలిచాడు. గ్రీస్‌కు చెందిన కాన్‌స్టాంటినోస్ జౌనిస్ 39.97 మీటర్ల దూరంతో మూడో స్థానంలో కాంస్యం గెలుచుకున్నాడు. ఫ్రాన్స్, జపాన్‌లలో వరుసగా జరిగిన 2023, 2024 ఎడిషన్‌లలో పోడియంను పూర్తి చేసిన తర్వాత, పురుషుల డిస్కస్ ఎఫ్ 56లో యోగేష్ వరుసగా ఇది మూడో రజతం.

బిజినెస్

# భారత్ ఆర్థికవృద్ధి 6.5% మాత్రమే!
### ఆసియా అభివృద్ధి బ్యాంకు అంచనా

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 30:** భారత్ ఆర్థికవృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.5శాతంగా మాత్రమే ఉంటుందని ఆసియా అభివృద్ధి బ్యాంకు అంచనావేసింది. తొలిత్రైమాసికంలో 7.8శాతం వృద్ధినమోదయినా మొత్తం ఏడాదికి వృద్ధిరేటు 6.5శాతం మాత్రమేనని తెలిపింది అమెరికా సుంకాలు, భారత్ ఎగుమతులు తగ్గుతుండటంతో రెండో అర్ధసంవత్సరంలో ఈ ప్రభావం ఉంటుందని ఎడిబి వెల్లడించింది. ఏప్రిల్‌లో విడుదలచేసిన నివేదికలో భారత్ వృద్ధి ఏడుశాతం అని ప్రకటించిన ఎడిబి ఇపుడు తాజాగా 6.5శాతం ఉన్నట్లు తెలిపింది. తొలిత్రైమాసికంలో జిడిపి వృద్ధి 7.8శాతంగా ఉంది. వినియోగం పెరగడం, ప్రభుత్వ వ్యయం పెరగడంవల్లనే వృద్ధి ఎగువకు వెళ్లిందని అయితేఅమెరికా ట్యారిఫ్‌లవల్ల ఎగుమతులు తగ్గి వృద్ధిక్షీణిస్తుందని ప్రత్యేకించి రెండో అర్థభాగంలోను, 2027లోను ఈ క్షీణత నమోదవుతుందని అంచనావేసింది.



అయితే ఈప్రభావాన్ని దేశీయ డిమాండ్, సర్వీస్ ఎగుమతులు కొంతమేర భర్తీచేయగలవని తెలిపింది. అలాగే ఆర్థికలోటు కూడా బడ్జెట్ అంచనాలు 4.4శాతంకంటే ఎక్కువ ఉంటుందని ఎడిబి తెలిపింది. పన్నురాబడుల వృద్ధిమందగించడం, జిఎస్టీ కోతలు వంటివి వాస్తవ బడ్జెట్‌ను కొంతమేర ప్రభావితంచేస్తాయి. నికరంగాచూస్తే ఆర్థికలోటు జిడిపిలో 4.7శాతంవరకూ ఉంటుందని అలాగే కరెంటు ఖాతా లోటు 0.6శాతం మేర పెరుగుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 0.9శాతంగా ఉంటుందని, 2027లో 1.1శాతానికి నమోదవుతుందని ఎడిబి అంచనావేసింది. ఇక పన్నురాబడులు కూడా 7.5శాతం తగ్గినట్లు అంచనా వేసింది. సెంట్రల్‌బ్యాంకునుంచి అందిన డివిడెండ్ల కారణంగా 4.8శాతం పెరిగి 2.7 లక్షలకోట్లుగా ఉన్నట్లు తేలింది. వ్యయం కూడా 20.2శాతంపెరిగిందని తెలిపింది. సబ్సిడీలు 9.6శాతం మేర తొలిత్రైమాసికంలో తగ్గాయి. ఎరువుల సబిసడీలు మాత్రం 36.9శాతంపెరిగాయి. ఇక విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రభావం కూడా జిడిపి వృద్ధిపై ఉంటాయని ఎడిబి స్పష్టంచేసింది.

# రూ.11,500 కోట్లకు ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఐపిఒ
### అక్టోబరు ఏడున మార్కెట్లకు రాక

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** ఎల్జీ ఎలక్ట్రానిక్స్ అక్టోబరు ఏడో తేదీ ఐపిఒకు వస్తున్నట్లుప్రకటించింది. ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఇప్పటికే డిఆర్‌హెచ్‌పి దాఖలుచేసింది. ఇష్యూధరను బుధవారం ప్రకటిస్తామని యాంకర్ బుక్ వివరాలు కూడా అక్టోబరు ఆరోతేదీ వెల్లడిస్తామని వెల్లడించారు. ఆఫర్ ఫర్ సేల్ కింద 10,18,15,859 ఈక్విటీ వాటాలను రూ.10 ముఖవిలువతో ఐపిఒకు తెస్తోంది. దక్షిణకొరియా ప్రమోటర్ సంస్థ ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇంక్ ఈ అమ్మకాలు చేపట్టింది. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఈ ఐపిఒనుంచి 1.3 బిలియన్ లేదా 11,500 కోట్ల రూపాయలు సమీకరించాలని నిర్ణయించింది. కంపెనీ విలువలు తొమ్మిది బిలియన్ డాలర్లుగా నిర్ణఇంచారు. అంతకుముందు 15 బిలియన్ డాలర్లనుంచి విలువలను కుదించారు. భారత సంస్థలో 15శాతం వాటాను విక్రయించాలనిచూస్తోంది. టాటాక్యాపిటల్ తర్వాత మూడో అతిపెద్ద కంపెనీగా ఎల్జీ ఎలక్ట్రానిక్స్ వస్తోంది. టాటాక్యాపిటల్ రూ.15,500 కోట్లతో వస్తున్న సంగతి తెలిసిందే. అలాగే హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ 12,500 కోట్లు జూన్‌లోనే రాబట్టింది. హుండై మోటార్ తర్వాత రెండో దక్షిణకొరియా ఐపిఒగా చెపుతున్నారు. హుండై గత ఏడాదే 27,800 కోట్లనిధులు సమీకరించింది. ఇపుడు ఎల్జీ హ్యావెల్స్ హ్యావెల్స్ ఇండియా, వోల్టాస్, విర్ల్‌పూల్ ఇండియా, బ్లూస్టార్ ఇతరులతో పోటీగా ఉంది. 50శాతం వాటాలు అర్హత పొందిన సంస్థాగత బిడ్డర్లకు కేటాయించారు. 35శాతం రిటైల్ ఇన్వెస్టర్లు, మిగిలిన 15శాతం ఇతరులకు కేటాయించారు. యాక్సిస్ క్యాపిటల్, సిటీగ్రూప్ గ్లోబల్‌మార్కెట్స్, మోర్గాన్ స్టాన్లీ ఇండియా కంపెనీ, జెపిమోర్గాన్ ఇండియా బిఒఎఫ్‌ఎ సెక్యూరిటీస్ లీడ్‌మేనేజర్లుగా ఉన్నారు. కెఫిన్ టెక్నాలజీస్‌రిజిస్ట్రారుగా ఎల్జీ ఎలక్ట్రానిక్స్ నియమించుకుంది.




# రూ.5.98 లక్షలకోట్లకు పెరిగిన ఆర్థికలోటు!

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 30:** కేంద్ర ప్రభుత్వం ఆగస్టు నెలవరకుగాను జమాపద్దులు నివేదిక విడుదలచేసింది. మొత్తంగా ఆగస్టు నెలాఖరునాటికి రూ.12.83 లక్షలకోట్లు రాబడులు సాధించింది. 2025-26 బడ్జెట్ అంచనాల్లో 36శాతం రాబడులు సాధించినట్లు కేంద్రం స్పష్టంచేసింది. ఈ మొత్తంలో 8.10 లక్షలకోట్లు పన్ను రాబడులు కాగా రూ.4.40 లక్షలకోట్లు పన్నేతర రాబడులు ఇక 31,970 కోట్లు రుణాలకిందకు రాని ఇతర రాబడులుగా ఉన్నాయి. ఈ మొత్తంలో 5.30 లక్షలకోట్లను రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల్లో వాటాగా బదలీచేసింది. ఈమొత్తం గత ఏడాది కంటే 74,431 కోట్లు ఎక్కువ ఉన్నట్లు కూడా తేలింది. ఇక ప్రభుత్వం ఆగస్టువరకూ చేసిన మొత్తం వ్యయం చూస్తే 18.81 లక్షలకోట్లుగా ఉంది. 2025-26 బడ్జెట్ అంచనాల్లో 37.1శాతం వరకూ వ్యయం జరిగినట్లు తేలింది. ఈ మొత్తంలో 14.49 లక్షలకోట్లు రెవెన్యూ ఖాతాలో ఉంటే మరో 4.32 లక్షలకోట్లు మూలధన వ్యయం ఖాతాలో ఉంది. మొత్తం రెవెన్యూ వ్యయంలో రూ.5.29 లక్షలకోట్లు వడ్డీచెల్లింపులు, రూ.1.50 లక్షలకోట్లు మేజర్ సబ్సిడీలకు వెళుతోంది. ఇక మొదటి ఐదునెలల్లో ఈ ఏడాది ఆర్థికలోటు 5.98 లక్షలకోట్లుగా ఉన్నట్లు తేలింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదయిన 27శాతానికి మించి 38.1శాతంగా ఉన్నట్లు ప్రభుత్వ నివేదికలు చెపుతున్నాయి.

### నవంబరునుంచి
## ఎస్‌బిఐ కార్డ్ ఛార్జీలు పెంపు!




**ముంబయి,సెప్టెంబరు 30:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుబంధ సంస్థ ఎస్‌బిఐ కార్డ్ రుసుములు పెంచుతున్నట్లు తెలిపింది. ఫీ స్ట్రక్చర్, ఇతర ఛార్జీలను సవరించినట్లు నవంబర్ 1 నుంచి అమలులోకి తీసుకొస్తున్నట్లు ఎస్‌బిఐ కార్డ్ తెలిపింది. ఎడ్యుకేషన్ సంబంధిత పేమెంట్లు, వాలెట్ లోడింగ్ వంటి ఎంపిక చేసిన ట్రాన్సాక్షన్లకు ఈ కొత్త ఛార్జీలు వర్తిస్తాయని ఎస్‌బిఐ క్రెడిట్ కార్డు యూజర్లు తప్పనిసరిగా కొత్త ఛార్జీలు తెలుసుకోవాలని సూచించింది. క్రెడ్, చెక్, మొబి క్విక్ వంటి థర్డ్ పార్టీ యాప్స్ ద్వారా చేసే ఎడ్యుకేషన్ సంబంధిత పేమెంట్లపై కొత్త ఛార్జీలు వర్తిస్తాయి. ట్రాన్సాక్షన్ మొత్తంలో 1 శాతం ఫీజు ఉంటుందని ఎస్‌బిఐ కార్డ్ తెలిపింది. నేరుగా స్కూల్స్, కాలేజీలు, యూనివర్సిటీలకు నేరుగా పిఒఎస్ ద్వారా పేమెంట్లు చేస్తే ఎలాంటి ఛార్జీలు ఉండవని తెలిపింది. రూ.1000 దాటి వాలెట్ లోడింగ్ ట్రాన్సాక్షన్లు చేస్తే 1 శాతం ట్రాన్సాక్షన్ అమోంట్ ఛార్జీ పడుతుంది. ఎంపిక చేసిన మెర్చంట్ కోడ్స్ పరిధిలోని ట్రాన్సాక్షన్లకు కొత్త ఛార్జీలు వర్తిస్తాయని ఎస్‌బిఐ కార్డ్ తెలిపింది. క్యాష్ పేమెంట్స్, చెక్ పేమెంట్స్, కార్డ్ రీప్లేస్మెంట్, లేట్ పేమెంట్ వంటి వివిధ సేవలకు ఫీ, ఛార్జీలు వసూలు చేస్తోంది ఎస్‌బిఐ కార్డ్. అయితే, ఆయా ట్రాన్సాక్షన్ల ఛార్జీలను ప్రస్తుతానికి మార్చలేదు. ప్రస్తుతానికి క్యాష్ పేమెంట్ ఫీ రూ.250గా ఉంది. అలాగే పేమెంట్ ఆలస్యమేతం 2 శాతం ఛార్జీలు పడతాయి.




## పెరుగుతున్న విదేశీ రుణభారం

**ముంబయి, సెప్టెంబరు 30:** భారత విదేశీ రుణ భారం పెరుగుతోంది. 747.2 బిలియన్ డాలర్లకు చేరింది. 2025 మార్చి నెలాఖరుతోపోలిస్తే 11.2 బిలియన్ డాలర్లు పెరిగినట్లు ఆర్‌బిఐ తన నివేదికలో పొందుపరిచింది. విదేశీ రుణాలు జిడిపి నిష్పత్తితో పోలిస్తే 18.9శాతంగా ఉన్నాయి. మార్చి నెలాఖరుకు 19.1శాతం ఉన్న ఈ నిష్పతి వాటా జూన్ నెలాఖరునాటికి కొంతమేర సర్దుబాటు అయి 18.9శాతంగా ఉంది. డాలరుతో రూపాయి మారకం విలువల వల్లకూడా కొంతమేర ఎక్కువభారం ఉన్నట్లు కనిపించింది. అంతేకాకుండా ఇతర మేజర్ కరెన్సీలు యెన్, యూరో వంటి వాటి ప్రభావం కూడా ఉంది. స్పెషల్‌డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డిఆర్)లు 5.1 బిలియన్ డాలర్ల వరకూ ఉంది. డాలర్ రూపాయి విలువలను పరిగణనలోనికి తీసుకుంటే బాహ్యరుణాలు 6.2 బిలియన్ డాలర్లు పెరిగాయని ఆర్బీఐ తన నివేదికలోస్పష్టంచేసింది. ఇక దీర్ఘకాలిక రుణ భారం కూడా 611.7 బిలియన్ డాలర్లుగా ఉంది. మార్చి 2025తో పోలిస్తే జూన్ చివరినాటికి 10.3బిలియన్ డాలర్లు పెరిగినట్లు ఆర్బీఐ గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి.

## ఎనిమిదోరోజూ
# సెన్సెక్స్, నిఫ్టీలకు నష్టాలే!
### ఆర్బీఐ సమీక్షపైనే ట్రేడర్ల ఫోకస్



**ముంబయి, సెప్టెంబరు 30:** ఈక్విటీ బెంచ్‌మార్క్ సూచీలు ఎనిమిదోరోజు కూడా నష్టాల్లోనే ముగిసాయి. ఎన్‌ఎస్‌ఇ నెలవారీ ఫ్యూచర్ ఆప్షన్ల కాలపరిమితి ముగియడం, ఆర్‌బిఐ ఎంపిసి సమీక్ష వివరాలకోసం ఆతృత వంటివి సూచీలను వెనక్కినెట్టాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకే మొగ్గు చూపించారు. నిఫ్టీ 24,650 దిగువననే ముగిసింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్, మీడియా షేర్లు దిగజారితే పిఎస్‌యు బ్యాంకులు, మెటల్, ఆటో కౌంటర్లు లాభాల్లో ముగిసాయి. మార్కెట్లకు రానున్న రోజుల్లో కంపెనీ రాబడులు,ట్యారిఫ్ విధానాలు కీలకం అవుతున్నాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 97.32 పాయింట్లు క్షీణించి 80,267.62 వద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. నిఫ్టీ 50 సూచీ కూడా 23.80 పాయింట్లు క్షీణించి 24,611.10 వద్ద ముగిసింది. బిఎస్‌ఇలో 2047 కంపెనీల షేర్లు పెరిగితే 2046 షేర్లు క్షీణించాయి. మొత్తం 175 కంపెనీల షేర్లు మాత్రం యధాతథంగా ఉన్నాయి. మిడ్‌క్యాప్‌సూచీ 0.04శాతం పెరిగితే స్మాల్‌క్యాప్ సూచీ స్థిరంగా కొనసాగింది. పదేళ్ల బెంచ్‌మార్క్ బాండ్లు 0.08శాతంపెరిగి 6.57కు చేరాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి చెలామణి 88.76గా నడిచింది. ఎంసిఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో కొంతమేరక్షీణించింది. 0.31శాతంతగ్గి 1,15,085 కి చేరింది. అమెరికా పదేళ్ల బాండ్ల మార్కెట్‌లో 0.22శాతంక్షీణించి 4.132 వద్దనే రాబడులు నిలిచ్చాఇయ. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు 62 సెంట్లు తగ్గి బ్యారెల్‌కు 66.47 డాలర్లుగాక ఒనసాగింది. విదేశీ మార్కెట్లలో యుఎస్ డౌజోన్స్ సూచీ 112 పాయింట్లు క్షీణించింది. యూరోపియన్ మార్కెట్లు మంగళవారం క్షీణతలోనే ముగిసాయి.ఆసియా మార్కెట్లు మాత్రం మిశ్రమంగా ఉన్నాయి. ఇక ఆనంద్‌రాఠి షేర్లు 445.65గాబిఎస్‌ఇలో నడిచాయి. 414 వద్దలిస్ట్ అయితే 7.64 ప్రీమియంతో కొనసాగింది. సోలార్ వరల్డ్ ఎనర్జీ సొల్యూషన్స్ షేర్లుకూడా బిఎస్‌ఇలో 323.20గా ఉన్నాయి. 15.51 డిస్కౌంట్‌ధరకే వెళ్లాయి. ఇక శేషసాయి టెక్నాలజీస్ 411.50కి కొనుగోళ్లు జరిగాయి. 423 ఇష్యూధర అయితే 3.31 డిస్కౌంట్‌కేవెళ్లాయి. డిసిఎక్స్ సిస్టమ్స్ 2.42శాతంపెరిగాయి.భెల్ 1.97శాతం పెరిగితే అతిశయ్ కంపెనీ 1.61శాతం, డిసిఎక్స్ సిస్టమ్స్ 2.42శాతం పెరిగాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.